నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 24.9.2024

హైదరాబాద్ HYDERABAD

పేజీలు: 14+4 Pages: 14+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 110 ‖ వెల (Price) రూ.6.50

సప్తమి

మంగళవారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-10. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: సప్తమి పగలు 12-39 వరకు. నక్షత్రం: మృగశిర రాత్రి 9-54 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: పగలు 3-08 నుంచి సాయంత్రం 4-39 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-19 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 10-56 నుంచి రాత్రి 11-44 వరకు. అమృతకాలం: పగలు 1-10 నుంచి పగలు 2-46 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఆస్కార్ బరిలో

లాపతా లేడీస్

భారత్ నుంచి నామినేట్

› 11




నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..



ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై
కాంగ్రెస్ మూకల దాడి

- వినాయక నిమజ్జనం ముసుగులో అర్ధరాత్రి అరాచకం
- ఎమ్మెల్యే ఇంటి గేటు తోసుకుని వచ్చి మరీ వీరంగం
- ఇంటి పైకి రాళ్లు, ఇటుకలతో మూకుమ్మడి దాడి
- అడ్డుకున్న యువకుడిపై దౌర్జన్యం.. తీవ్ర గాయాలు
- కళ్లెదుటే దాడి జరిగినా వేగంగా స్పందించని పోలీస్



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో కాంగ్రెస్ మూకల రాళ్లదాడిలో ధ్వంసమైన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్, బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు.

ఏపీని చూసి పోలీసులు మేల్కోనాలి

- ప్రభుత్వం మారాక అక్కడ పోలీసు అధికారుల గతి ఏమైందో చూస్తున్నారుగా! చట్టాన్ని అతిక్రమిస్తే అంతే!
- పోలీసులను తీవ్రంగా హెచ్చరించిన హరీశ్‌రావు
- కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే దాడులు
- దాడి చేసినవారిని తక్షణం అరెస్ట్ చేయాలి: హరీశ్

› 2

దాడులతో మా మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: కేటీఆర్



గాంధీ దవాఖానకు బయల్దేరిన మాజీ మంత్రి రాజయ్యను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

నిజ నిర్ధారణపై నిర్బంధం

- గాంధీ ఘటనపై వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన బీఆర్‌ఎస్ కమిటీ సభ్యుల అరెస్ట్
- ఉదయం నుంచే దవాఖాన అష్టదిగ్బంధం
- జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి హౌస్‌అరెస్ట్
- కమిటీపై సర్కార్‌కు వణుకెందుకు?: కేటీఆర్
- వాస్తవాలు వెలుగుచూస్తాయనే అరెస్ట్: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ), సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట: ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సౌకర్యాలపై బీఆర్‌ఎస్ నియమించిన నిజ నిర్ధారణ కమిటీ సోమవారం గాంధీ దవాఖాన పర్యటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను పోలీసులు › 3వ పేజీలో

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

ఫార్మా సిటీ మేడిపల్లిలోనే

హైకోర్టుకు స్పష్టంచేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఆ దిశగా భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నది
- పరిహారం చెల్లింపుపై చర్చలు జరుగుతున్నాయి
- పిటిషన్‌దారులైన రైతులకు రైతుబంధు ఇస్తాం
- పథకాలను వారికీ వర్తింపజేస్తం: ప్రభుత్వం
- నెల రోజుల్లో రైతుల దరఖాస్తులు పరిష్కరించాలి
- హైకోర్టు ధర్మాసనం ఆదేశం.. విచారణ వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలోనే గ్రీన్ ఫార్మా సిటీ ఏర్పాటుకు తాము కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని పేర్కొన్నది. రైతులతో ఘర్షణ వైఖరి ఉండదని, వారి సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేసింది. ఫార్మా సిటీ ఏర్పాటు కోసం జారీచేసిన భూసేకరణ అవార్డు నోటిఫికేషన్‌ను గతంలో సింగిల్ జడ్జి రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అప్పీల్ దాఖలు చేసినట్టు తెలిపింది. అయినప్పటికీ పిటిషనర్లయిన రైతులకు రైతుబంధు, పంట రుణాలు, ఇతర పథకాలను వర్తింపజేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. రైతుబంధు కోసం వారంలోగా దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించింది. రైతులు పంటరుణాలు, రైతుబంధు వంటి › 11వ పేజీలో

అధికారంలోకి రాగానే ఫార్మా సిటీని రద్దు చేస్తాం. సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇస్తాం - **మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ**

ఫార్మాసిటీని రద్దు చేస్తున్నాం, అక్కడ మెగా టౌన్ షిప్‌ను నిర్మిస్తాం **- డిసెంబర్ 13న అధికారులతో సమీక్ష, మీడియా చిట్‌చాట్‌లో సీఎం**

ఫార్మాసిటీ దగ్గర అందుబాటులో ఉన్న 25వేల ఎకరాలను నూతన సిటీగా నిర్మిస్తున్నాం. అందులో యూనివర్సిటీలు, హెల్త్ టూరిజం డెవలప్‌మెంట్, ఈవీ బ్యాటరీలు, స్పోర్ట్స్ విలేజ్, ఐటీ, నాట్ పొల్యూటెడ్ ఫార్మాను డిజైన్ చేస్తున్నాం. **- ఫిబ్రవరి 18న క్రెడాయ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**


ఫార్మాసిటీకి బదులు ఓఆర్‌ఆర్-ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ఫార్మా కస్టర్లు ఏర్పాటు చేస్తాం **- జనవరి 1న మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్‌రోడ్డు మధ్య ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం **- జూలై 5న ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ఫార్మాసిటీని అక్కడే కొనసాగిస్తాం **- సోమవారం హైకోర్టుకు తేల్చి చెప్పిన ప్రభుత్వం**

ఫార్మా రద్దు బూమరాంగ్!

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారంలోనే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు సీఎం ప్రకటన
- ఫోర్త్‌సిటీ పేరుతో 'రియల్ బూమ్'కు ప్రయత్నం
- స్కిల్, స్పోర్ట్స్ వర్సిటీలకు భూముల కేటాయింపు
- మెట్రో, విశాలమైన రోడ్ల పేరిట భారీ హడావుడి
- ఓఆర్‌ఆర్ చుట్టూ ఫార్మా విలేజీల పేరుతో డ్రామా
- ఫార్మా క్లస్టర్లకు వేల ఎకరాల సేకరణ ప్రారంభం
- భూములు తీసుకోవద్దని 'క్లస్టర్' బాధితుల పోరు
- తీసుకున్నవి వెనక్కివ్వాలంటున్న ఫార్మా రైతులు
- ఫార్మాసిటీ ఉంటుందని కోర్టుకు తెలిపిన ప్రభుత్వం
- కోర్టు కేసుతో కాంగ్రెస్ 'ఫ్యూచర్' ఆశలు గల్లంతు?



ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్?

ప్రత్యేక కథనం- 6

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): 'ఫ్యూచర్ సిటీ' పేరుతో తమ భవిష్యత్తుకు ఢోకా లేకుండా చేసుకోవాలనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్లాన్ విఫలమైంది. ఫార్మాసిటీని రద్దు చేసి.. ఫ్యూచర్ సిటీ పేరుతో దాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చి, చుట్టుపక్కల ఉన్న తమ భూముల విలువలు అడ్డగోలుగా పెంచి, లబ్ధి పొందాలనుకుంటే.. మొత్తానికే కథ అడ్డం తిరిగింది. రైతుల పోరాటంతో › 11వ పేజీలో

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి **91827 77711**

• ఈ సర్కారుకు ఓ దండం.. మమ్మల్నికాపాడు కేసీఆర్!



'మా బతుకును నాశనం చేస్తున్నరు. కేసీఆర్ సారూ.. ఈ అన్యాయాన్ని చూడు. మమ్మల్ని మీరే కాపాడాలి' అంటూ తల్లీ కొడుకు వేడుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో అందరినీ కదలించింది. కాప్రా మున్సిపాలిటీలో సోమవారం అధికారులు పలు నిర్మాణాలను, దుకాణాలను కూల్చేశారు. తమ చెప్పుల దుకాణాన్ని కూల్చవద్దంటూ ఓ తల్లీకొడుకు అధికారుల కాళ్లావేళ్లా పడ్డారు.

బ్రదర్ భద్రం.. బడుగులు ఛిద్రం

- హైడ్రా ద్వంద్వ వైఖరి మరోమారు బట్టబయలు
- పేదోడి ఇంటిపైకి శరవేగంగా హైడ్రా బుల్డోజర్లు
- దుర్గం చెరువు ఆక్రమణలపై మీనమేషాలు
- నోటీసులిచ్చిన విషయమే మరిచిన అధికారులు
- రేవంత్ సోదరుడి ఇల్లు ఉండటమే కారణం

హైకోర్టు స్టేతో ఊపిరి పీల్చుకున్న అమర్ సొసైటీ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): ఆక్రమణలపై పాదరసంలా కదిలే హైడ్రా పేదలపైనే ప్రతాపం చూపుతున్నదని మరోసారి నిరూపితమైంది. బడాబాబుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని తేటతెల్లమైంది. మరీ ముఖ్యంగా సర్కారు అండదండలు ఉండే పెద్దల నిర్మాణాల విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నది. పేదల నిర్మాణాలకు ఇలా నోటీసులిచ్చి అలా కూల్చేస్తున్న హైడ్రా.. కావాల్సిన వాళ్లకు మాత్రం కావాల్సినంత సమయం ఇస్తున్నది. వారు తీరిగ్గా కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకునే వరకు తీరుబడిగా ఎదురుచూస్తున్నది. దుర్గం చెరువు పరీవాహక ప్రాంతంలో పదుల ఎకరాల్లో విస్తరించిన అమర్ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ విషయంలో హైడ్రా › 5వ పేజీలో

ఇప్పుడు ఎవరు చేసేదేంది?

- రికార్డులు మారినయ్.. భూమి వచ్చింది
- ప్రభుత్వ ముఖ్యనేత బంధువు ధీమా
- మంఖాల్ భూములపై విచారణ కమిటీ కూడా ఏటూ తేల్చదనే భరోసా › 5

మంఖాల్ భూములపై మరో ట్విస్ట్

అదనపు భూములకు డబ్బు చెల్లించాలని రైతుల డిమాండ్ › 5



మంకీపాక్స్ క్లేడ్-1బీ
తొలి కేసు › 7

- కేరళలో వెలుగులోకి వేరియంట్
- ప్రాణాంతకమన్న డబ్ల్యూహెచ్‌వో

మూడ్రోజులు భారీ వర్షాలు › 2

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- కొనసాగుతున్న గాలింపు › 7

విజయ పాల సేకరణ ధర తగ్గింపు?



ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించకపోవడంపై కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో రోడ్లపై పాలు పారబోసి నిరసన తెల్పుతున్న రైతులు

- లీటర్‌పై 5 తగ్గించే యోచనలో ప్రభుత్వం
- పాడి రైతుల వద్ద చైర్మన్ అమిత్ ప్రతిపాదన
- ప్రభుత్వ సమీక్షలోనూ ధర తగ్గింపుపై చర్చ
- ప్రైవేట్ డెయిరీల తరహాలో చెల్లించే ఆలోచన
- భారం తగ్గాలంటే.. ధరలు దించాల్సిందేనట
- రైతు కోసం సేకరణ ధర పెంచిన బీఆర్‌ఎస్
- నష్టాల పేరిట తగ్గిస్తున్న కాంగ్రెస్ సర్కారు › 6

150 కోట్లకు 50 కోట్లే!

- పాడి రైతులకు పెండింగ్ బిల్లుల విడుదల › 6
- నేడు ఖాతాలో వేస్తామని ప్రభుత్వం ప్రకటన
- 26న పాడి రైతుల ధర్నా నేపథ్యంలో నిర్ణయం



స్పీకర్‌కు హైకోర్టు నోటీసు

- **10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకూ తాఖీదులు**
- **కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం**
- **ఫిరాయింపుదార్లకు జీతభత్యాలు నిలిపివేయాలి**
- **ఆ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అనుమతించకూడదు**
- **ఓటింగ్‌లో పాల్గొనకుండా అనర్హులను చేయాలి**
- **ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కేఏ పాల్ విజ్ఞప్తి**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై గెలుపొంది అధికార కాంగ్రెస్ పార్టీ పంచన చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు నోటీసులు జారీచేసింది. సాధారణంగా స్పీకర్‌కు కోర్టులు నోటీసులు జారీ చేయవు. స్పీకర్ కార్యాలయానికో, స్పీకర్ కార్యదర్శికో నోటీసులు జారీ చేసి సంబంధిత కేసులపై విచారణ చేపడతాయి. అయితే పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించడాన్ని సవాలు చేసిన కేసులో తొలి ప్రతివాదిగా ఉన్న శాసనసభాధిపతి (స్పీకర్)కి నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఆ తర్వాత ఇతర ప్రతివాదులైన రాష్ట్ర శాసనసభ కార్యదర్శి, పదో షెడ్యూల్ మేరకు స్పీకర్ సారథ్యం వహించే ట్రిబ్యునల్, కేంద్ర ఎన్నికల సంఘం, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బీ కృష్ణ మోహన్‌రెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, ఎం సంజయ్‌కుమార్, జీ మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీకి నోటీసులు జారీ అయ్యాయి. పూర్తి › 6వ పేజీలో

లెబనాన్‌పై ఇజ్రాయెల్
ఎయిర్ స్ట్రైక్ › 7

దాడుల్లో 274 మంది మృతి

300 లక్ష్యాలపై దాడులు.. 1,000 మందికి గాయాలు





చైల్డ్‌పోర్న్ చూసినా నేరమే!

- వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే › 7
- దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు
- పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత
- హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య

బద్లాపూర్ రేపిస్ట్ ఎన్‌కౌంటర్



- ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన అక్షయ్ షిండే పోలీసు కాల్పుల్లో హతం
- కస్టడీ నుంచి పారిపోయేందుకు యత్నించగా కాల్పులు జరిపామన్న పోలీసులు › 2

ఎమ్మెల్యే సునీత ఇంటిపై కాంగ్రెస్ దాడి

- వినాయక నిమజ్జనం ముసుగులో అరాచకం
- సునీత ఇంటి లోపలికి వెళ్లి మరీ వీరంగం
- ప్రశ్నించిన యువకుడు మణిదీప్‌పైనా దాడి
- రాళ్లు, ఇటుకలతో ఇంటిపై విధ్వంసం
- ప్రణాళిక ప్రకారమే నా ఇంటిపై దాడి: సునీత
- నలుగురిపై కేసు నమోదు చేశాం: ఎస్సై


మెదక్ జిల్లా గోమారంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నివాసంపై ఇటుకరాళ్లతో దాడి చేసిన దృశ్యం


గాయపడిన యువకుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబర్ 23: బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడులు కొనసాగుతున్నాయి. మొన్న సిద్దిపేటలో హరీశ్‌రావు కార్యాలయంపై, నిన్న హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, నేడు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం ముసుగులో సునీత ఇంటి ముందు పటాకులు కాల్చి నానా హంగామా చేశారు. ఆమె ఇంట్లోకి వెళ్లి టపాకులు కాల్చే ప్రయత్నం చేయగా అడ్డుకుని ప్రశ్నించిన యువకుడు మణిదీప్‌పై దాడికి దిగారు. అంతటితో ఆగకుండా ఇటుకలు, కట్టెలతో ఇంటిపై దాడిచేశారు. విషయం తెలిసి అక్కడికి వచ్చిన స్థానిక బీఆర్ఎస్ నేతలను కూడా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించిన పోలీసులను సైతం కాంగ్రెస్ నాయకులు తోసివేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

ఇది ప్రజాస్వామ్యమేనా?: సునీత

తన ఇంటిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తన ఇంటిపై దాడితో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. ప్రణాళిక ప్రకారమే తన ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. ఇంట్లో నిద్రపోతున్న పిల్లలపైనా దాడిచేశారని ఆరోపించారు. దాడులు ఎందుకు చేశారు? వాటి వెనక ఉన్నదెవరు? కారణమేంటి? అని ప్రశ్నించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, దాడికి పాల్పడిన వారిపైన, వారిని ప్రోత్సహించిన వారిపైనా హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తమకు సంస్కారం నేర్పబట్టే సైలెంట్‌గా ఉంటున్నామని పేర్కొన్నారు. పోలీసుల నిర్లక్ష్యంగా కారణంగానే దాడులు జరిగాయని ఆరోపించారు. హెడ్‌కానిస్టేబుల్‌పై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎమ్మెల్యేను పరామర్శించారు.

అకారణంగా నాపై దాడి

'ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంట్లో ఉంటున్న నాపై కొందరు కాంగ్రెస్ నాయకులు అకారణంగా దాడి చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో కొందరు కాంగ్రెస్ నాయకులు పటాకులు ఎమ్మెల్యే ఇంటి గేటు లోపలికి వచ్చి కాల్చే ప్రయత్నం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే గుంటాల నర్సింహారెడ్డి, పెద్దపట్లోరి భాస్కర్‌రెడ్డి, నాగులూరి సుధాకర్‌రెడ్డి, సర్జన రమేశ్ అన్యాయంగా దాడి చేశారు' అని మణిదీప్ గౌడ్ వివరించాడు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఇంట్లో ఉన్న మణిదీప్‌గౌడ్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసినట్టు చెప్పారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు



"మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయటం అత్యంత హేయమైన చర్య. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ దాడులతో సునీతా లక్ష్మారెడ్డి వంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు.

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తక్షణమే అరెస్టు చేయాలి



మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ గూండాలను వెంటనే అరెస్టు చేయాలి. దాడులతో బీఆర్ఎస్ పార్టీని, మహిళా ప్రజాప్రతినిధులను భయపెట్టివ్వాలనుకోవడం కాంగ్రెస్ పార్టీ మూర్ఖత్వమే.

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రాష్ట్రంలో రాక్షసపాలన



ఇందిరమ్మ పాలన తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగిస్తున్నది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్న. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణను బీహార్ మాదిరిగా మార్చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి.

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

పోలీసులు ఏపీని చూసి మేల్కోవాలి

- ప్రభుత్వం మారాక అక్కడ పోలీసు అధికారుల గతి ఏమైందో చూస్తున్నారుగా
- చట్టాన్ని అతిక్రమిస్తే జరిగేది ఇదే
- పోలీసులను హెచ్చరించిన హరీశ్‌రావు
- రాష్ట్రంలో బీహార్, రాయలసీమ పరిస్థితులు
- ఎమ్మెల్యే సునీత ఇంటిపై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి
- గోమారంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు


మెదక్ జిల్లా గోమారంలో విలేకరులతో మట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు

మెదక్/నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబర్ 23: పోలీసు తాము శాశ్వతమని అనుకోవద్దని, పొరుగు రాష్ట్రం ఏపీని చూసైనా నేర్చుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హితవు పలికారు. చట్టాన్ని ఉల్లంఘించిన ఆంధ్రప్రదేశ్‌లోని అడిషనల్ ఐజీలు, డీజీలు సస్పెండయ్యారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో గూండా రాజ్యాన్ని తలపించేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి తెలంగాణను బీహార్‌లా మారుస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వ ప్రోత్సాహంతోనే జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి జరిగినట్టు తెలుసుకున్న హరీశ్‌రావు శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చేరుకొని సునీతను పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమెతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గుండాల రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపై, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, ఇప్పుడు గోమారంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపైన కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడ్డారని మండిపడ్డారు. తెలంగాణకు ఉన్న మంచి పేరును నాశనం చేసి బీహార్, రాయలసీమ తరహాలో మారుస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటలు, ఆయన రెచ్చగొట్టే విధానంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇంట్లో పటాకులు పేల్చి, పిల్లలపై దాడి చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్పీ, ఐజీతో మాట్లాడి కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని కోరినట్టు తెలిపారు. ఫొటోలు, వీడియోలు తీస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి జరిగినప్పుడు సుమోటోగా తీసుకొని ఆయన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చుకదా.. ఎందుకు చేయడం లేదని పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎమ్మెల్యేపై కూడా ఇలాంటి దాడి జరగలేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలతో తమది పేగుబంధమని, ఎక్కడా ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా తాము చాలా జాగ్రత్తగా వ్యవహరించినట్టు తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు కూడా అలానే వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు. ఇంట్లోకి చొరబడి దాడిచేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలని సూచించారు. ఘటనపై పిటిషన్ ఇచ్చినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని, తక్షణమే గోమారంలో కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా అర్ధరాత్రి దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనిని వదిలిపెట్టే సమస్యే లేదని, అవసరమైతే జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, కోర్టుకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

గోమారం ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం కలసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మఠం భిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు

'కాళేశ్వరం'పై కాంగ్రెస్‌కు అవగాహన లేదు

ఆరు కొత్త ప్రాజెక్టులు కట్టించిన చరిత్ర కేసీఆర్‌ది : మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వెల్లడి

జమ్మికుంట, సెప్టెంబర్ 23: 'కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే దిక్సూచి. ఆలాంటి ప్రాజెక్టుపై కనీసం అవగాహన లేకుండా సీఎం, మంత్రులు మాట్లాడుతున్నరు. లక్ష కోట్లు వృథా చేశరని, పైసలన్నీ గోదావరిలో పోశరని ఆరోపిస్తున్నరు. ప్రకృతి విపత్తుతో మేడిగడ్డకు చెందిన పిల్లర్ కుంగింది. దీనిని రాద్ధాంతం చేస్తున్నరు. ప్రాజెక్టు కొట్టుకుపోవాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నరు. కాళేశ్వరమంటే ఒక్క మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలే కాదు.. ఈ మూడు బ్యారేజీలకు పెట్టిన ఖర్చు కేవలం రూ.9,500 కోట్ల లోపే. వందల కిలోమీటర్ల సొరంగాలు, కాలువలు, ఎత్తిపోతలు, లిఫ్టులు, విద్యుత్తు సబ్‌స్టేషన్లు.. ఇలా ఎన్నో నిర్మాణాలకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేసినం. తెలంగాణ రైతాంగానికి భవిష్యత్తు అందించినం. రాబోయే రోజుల్లో సోలార్ ప్యానళ్లతో కాళేశ్వరం సాగుతుంది. ఇదీ కేసీఆర్ విజన్. కాళేశ్వరం గురించి తెలియాల్సిన ప్రాథమిక సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. సోమవారం ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి వచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు నివాసంలో వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకున్న తర్వాత ఆరు ప్రాజెక్టులను కట్టించిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని పేర్కొన్నారు. ఎల్లంపల్లి, ప్రాణహిత, చేవేళ్ల, టీడీపీ విడిచిపెట్టిన దేవాదుల, ఇంద్రావతి, సీతమ్మసాగర్, మల్లన్నసాగర్, అనంతసాగర్, రంగనాయకసాగర్ తదితర పాత ప్రాజెక్టులకు రీడిజైన్లతోపాటు కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. పిల్లర్ కుంగితే రాద్ధాంతం చేయడం తగదని సూచించారు.

కోర్టుల్లో 5.84 కోట్ల కేసులు పెండింగ్

తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దేశ న్యాయవ్యవస్థ దారుణమైన స్థితిలో ఉన్నదని, ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి వివిధ కోర్టుల్లో 5.84 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తమిళనాడు మాజీ గవర్నర్, ఏపీ మాజీ డీజీపీ పీఎస్ రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కీ)లో సోమవారం జరిగిన ప్రొఫెసర్ ఎస్ వేణుగోపాలరావు 5వ స్మారకోపన్యాస కార్యక్రమంలో రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. కొత్త చట్టాల్లో పేర్ల మార్పులే తప్ప గణనీయమైన మార్పులేమీ లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో అస్కీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ రమేశ్ కుమార్, గుడ్‌గవర్నెన్స్ చైర్మన్ కే పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అటాక్.. పోలీస్ సైలెంట్!

- పచ్చని తెలంగాణలో అధికారపక్షం చిచ్చు
- కాంగ్రెస్ ఆగడాలపై అరెస్టులేవి?
- ఫ్యాక్షన్ సంస్కృతికి కాంగ్రెస్ ఆజ్యం
- ఎమ్మెల్యేల ఇంటిపై దాడి చేస్తే చర్యల్లేవా
- ఒక్కరిపైనా చర్యలు తీసుకోని పోలీసులు
- డీజీపీ, ఐజీలకు విన్నవించినా అరెస్టుల్లేవ్



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో అధికారపక్షం చిచ్చ రాజేస్తున్నది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వమే.. తమ కాంగ్రెస్ శ్రేణులను బీఆర్ఎస్ నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్నది. రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నది. ప్రతిపక్షం ప్రశాంతంగా తమ పని తాము చేసుకుపోతుంటే అధికారపక్షం మాత్రం రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి కవ్వింపు చర్యలు చేపడుతున్నది. పోలీసులు సైతం అధికార పక్షానికి వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలున్నాయి.

పోలీసుల పక్షపాత వైఖరి


రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి పోలీసుల పక్షపాత వైఖరే కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. పది నెలలుగా అధికార పక్షంపై రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతున్నా పోలీసులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారు. సాక్షాత్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపైనే కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడితే వారిని అరెస్టు చేయకపోవడం పోలీసుల పక్షపాతవైఖరిని స్పష్టం చేస్తున్నది. ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయగా, ఆ తర్వాత పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి నానా హంగామా సృష్టించారు. తాజాగా మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి కాంగ్రెస్ శ్రేణులు చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఇంటి బయట, నట్టింట్లో పటాకులు కాల్చారు. నిద్రపోతున్న పనివారిపై భౌతిక దాడులకు తెగబడి, తీవ్రంగా గాయపర్చారు. ఈ దాడిని వీడియో తీస్తున్న ఓ కానిస్టేబుల్‌పైనా భౌతికదాడికి పాల్పడి పాల్పడ్డారు. అయినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. అరెస్టులు అసలే లేవు.

కేసులు, అరెస్టుల ఊసే లేదు

బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేసినా, వారి ఆస్తులు ధ్వంసం చేసినా కేసులు కానీ, అరెస్టులు కానీ ఉండటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో ఈ తరహా దాడులు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నా ఒక్కర్ని కూడా అరెస్ట్ చేయకపోవడం గమనార్హం. కొందరిపై కేసులు పెట్టి పోలీసులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఖమ్మంలో పేదలకు సాయం చేసేందుకు బీఆర్ఎస్ అగ్రనేతలు వెళ్తే అక్కసుతో దాడికి పాల్పడినా అరెస్టులు లేవు. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేసినా అరెస్టులు లేవు. నల్లగొండలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడినా అరెస్టులు లేవు. పాడి కౌశిక్‌రెడ్డి అంశంలో ఎమ్మెల్యే గాంధీ, అతని అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినా అరెస్టు లేదు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడికి చేస్తే అరెస్టులు లేవు. ఈ వరుస సంఘటనలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇటీవల డీజీపీని కలిసి వినతిపత్రం సైతం అందించారు. నర్సాపూర్ దాడిపై మాజీ మంత్రి హరీశ్‌రావు డీజీపీ జితేందర్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీలతో మాట్లాడినా చర్యలు శూన్యం.

నన్ను చంపేందుకు కొమ్మూరి కుట్ర!

- సుపారి గ్యాంగ్‌తో రూ.25 లక్షలకు డీల్
- కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కంచె రాములు ఆరోపణ
- వెస్ట్ జోన్ డీసీపీకి ఆధారాల సమర్పణ
- ఫ్యాక్షన్ తరహా రాజకీయాలపై ఆందోళన
- రక్షణ కల్పించాలంటున్న సొంతపార్టీ నాయకులు


జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తున్న అసమ్మతి వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు

జనగామ, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): జనగామ కాంగ్రెస్‌లో వర్గపోరు, గ్రూపుల కుమ్ములాటలు ఫ్యాక్షన్ తరహా రాజకీయాలకు తెరలేపుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనను హతమార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని సొంత పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇసుక లారీతో గుద్దించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు రూ.25 లక్షలకు సుపారి గ్యాంగ్‌తో డీల్ కుదుర్చుకున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియో ఆధారాలను సమర్పించారు. ఈ ఘటన జిల్లా కాంగ్రెస్‌లో పెను సంచలనం రేపింది. కొమ్మూరి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మున్సిపల్, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్ధయ్య, సర్వల నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు గంగరబోయిన మల్లేశం, ముత్యాల చందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, జాయ మల్లేశం, గాదెపాక మహేందర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, చింత కింది మల్లేశం, పులిగిల్ల శివ తదితర సీనియర్లు డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ డీసీపీకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తాను 30 ఏండ్లుగా వివిధ హోదాల్లో సేవలందించానని, గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని రాములు పేర్కొన్నారు. కొంతకాలంగా సీనియర్లకు దక్కాల్సిన పదవులను జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అమ్ముకున్నాడని పార్టీ అధిష్ఠానికి ఫిర్యాదు చేశామని, దీనిని దృష్టిలో ఉంచుకొని కొమ్మూరి తమపై కక్షసాధింపులకు పాల్పడుతున్నాడని, అందులో భాగంగా కొద్దినెలల క్రితం మాజీ మున్సిపల్ చైర్మన్ వై సుధాకర్ కారును పెట్రోల్ పోసి దగ్ధం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా తన అనుచరుడైన రావుల శ్రీనివాస్‌రెడ్డిని కొమ్మూరి పిలిపించుకొని రూ.25 లక్షల సుపారీ ఇచ్చి తనను ఇసుక లారీతో ఢీకొట్టించి హతమార్చేందుకు కుట్రపన్నాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని సీనియర్ నాయకుల ముందు శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన వీడియో రికార్డును కంచె రాములు డీసీపీకి అందజేశారు. జనగామలో ఫ్యాక్షన్ రాజకీయాలతో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రయత్నిస్తున్న ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తనతోపాటు సీనియర్ నాయకులకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరారు.

లోకం పోకడ



డస్టర్లు లేకుంటే మాత్రం
మా బట్టలిప్పి తుడుస్తారేం సార్?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.8°c	23.6°c
మెదక్	35.0°c	22.1°c
వరంగల్	34.0°c	25.0°c
నిజామాబాద్	33.4°c	24.4°c
రంగారెడ్డి	33.0°c	21.0°c
హైదరాబాద్	32.4°c	22.3°c
కరీంనగర్	32.0°c	26.0°c
ఖమ్మం	31.0°c	25.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
మహబూబ్‌నగర్	29.1°c	23.2°c

3 రోజులపాటు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తిరోగమన రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాగల మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో మంగళవారం నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్‌ను జారీ చేసింది.

గడిచిన 24 గంటల్లో..

సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 16.28 సెంమీకు గాను సోమవారం నాటికి 25.96 సెంమీ నమోదైంది. ఇది నిరుటితో పోలిస్తే 95 అధికం. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, వనపర్తి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్టు వాతావరణ కేంద్రం తెలిపింది.

జీతాలు పెండింగ్‌లో లేవు

వైద్యారోగ్య శాఖ వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల ఇతర జిల్లాల్లోకి వెళ్లిన సిబ్బందికి జీతాలు, అలవెన్స్‌లు పెండింగ్‌లో లేవని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. బదిలీ అయిన సిబ్బందికి భత్యాలు లేవంటూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితమవడంతో వైద్యారోగ్య శాఖ ఈ వివరణ ఇచ్చింది. బదిలీపై సిద్దిపేట జిల్లాకు వెళ్లిన ఐదుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లతోపాటు ఇతర జిల్లాల్లోని సిబ్బందికి సైతం సక్రమంగా వేతనాలు అందుతున్నాయని పేర్కొన్నది.

ఎన్‌కౌంటర్‌లో బద్లాపూర్ రేపిస్ట్ హతం

ముంబై, సెప్టెంబర్ 23: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బద్లాపూర్ లైంగికదాడుల కేసులో నిందితుడు పోలీసుల కాల్పుల్లో మృతి చెందాడు. మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ స్కూల్‌లో ఇటీవల ఇద్దరు నాలుగేండ్ల విద్యార్థినులపై లైంగికదాడులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న నిందితుడు షిండే సోమవారం సాయంత్రం పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యాడు. జైలు నుంచి తరలిస్తున్న సమయంలో అతడు ఓ పోలీసు వద్ద నున్న తుపాకీ గుంజుకొని కాల్పులు జరిపాడని, తాము జరిపిన ఎదురు కాల్పులు జరుపగా నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడని అధికారులు తెలిపారు. ఓ సీనియర్ పోలీస్ అధికారి కథనం ప్రకారం.. లైంగిక దాడుల కేసులో జైలులో ఉన్న నిందితుడు షిండేపై గతవారం అతడి రెండో భార్య బోయిసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని ఆరోపించింది. ఈ కేసులో ప్రశ్నించేందుకు నిందితుడిని పోలీసులు సోమవారం సాయంత్రం 5.30 గంటలకు తలోజా జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకున్నారు. అక్కడి నుంచి పది మంది పోలీసుల బందోబస్తు మధ్య స్టేషన్‌కు తరలిస్తుండగా వాహనం ముంబ్రా బైపాస్ వద్దకు చేరుకోగానే తన పక్కనే కూర్చున్న ఏఎస్ఐ వద్దనుంచి నిందితుడు తుపాకీ లాక్కొని కాల్పులు జరిపాడు. దీంతో ఏఎస్ఐ కాలులోకి బుల్లెట్లు దిగాయి. ఆ పక్కనే కూర్చున్న మరో అధికారి వెంటనే స్పందించి నిందితుడిపై మూడురౌండ్లు కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన షిండేను ఛత్రపతి శివాజీ మహరాజ్ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు' అని వివరించారు.


ఇరిగేషన్ సీఈతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నీటిపారుదల శాఖతో ఏం లాభం?

- లక్షల ఎకరాలు ఎండిపోయాక నీళ్లిస్తరా?
- నీటిపారుదల అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- పనుల ఆలస్యంపై వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
- ఖమ్మం జిల్లా పాలేరులో సాగర్ కాల్వ మరమ్మతు పనుల పరిశీలన

హరీశ్‌రావు ఎఫెక్ట్

కూసుమంచి, సెప్టెంబర్ 23: 'వరదల కారణంగా దెబ్బతిన్న సాగర్ కాల్వల పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? 20 రోజులు దాటినా ఇంకా ఎన్ని రోజులు చేస్తరు? నీటిపారుదల శాఖ ఉండి ప్రయోజనం ఏమిటి? జిల్లాలో లక్షలాది ఎకరాల పంట ఎండిపోయిన తర్వాత నీరిచ్చి ఏం లాభం?' అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇరిగేషన్ అధికారులు, కాల్వ మరమ్మతు పనులు చేస్తున్న కాంట్రాక్టరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ మంత్రి టీ హరీశ్ రావు సోమవారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా పాలేరు కాల్వకు మరమ్మతులు చేపట్టకపోవడంపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేసిన కొద్ది సమయంలోనే మంత్రి తుమ్మల స్పందించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం.

ఆలస్యానికి కారణమెవరు?

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో గండిపడిన సాగర్ కాల్వ మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్ రన్ వేయగా.. మళ్లీ యూటీ మధ్యలో వాల్ క్రాక్ ఇచ్చి కూలిపోవడంతో శనివారం నుంచి మరమ్మతు పనులు చేపట్టారు. పనులు ఆలస్యమవుతుండడంతో ఆయకట్టు పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లోని పొలాలకు నీరందకపోవడంతో మంత్రి తుమ్మల మండిపడ్డారు. పనుల ఆలస్యానికి ఎవరు కారణమో తెలుసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న మంత్రి తుమ్మల పాలేరు కాల్వ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గండిపడిన తర్వాత మరమ్మతు చేసి ట్రయల్ రన్ వేసే క్రమంలో మళ్లీ వాల్ కూలిన తీరును మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్‌తో మంత్రి మాట్లాడుతూ.. 'మీ డిపార్ట్‌మెంట్ ఎందుకు ఉంది? రైతుల పంటలకు నీరు అవసరం ఉన్న సమయంలో ఇవ్వకుండా.. మీరంతా ఎందుకు? అసలు మీ ప్లాన్ ఏమిటి?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఆలస్యం ఎందుకు అవుతున్నదని కాంట్రాక్టర్ ముత్తయ్యను ప్రశ్నించారు. ఇంతమంది ఉండి.. కాల్వ వాల్ బలహీనంగా ఉన్నప్పుడు గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు లేకపోవడంతో 20 రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారని, మీరంతా ఉండి ఏం చేస్తున్నట్టని మంత్రి ప్రశ్నించారు. రెండోసారి జరిగిన కాల్వ లీక్‌పై ఆరా తీశారు. ఎప్పటి వరకు నీరు ఇస్తారు? యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి వచ్చిన రోజు కాల్వను మూసివేసి పనులు చేయమని చెప్పాం. కానీ ప్రయోజనం లేదని అన్నారు. అధికారుల సమన్వయ లోపం వల్లే పనుల్లో జాప్యం జరుగుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీఈ విద్యాసాగర్, గుత్తేదారు ముత్తయ్య, ఈఈలు వెంకటేశ్వర్లు, ఏసీపీ తిరుపతిరెడ్డి, అనన్య, డీఈలు, నాయకులు రవికుమార్, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేశ్, వీరభద్రం, ఉపేందర్, మోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నీళ్లున్నా ఎండబెట్టారు!

- 22 రోజులైనా కాలువ గండిని పూడ్చలేరా?
- కూల్చివేతలేనా? పూడ్చివేతలు రావా?
- రైతుల కన్నీళ్లు కనిపించడంలేదా?
- ముగ్గురు మంత్రులున్నా ఏం లాభం?
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా పొలాలకు నీళ్లెందుకివ్వరు?
- ఎండిన పొలాలకూ ఎకరాకు 25 వేలు పరిహారం ఇవ్వాలి
- వర్షాలతో దెబ్బ తిన్న పంటలకు పైసా ఇవ్వలేదు
- త్వరలో ఖమ్మంలో బీఆర్‌ఎస్ పర్యటన : హరీశ్‌రావు

> దేవుడా, రామచంద్రస్వామీ..! ఈ ముఖ్యమంత్రిని క్షమించు.. రైతులను రక్షించు.. కాలువ నీళ్లు ఎప్పుడైతదో తెలుస్తలేదు.. ఖమ్మం జిల్లా మీద మంచి వర్షాలు పడి పంటలను కాపాడే విధంగా రైతులను దీవించి, రైతులను రక్షించు..! -హరీశ్‌రావు

> రైతుభరోసా ఇవ్వరు.. పూర్తి రుణమాఫీ చేయరు.. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వరు.. జానెడు గండిని పూడ్చలేరు.. మిగిలిన పంటలకు కనీసం సాగునీళ్లు ఇవ్వరు.. ఇంకెందుకు మీరు అధికారంలో ఉండి? 22 రోజులుగా నిద్రపోతున్నారా? ఇదేనా రైతు ప్రభుత్వం అంటే..? -హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా నాగార్జునసాగర్ నిండుగా నీళ్లున్నా కడమ కాలువ పరిధిలోని ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు పడిన గండిని 22 రోజులైనా పూడ్చడం చేతగాని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. వానలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలతోపాటు సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు కూడా ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఏం లాభం? జానెడు గండిని పూడ్చలేక 22 రోజులుగా నిద్రపోతున్నారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా నుంచి తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే.. రెండున్నర లక్షల ఎకరాల పంటలు ఎండబెడతారా? అని మండిపడ్డారు. ఖమ్మం రైతులు కన్నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం, నీటిపారుదల శాఖ మంత్రి నిర్లక్ష్యం, ముఖ్యమంత్రి పట్టింపు లేకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో పంటలు ఎండిపోతున్నా, రైతులు ధర్నాలు చేస్తున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని విమర్శించారు. జిల్లాలో గత సంవత్సరం ప్రకృతి తెచ్చిన కరువు రాగా, ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్ల కరువు వచ్చిందని మండపడ్డారు. ఖమ్మం జిల్లాలో ఒకవైపు వరదల వల్ల, మరోవైపు సాగర్ ఆయకట్టుకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని వివరించారు. 'ముందు దగా, వెనక దగా, కుడి ఎడమల దగా, కాంగ్రెస్ పాలనలో రైతు గుండె మంట భగ భగ' అన్నట్టుగా పరిస్థితి ఉన్నదని చెప్పారు. గండి పూడ్చడానికి సీనియర్ ఇంజినీర్లను పెట్టి ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రింబవళ్లు పనిచేయించవచ్చని సూచించారు. కాలువ గండిని పూడ్చలేని ప్రబుద్ధులు, గతంలో కాళేశ్వరం గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లారని ఎద్దేవా చేశారు.

కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావు

కాంగ్రెస్ సర్కారుకు కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టడం మీ ప్రాధాన్యమా? రైతులకు నీరు ఇవ్వడం రాదా? కాంగ్రెస్‌కు రైతుల పట్ల జాలి, దయ లేవా? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను తిట్టడంలో పోటీపడుతున్న మంత్రులు నీళ్లు ఇవ్వడంలో పోటీ పడలేరా? అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం, నీటిపారుదల శాఖ మంత్రి నిర్లక్ష్యం, ముఖ్యమంత్రి పట్టింపు లేకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఒక మంత్రి అమెరికాలో ఉన్నారని, ఇంకో మంత్రి బీఆర్‌ఎస్‌ను తిట్టే పనిలో బిజీగా ఉన్నారని, ఇంకో మంత్రి వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు నయాపైసా సాయం చేయలేకపోయారని పేర్కొన్నారు.

ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

పంట నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.25 వేల చొప్పున అందజేయాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని హరీశ్‌రావు తెలిపారు. గతంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా రూ.25 వేల నష్టపరిహారాన్ని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పటివరకు పంట నష్టపోయిన ఒక్క రైతుకు కూడా సాయం చేయలేదని, తక్షణమే సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ నీరు ఇచ్చినా పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. సాగర్ ఆయకట్టు కింద నీళ్లు అందక ఎండిపోయిన పంటలను సర్వే చేసి వారికి కూడా ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వరదల వల్ల 60 వేల ఎకరాలు, కాంగ్రెస్ నిర్వాకం వల్ల లక్ష ఎకరాలకుపైగా నష్టపోయిందని ప్రాథమికంగా అంచనా వేశామని చెప్పారు.

సీతారామ ఏమాయె...?

ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు 70 రోజుల్లో ప్రాజెక్టును పూర్తిచేశామంటూ గొప్పలు చెప్పుకున్నారని, మరి ఈ ప్రాజెక్టు ద్వారా దిగువన ఉన్న వైరా రిజర్వాయర్‌ను నింపి, దాని పరిధిలో 1.70 లక్షల ఎకరాలకు నీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీతారామస్వామి మీద ఒట్టు పెట్టి.. మాట తప్పారని, దేవున్ని కూడా మోసం చేశారని మండిపడ్డారు.

ఫిరాయింపులపై ఇంకా బుకాయింపులా?

అబద్ధం అతికేటట్టు ఉండాలన్న విషయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలుసుకోవాలని, ఫిరాయింపులపై ఆయన అతి తెలివితేటలు ప్రదర్శిస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలవాలనుకుంటే అధికారిక కార్యక్రమాల్లో కలుస్తారని, పార్టీ మీటింగ్‌లో కాదనే విషయాన్ని శ్రీధర్‌బాబు గ్రహించాలని చెప్పారు. సొంత నియోజకవర్గానికి సీఎం వచ్చారనే ఉద్దేశంతో అరికెపూడి గాంధీ కలిసిందే నిజమైతే, మరి ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి ఎందుకొచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలను ఖూని చేస్తూ నగ్నంగా బయటపడ్డారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు శివకుమార్, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

మరోసారి ఖమ్మం పర్యటన

ఖమ్మ జిల్లా రైతులు ఏం పాపం చేశారు? తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిచడం వాళ్ల పాపమా? జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటమే శాపమా? ఖమ్మం జిల్లా రైతులు చేసిన తప్పేమిటి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజకీయ జీవితం ఇచ్చిన ఖమ్మం జిల్లా ప్రజలకు మీరు ఇచ్చే బహుమానం ఇదేనా? వరదల్లో కొట్టుకుపోయిన ఇండ్లకు నష్ట పరిహారం ఇవ్వరా? అని నిలదీశారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున త్వరలో మరోసారి ఖమ్మం జిల్లాకు వెళ్తామని, రైతులకు మనోధైర్యం ఇస్తామని చెప్పారు. నీళ్లు లేక రైతులు ట్యాంకర్లు, జనరేటర్లు పెట్టుకొని పంటలు తడుపుకొంటున్నారని చెప్పారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే తమపై దాడులు చేశారని, ఇప్పటివరకు దాడి చేసిన వారిపై కేసు పెట్టలేదని చెప్పారు. తాము దాడులకు భయపడేది లేదని హెచ్చరించారు.

నేటి నుంచి హైదరాబాద్‌లో 'స్పేస్‌టూన్'

ప్రారంభించనున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు 'స్పేస్‌టూన్' పేరిట స్పేస్ థీమ్ కార్టూన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రారంభించనున్నట్టు హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ చైర్మన్ శంకర్, కార్యదర్శి మృత్యుంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఎంతైనా కష్టపడండి.. నీళ్లివ్వండి

- పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- రేయింబవళ్లు పనులు కొనసాగాలి
- పని ప్రదేశంలో లైటింగ్ లేకపోవడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- పాలేరు కాల్వ పనుల పరిశీలన


పాలేరు కాల్వ వద్ద పనులను సోమవారం రాత్రి పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హరీశ్‌రావు ఎఫెక్ట్

కూసుమంచి, సెప్టెంబర్ 23: పాలేరు కాల్వ మరమ్మతులో నిర్లక్ష్యం పనికిరాదని, యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు పనిచేసి సాధ్యమైనంత త్వరగా సాగుభూములకు నీరందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ఖమ్మం జిల్లా పాలేరు కాల్వ మరమ్మతులు చేపట్టకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విలేకరుల సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేసిన సాయంత్రమే మంత్రి పొంగులేటి స్పందించి, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం. సోమవారం రాత్రి పాలేరు కాల్వకు పడిన గండి ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి అధికారులతో మాట్లాడారు. 'జిల్లాలో రైతుల సాగు భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి విడుదలలో ఆలస్యం కావొద్దు.. మీరు ఎంత కష్టపడతారో తెలియదు. కానీ.. నీరు మాత్రం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మళ్లీ అర్ధరాత్రి ఇక్కడికి వస్తాను' అని అధికారులకు తెలిపారు. పని ప్రదేశంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్డీవో గణేశ్, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ అనన్య, డీఈ మధు, కాంట్రాక్టర్ ముత్తయ్య, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్ తదితరులు ఉన్నారు.

సార్.. దవాఖానల్లో మందుల్లేవు!

- టీజీఎంఎస్ఐడీసీ ఎండీకి ఫార్మాసిస్టుల స్పష్టం
- అక్టోబర్ 15 నాటికి తెప్పిస్తామన్న ఎండీ
- కొరతను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వ యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా ఉన్నదని ఫార్మాసిస్టులు టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బోర్కడేకు స్పష్టంచేశారు. దవాఖానల్లో మందుల కొరతపై ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆయన ఫార్మసిస్టులను హైదరాబాద్‌కు పిలిపించుకొని చర్చించారు. ఈ సందర్భంగా దవాఖానల్లో ఏయే మందులు, సర్జికల్స్ లేవో వారు వివరించారు. ఈ సందర్భంగా ఎండీ స్పందిస్తూ.. కొన్ని మందుల ఆర్డర్ పెండింగ్‌లో, మరికొన్ని సరఫరా దశలో ఉన్నాయని, ఇంకొన్ని నాణ్యత పరీక్షలకు పంపామని వివరించినట్టు తెలిసింది. అత్యవసర మందులు, సర్జికల్స్ జాబితాను రూపొందించామని, వీటిని అక్టోబర్ 15 నాటికి సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎండీ వారితో చెప్పినట్టు సమాచారం.

నివేదిక ఎందుకిచ్చారని ఆగ్రహం..

ఇటీవల కామారెడ్డి జిల్లాలో కలెక్టర్ దవాఖానను సందర్శించగా అధికారులు మందుల కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. అందుబాటులోలేని మందుల జాబితా ఇవ్వాలని సూచించా రు. ఫార్మసిస్టు జాబితాను కలెక్టర్‌కు అం దించగా, టీజీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారులు సదరు ఫార్మసిస్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారట. మరోవైపు ఈ అంశంపై డీఎంఈ ప్రత్యేక విచారణ చేపట్టారు. సోమవారం ఓ అధికారిని కామారెడ్డి జిల్లా దవాఖానకు పంపి విచారణ జరిపించారు.

రేపు ఆలయాల ఉద్యోగుల భేటీ

వేములవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం

వేములవాడ, సెప్టెంబర్ 23: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఆలయాల ఉద్యోగుల జేఏసీ పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నది. ఇటీవల దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలు, జరిగిన పరిణామాల నేపథ్యంలో ఉద్యమ కాలంలోని జేఏసీ మళ్లీ ఇప్పుడు పునర్నిర్మాణానికి నాంది పలికింది. ఇందులో భాగంగా.. ఆలయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న బుధవారం వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో జరగనున్నది. రాష్ట్రంలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి ఆలయాల అర్చక ఉద్యోగులు, జేఏసీ నాయకులు సుమారు 200 మంది వరకు హాజరుకానున్నారు. దీనికి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తోపాటు ఆలయాలు ఉన్న అన్ని జిల్లాల్లోని టీఎన్జీవో నాయకులు హాజరు కానున్నట్టు జేఏసీ వర్గాలు వెల్లడించాయి. దాదాపు 25 అంశాల ఎజెండాతో రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం జరగనున్నది. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్‌ను అంతం చేయటం.. కోమటిరెడ్డి జేజమ్మ తరం కాదు

- ముందు నీ కుటుంబ సమస్యలు చూసుకో
- మాటలు ఆపి హామీలు అమలు చేయండి
- భువనగిరి జిల్లాకు సాగు నీళ్లు ఇప్పించండి
- కోమటిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): 'బీఆర్‌ఎస్‌ను అంతం చేయడం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాదు కదా.. ఆయన జేజమ్మ తరం కూడా కాదు' అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. ఇవన్నీ పక్కనబెట్టి కోమటిరెడ్డి తన కుటుంబంలో అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టాలని చురక అంటించారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె.. అసలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై మాట్లాడే అర్హత కోమటిరెడ్డికి లేదని అన్నారు. హరీశ్, కేటీఆర్ వద్దంటే పోలీస్ అధికారి ప్రభాకర్‌రావు భారత్‌కు రావటం లేదని అంటున్నారని.. వారి తర్వాత రేవంత్ కూడా అమెరికా వెళ్లారని, మరి ప్రభాకర్‌రావుకు సీఎం ఏం చెప్పి వచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉంటూ మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా ఉన్న తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి ఓటు వేయాలని చెప్పిన చరిత్ర వెంకట్‌రెడ్డిది అని దుయ్యబట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మంత్రిగా కోమటిరెడ్డి చేసింది శూన్యం అని.. తపాస్‌పల్లి నుంచి నీళ్లు తెస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు. రిజర్వాయర్ల నుంచి జిల్లా చెరువులు నింపే అవకాశమున్నా ఆ పని ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. 'గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేయకుండా ఏం చేస్తున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని పోచంపల్లి నుంచి రంగారెడ్డి జిల్లాకు రేవంత్‌రెడ్డి తరలిస్తే కోమటిరెడ్డి ఏం చేస్తున్నారు? జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై కోమటిరెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? యాదాద్రికి మంజూరైన మెడికల్ కాలేజీని గతంలో కేటాయించిన ప్రదేశంలోనే ఉంచేలా కోమటిరెడ్డి ఎందుకు ప్రయత్నించటం లేదు? మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్య తగ్గిస్తుంటే ఏం చేస్తున్నారు?' అని ఎండగట్టారు. వేరే విషయాలు తగ్గించి జిల్లా విషయాలను సీఎంతో కోమటిరెడ్డి చర్చిస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నిజ నిర్ధారణపై నిర్బంధం

మొదటిపేజీ తరువాయి...

హౌస్ అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను ఇంటి నుంచి బయటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో గాంధీ దవాఖాన వద్ద భారీగా పోలీసులు మోహరించారు.గాంధీలో మరణాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సోమవారం గాంధీ దవాఖానను పరిశీలించాలని నిర్ణయించింది.ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి గాంధీ దవాఖానకు బయలుదేరగానే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కూడా ఇంటి నుంచి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.చాకచక్యంగా తప్పించుకున్న సంజయ్, ఆనంద్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి గాంధీకి బయలుదేరారు. పోలీసులు వీళ్లు వెళ్లే మార్గాన్ని నిర్బంధించారు. ఎలాగో అలా గాంధీకి చేరుకున్న ఈ ముగ్గురూ లోపలికి వెళ్దామనుకుంటే పోలీసులు అడ్డుకున్నారు. తాము డాక్టర్లమని సంజయ్, మెతుకు ఆనంద్ చెప్పినా పట్టించుకోలేదు. ఇదే సమయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ గాంధీకి బయలుదేరగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కూడా గాంధీకి రాకుండా పోలీసులను మోహరించారు. తాటికొండ రాజయ్య తన అనుచరులతో ఇంటి బయటకు రాగా పోలీసులు అదుపులోకి తీసుకొని నగరమంతా తిప్పారు. తర్వాత బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి మధ్యాహ్నం తీసుకువచ్చి తెలంగాణభవన్ వద్ద వదిలిపెట్టారు. ఇదే సమయంలో గాంధీ దవాఖాన వద్ద సంజయ్, మెతుకు ఆనంద్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని హిమాయత్ నగర్, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో తిప్పి చివరకు తెలంగాణ భవన్ వద్ద వదిలిపెట్టారు.జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కూడా హైదరాబాద్‌లో పోలీసులు హౌస్‌అరెస్టు చేశారు.


గాంధీ దవాఖాన వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను అడ్డుకుని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గాంధీకి వెళ్లడం నేరమా?

> కేసీఆర్ హయాంలో వైద్యంలో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇప్పుడు మాతా శిశుమరణాలు, విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరిగ్గా స్పందించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. మందుల కొరత తీవ్రంగా ఉన్నది. గాంధీ ఆస్పత్రికి తాము వెళితే నేరమా..? ఇది ప్రజా పాలనా..? ఎమర్జెన్సీ పాలనా?
>
> - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

ప్రభుత్వమే మంచం పట్టింది

> గాంధీ దవాఖానలో శిశు మరణాలు ఎందుకు పెరిగాయో తెలుసుకోవడానికి వెళ్లాం. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. అయినా సీఎం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వమే మంచం పట్టింది అన్నట్టు ఉన్నది పరిస్థితి.
>
> - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అంత నిర్బంధం ఎందుకు

> కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ తెచ్చారు. కేసీఆర్ హయాంలో మాతా శిశుమరణాలు దాదాపుగా లేవు. రేవంత్ సర్కారులో ఎందుకు పెరిగాయి. మా పర్యటనపై నిర్బంధం ఎందుకు? కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పోకడలను అనుసరిస్తున్నది
>
> - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

దవాఖానలకు కమిటీ వెళ్తే భయమెందుకు: కేటీఆర్

ప్రభుత్వ దవాఖానల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన పార్టీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను ఎందుకు అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానిజాలు తెలియకూడదని ప్రభుత్వం భావిస్తున్నదా? బీఆర్‌ఎస్ పార్టీ అంటే భయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థతతో రాష్ట్రంలో వైద్యం పడకేసిందన్నారు. బాధ్యతాయుత ప్రతిపక్షంగా ప్రజలకు మేలుచేయాలనే కమిటీ వేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి భేషజాలకు పోవద్దని సూచించారు.

వాస్తవాలు తెలుస్తాయనే వణుకు: హరీశ్

'దవాఖానల పనితీరు అత్యంత అధ్వాన్నంగా ఉన్నదన్న విషయం బయటపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం వణికిపోతుంది. దవాఖానల పరిస్థితిని అధ్యయనం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య నాయకత్వంలో డాక్టర్లు మెతుకు ఆనంద్, కల్వకుంట్ల సంజయ్‌తో కూడిన కమిటీ సోమవారం గాంధీ దవాఖాన వెళ్లాలనుకుంటే అరెస్టు చేయడం దుర్మార్గం' అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

వాస్తవాలను తెలుసుకోవడానికే..

> వాస్తవాలను తెలుసుకోవడానికి గాంధీకి వెళితే ఎలా అడ్డుకుంటారు ? పదేండ్ల కాలంలో ఇలాంటి ఘటనలు జరుగలేదు.
>
> - ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 24 సెప్టెంబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

శ్రీలంకలో కొత్తగాలి

ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకలో సరికొత్త రాజకీయ గాలి వీస్తున్నది. తాజాగా జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రజలు పాత పార్టీలను తిరస్కరించి నూతన రాజకీయ శక్తులకు పట్టం గట్టారు. ఉత్కంఠభరితంగా సాగిన అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టు నేత అనూరకుమార దిస్సనాయకే (క్లుప్తంగా ఏకేడీ) విజయం సాధించడం ఎగుడుదిగుడుగా సాగుతున్న ద్వీప దేశ రాజకీయాల్లో సరికొత్త మలుపు అనే చెప్పాలి. ఇన్నాళ్లూ దేశంపై పెత్తనం సాగించిన జాతీయవాద పార్టీలు ప్రాబల్యం కోల్పోవడాన్ని ఇది సూచిస్తున్నది. శ్రీలంక స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రధాన పక్షాలైన శ్రీలంక ఫ్రీడం పార్టీ (ఎస్ఎల్ఎఫ్‌పీ), యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ)లు, వాటి అంతే వాసీలు కాకుండా మూడో పార్టీ తొలిసారిగా అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నది. జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకుడైన దిస్సనాయకే దేశ పగ్గాలు అందుకున్నారు. అయితే ఇది అంత సులభంగా జరగలేదు. హోరాహోరీ ఎన్నికల పోటీలో తొలి విడత ఓట్ల లెక్కింపులో ఏ ఒక్కరికీ మెజారిటీ (51 శాతం ఓట్లు) రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యం ఓట్ల లెక్కింపు చేపట్టాల్సి వచ్చింది. ఇది కూడా శ్రీలంక చరిత్రలో కనీవినీ ఎరుగని విషయమే. అంతిమ విజేతగా దిస్సనాయకే నిలువగా, మరో విపక్ష అభ్యర్థి సాజిత్ ప్రేమదాస రెండోస్థానంలో, అధ్యక్ష పదవి నుంచి దిగిపోతున్న రనిల్ విక్రమసింఘే మూడో స్థానంలో నిలిచారు.

అవినీతిని అంతం చేయడం, జాతి దురహంకారాన్ని రూపుమాపడం, రాజకీయ సంస్కృతిని సమూలంగా మార్చివేయడం తన ప్రథమ కర్తవ్యాలుగా ఉంటాయని ఏకేడీ తన తొలిస్పందనలో వెల్లడించారు. సింహళ, తమిళ, ముస్లిం వర్గాలుగా విడిపోయిన శ్రీలంక సమాజాన్ని ఒకేతాటి మీదకు తేవడం ఆహ్వానించదగినదే. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ఈతిబాధల నుంచి ప్రజలను విముక్తులను చేయడమూ అత్యవసరమే. ప్రజలు తక్షణ ఉపశమనం కోరుకుంటున్నారని ఎన్నికల ఫలితాలు విస్పష్టంగా తెలియజేశాయి. అయితే ఏకేడీ ఎన్నికతో రాజకీయ సుస్థిరత ఏర్పడిందని భావించలేం. ఆయన నేతృత్వంలోని జేవీపీకి పార్లమెంటులో మూడే స్థానాలున్నాయి. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జేవీపీ బలం పుంజుకోగలిగితేనే ఏకేడీ అధికారం సుస్థిరమవుతుంది.

శ్రీలంక-భారత్ సంబంధాలు ఈలం వేర్పాటువాద ఉద్యమకాలం నుంచీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఇటీవలి కాలంలో అదానీ సంస్థతో విద్యుత్తు ఒప్పందం కారణంగా రెండు దేశాల మధ్య దూరం ఏర్పడిన సంగతి తెలిసిందే. నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపడుతున్న ఏకేడీకి చైనా అనుకూలుడిగా పేరుంది. ఆయన చైనా వైపు మరింతగా మొగ్గితే ఆ దూరం మరింతగా పెరుగవచ్చు. చైనా ఉక్కు కౌగిలిలోకి ఒదిగిపోతున్న పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపర్చుకోవడం భారత్‌కు పెను సవాల్‌గా మారింది. భారత్ చుట్టూ ఉన్న పొరుగు దేశాలు ఒక్కటొక్కటిగా చైనా ప్రభావ పరిధిలోకి వెళ్తుండటం మనం చూస్తున్నాం. నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్ ఈసరికే చైనా ఉచ్చులోకి వెళ్లాయి. తాజాగా శ్రీలంక ఆ జాబితాలోకి చేరిపోయింది. అధ్యక్షునిగా ఏకేడీ ఎన్నిక ఓ ముక్తాయింపు మాత్రమే.

పాఠాలు నేర్వదా కాంగ్రెస్?

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు నానాటికి వెల్లువెత్తుతున్నాయి. విమర్శలు హామీల అమలు, పరిపాలన విషయంలో. ఆరోపణలు అవినీతికి సంబంధించి. అయితే వాటిని ప్రస్తుతానికి పక్కన ఉంచుదాము. కాంగ్రెస్ పార్టీకి, ఆ ప్రభుత్వానికి మేలు జరగటం, లేదా హాని కలగటం అనే దృక్కోణం నుంచి చూసినప్పుడు, అంతకన్న ముఖ్యంగా చెప్పుకోవలసిన విషయం ఒకటున్నది. అది, వారు తమ గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటున్నారా లేదా అన్నది. ప్రస్తుత ధోరణిని జాగ్రత్తగా గమనించినప్పుడు, తెలంగాణ రాష్ట్రంలోనే కాదు, జాతీయ స్థాయిలోనూ వారు తమ చరిత్ర నుంచి ఎటువంటి పాఠాలు నేర్చుకుంటున్న సూచనలు కనిపించటం లేదు. దాన్ని బట్టి, గత అధికార భ్రష్టత్వాలకు వలెనే మరొక మారు పతనానికి పరిస్థితులను తమకు తామే సిద్ధం చేసుకుంటున్నారనే అభిప్రాయం కలుగుతున్నది.



టంకశాల అశోక్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు వచ్చేముందు జాతీయ పరిణామాలను చెప్పుకుందాం. ఎందుకంటే, మొదట ఉమ్మడి రాష్ట్రంలో గాని, తర్వాత తెలంగాణలో గాని మనం చూస్తున్న కాంగ్రెస్ పతన క్రమానికి మూలాలు జాతీయ పరిణామాలలో ఉన్నాయి. అవి అర్థం చేసుకుంటే గానీ ఇవి అర్థం కావు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించి అన్నివర్గాల ప్రజలను వెంట తీసుకుపోయింది. స్వాతంత్ర్యం తర్వాత, అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి ఆకాంక్షల పరిపూర్తికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఒక గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించింది. కానీ వారి పరిపాలన అవన్నీ నిజాయితీ రహితంగా, అరకొరగా అమలవుతూ సాగటంతో మొదలైంది. ఆ వివరాల్లోకి ఇక్కడ వెళ్లలేము గాని, ఆ విధంగా మొదటనే కనిపించిన వైఫల్యాలూ, అందుకు తగిన వ్యతిరేక ఫలితాలు కూడా ఆరంభంలోనే మొదలయ్యాయని గుర్తించాలి. ఆ తొలి దశలో కనిపించిన అటువంటి స్థితే, అప్పటినుంచి 70 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత ఇప్పటికీ ఉందన్నది ఇక్కడ మాట్లాడుకుంటున్న ప్రధాన విషయం. ఇది జాతీయస్థాయి నుంచి తెలంగాణ వరకు కూడా. అదెట్లాగో చూద్దాం.

కాంగ్రెస్ తొలి ప్రధాని అయిన నెహ్రూ ఒక దార్శనికుడు, చిత్తశుద్ధి గలవాడనటంలో సందేహం లేదు. ఆయన తన 17 ఏండ్ల పాలనలో దేశ అవసరాలకు అనుగుణంగా, రాజ్యాంగాన్ని అనుసరించి అనేక చర్యలు తీసుకున్నారు. వాటిలో అనేకం విఫలమయ్యాయి, లేదా అరకొరగా సాగాయి. అందుకు కారణం ఏమిటన్నది మాత్రం ప్రచారం కాలేదు, ప్రజల దృష్టికి రాలేదు. అందుకు కారకులు కాంగ్రెస్‌లో జాతీయస్థాయి నుంచి రాష్ట్రాల వరకు గల కన్జర్వేటివ్ వర్గాలు, ఫ్యూడల్ వర్గాలు, అధికార యంత్రాంగంలోని ఒక వర్గం, విదేశీ పెట్టుబడిదారీ లాబీలు. అందువల్ల ఏమి జరిగింది, నెహ్రూ తర్వాత ఈ శక్తుల ప్రాబల్యం ఎట్లా పనిచేసిందనే చర్చ ప్రస్తుతం చేయలేము గాని, ఈ ప్రారంభ దశలోనే తదనంతర కాలంలో కాంగ్రెస్ వైఫల్యాలకు బీజాలు పడ్డాయని మాత్రం గుర్తించాలి.

ఆ వైఫల్యాల ఫలితాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కాలంలోనే చవిచూసింది కూడా. 1952 మొదటి ఎన్నికల తర్వాత 1957లో రెండవ ఎన్నికల నాటికే కాంగ్రెస్ పార్టీ యూపీ, బీహార్, బెంగాల్, అస్సాం, ఒరిస్సా వంటి పెద్ద రాష్ట్రాలలో, ఓట్లు, సీట్లతో పాటు, కేరళలోనైతే ఏకంగా అధికారాన్నే పోగొట్టుకుంది. అందుకు కారణాలు పార్టీలోని ఇతర నాయకులకు కాకున్నా నెహ్రూకు బాగానే అర్థమయ్యాయి. బడుగు, బలహీనుల సమస్యలను పరిష్కరించనట్టయితే, వారు తమ చేతికి అందిన ఓటు ఆయుధంతో మనలను శిక్షిస్తారని, అదేవిధంగా మనలను పక్కకు తోసివేసి తమ దారి తాము వెతుక్కుంటూ ముందుకుపోతారని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలోనే మాట్లాడుతూ హెచ్చరించారాయన. మాటలు సరిగా ఇవేకాకున్నా సారాంశం ఇది. నిజానికి ఈ స్థితిని 1952 మొదటి ఎన్నికల కన్నా ముందే అప్పటి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఊహిస్తూ నెహ్రూకు ఒక లేఖ రాశారు. ఆయన ముఖ్యంగా ఎత్తిచూపింది కాంగ్రెస్‌లో అప్పటికే మొదలైన అవినీతి ధోరణుల గురించి. అవి అట్లాగే సాగితే కాంగ్రెస్ నష్టపోతుందని కూడా అన్నారు.

> **విషయమేమంటే, ఆ విధమైన రాధాకృష్ణన్, నెహ్రూల హెచ్చరికల నుంచి కాంగ్రెస్ వాదులు గాని, వారి వివిధ ప్రభుత్వాలు గాని, ఆ 1950ల కాలం మొదలు ఈ 2024 వరకు 70 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎటువంటి పాఠాలు నేర్వలేదు. ప్రజలకు మాయమాటలు చెప్పటం, పాప్యులిజంతో మభ్యపెట్టడం, ఓట్లను అమ్ముకునేందుకు ప్రజలను అలవాటు చేయటం, ఒక ఎన్నిక నుంచి మరొక ఎన్నికకు అలవికాని హామీలనివ్వటం, తమ వైఫల్యాలను యథావిధిగా కొనసాగిస్తూ, అధికారాన్ని అనుభవిస్తూ, అవినీతిని విచ్చలవిడిగా సాగించటం అనే పద్ధతులకు అలవాటుపడిపోయారు. కొద్దిపాటి తేడాలతో ఇదే సాగుతూ వస్తున్నది జాతీయస్థాయిలో, రాష్ట్రాలలో కూడా అయినా వారు పాఠాలు నేర్వలేదు. నేటికీ నేర్వటం లేదు. తెలంగాణలో సైతం ప్రస్తుతం అదే కనిపిస్తున్నది.**

ఇందుకు ఫలితాన్ని వారు మొదటిసారి 1957లోనే ఎదుర్కొనగా, తర్వాత అది మరింత తీవ్రమై అనేక ఒడిదుడుకులను అనుభవించారు. ఆ విషయాలు క్లుప్తంగా చూద్దాము. కేంద్రంలో సొంత మెజారిటీతో కాంగ్రెస్ వరుసగా పాలించింది 1977 వరకు మాత్రమే. తర్వాత కాలంలో జరిగిందంతా మధ్య మధ్య అధికారానికి రావటం, లేదా ఇతర పార్టీల పొత్తుతో రావటం. అనగా తన ఎదురులేని ఏకచ్ఛత్రాధిపత్యం ఇప్పటికి 47 సంవత్సరాల క్రితం 1977లోనే భంగపడింది. అప్పటినుంచి పలుమార్లు కేంద్రంలో అధికారం కోల్పోయింది. ప్రస్తుతానికి వస్తే, 2004, 2009లో రెండు సార్లు కూటమి రూపంలో మాత్రమే పాలించిన తర్వాత, 2014 నుంచి ఇప్పటికి వరుసగా మూడు సార్లు గెలవలేకపోయింది. అంతేకాదు, తన చరిత్రలోనే ఎన్నడూ లేనంత తక్కువ సీట్లు తెచ్చుకున్న మూడుసార్లు కూడా ఇవే. ఇక రాష్ట్రాలను చూస్తే, కాంగ్రెస్ ఆధిపత్యం కేంద్రం కన్నా (1977) పది సంవత్సరాల (1967) ముందే భంగపడింది. ఆ దుస్థితి నుంచి, పతన పరంపర నుంచి ఆ పార్టీ నేటికీ కోలుకోలేదు. కనుక ఈ రోజున దేశంలోని 28 రాష్ట్రాలలో కేవలం మూడే మూడింట అధికారంలో మిగిలింది. అయినప్పటికీ పాఠాలు నేర్చుకొని ఒక సమగ్రమైన అజెండాను తయారుచేసుకోవటం, పార్టీని క్రమపద్ధతిలో నిర్మించుకోవటానికి బదులు హంగామా డైలాగులు, నాటకీయతలతోనే మురిసిపోతున్నారు.


ఈ చర్చ అంతటిలో చెప్పదలచిన రెండు ప్రధానమైన అంశాలు ఏమంటే, ఒకటి, కాంగ్రెస్ పార్టీ గాని, ప్రభుత్వాలు గానీ, గత 77 సంవత్సరాల సుదీర్ఘకాలంలో తమ వైఫల్యాలను సరిదిద్దుకోలేదు. అవినీతిని, బంధుప్రీతిని నిరోధించుకోలేదు. అంతిమంగా ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదు. దీని ప్రభావం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కనిపించింది, తెలంగాణలో కనిపిస్తున్నది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడగా వారి ఎదురులేని పాలన 30 ఏండ్లు గడవకముందే 1983లో ఎన్టీఆర్ నాయకత్వాన ఒక ఫెడరల్ పార్టీ రాకతో ముగిసింది. అప్పటి నుంచి 2014లో రాష్ట్ర విభజన వరకు వారి అధికారానికి ఐదు సార్లు అంతరాయాలు ఏర్పడ్డాయి. మరొక విభజిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం మూడుసార్లూ ఫెడరల్ పార్టీలే గెలిచాయి. తెలంగాణలో రెండు సార్లు ఓడి ఒకసారి గెలిచారు.

ఈ మొత్తం కాంగ్రెస్ చరిత్రలో పైన చెప్పుకున్న పరిపాలనా వైఫల్యాలు, పాఠాలు నేర్వకపోవటం, విచ్చలవిడి అవినీతి అనే మూడు లక్షణాలతో పాటు, గమనించదగిన మరో రెండు విషయాలున్నాయి. ఒకటి, కాంగ్రెస్‌వాదులు సుమారు 1990ల వరకు జయాపజయాలతో నిమిత్తం లేకుండా తమ పార్టీకి కట్టుబడి ఉండేవారు. ఆయారాం గయారాంలు ఉండినా తక్కువే. అటువంటి వారికి అదొక మచ్చగా కూడా ఉండేది. పార్టీ వాదులకు పార్టీ పరమైన సిద్ధాంతాలపై నమ్మకం, నాయకత్వం పట్ల విధేయతలు ఉండేవి. ఒకసారి ఓడినా మరోసారి గెలవగలమనుకునేవారు. గమనించవలసిన రెండు విషయాలలో ఇది ఒకటి కాగా, తర్వాత కాలంలో వివిధ కారణాల వల్ల పార్టీ సిద్ధాంతాలపై నమ్మకాలు, నాయకత్వాల పట్ల విధేయతలు సడలిపోవటం ఒక ధోరణిగా మారింది. ఒకవైపు పార్టీ బలహీనపడటం, గెలుపు అనుమానాస్పదం అవుతుండటం, మరొకవైపు నాయకులకు, శ్రేణులకు వ్యక్తిగత అధికార ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతుండటం వంటి వాటితో అసలు రాజకీయరంగమే ఒక ఫ్రీ మార్కెట్‌గా మారింది. కాంగ్రెస్ అందుకు మినహాయింపు కాలేదు. రాజకీయ వాదులు, వారి అనుచరులు, చివరికి సాధారణ కార్యకర్తలు కూడా ఇదే ధర్మాన్ని అనుసరించే రెండవ దశ మొదలైంది. కాంగ్రెస్ గెలిస్తే అందులోకి వస్తారు, ఓడితే మరో పార్టీలోకి పోతారు. అంతా రంగులరాట్నం తీరు.

ఈ పరిణామాల నుంచి, స్వయంగా తన అనుభవాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ఏ పాఠాలు నేర్చుకోని ఈ స్థితే ఈ రోజున తెలంగాణలోనూ కన్పిస్తున్నది. పరిస్థితి సారాంశాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే, హామీల అమలులో తీవ్ర వైఫల్యం, దానిని కప్పిపుచ్చుకునే మాయ మాటలూ, చేష్టలూ, క్రమంగా విచ్చలవిడిస్థాయికి చేరుతున్న అవినీతి, పరిపాలనా వైఫల్యాలు, అంతిమంగా 77 సంవత్సరాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోవటం. ఆ విధంగా వారు రాగల కాలంలో తమ పతనానికి తామే మరొకసారి బాటలు వేసుకుంటున్నారు. ఆ స్థితిని నెహ్రూ అంతటివాడే ప్రయత్నించి కూడా సరిదిద్దలేకపోయినప్పుడు, ప్రస్తుతం అసలు అటువంటి ఆలోచన గలవారే లేనప్పుడు, ఇక చెప్పేదేమున్నది!

ఎవరైనా సరే ఒకసారి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను, వారు బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికి తిరిగి పంచిన ఆరు గ్యారెంటీలను చూడండి. ఆ గ్యారంటీలలో వారన్న 100 రోజులలో గానీ, ఇప్పటికి గడిచిన 260 రోజులలో గాని ఏవి అమలయ్యాయో, ఏవి కాలేదో తమంతట తామే పోల్చిచూసుకోండి. అమలు కావటం లేదా కాకపోవటంపై ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఏమి అంటున్నారు, ఏమి అనటం లేదు, ఏవి దాస్తున్నారు, ఏవి వంకరటింకర తిప్పి మాట్లాడుతున్నారు అనేవి మీ అంతట మీరే గమనించండి. ఎవరూ చెప్పనక్కర లేదు. అట్లాగే, మ్యానిఫెస్టోలో ఏమి చెప్పి తర్వాత ఏమంటున్నారనేది కూడా. మరొకవైపు ఈ అంశాలపై ఏ సవాలుకూ జవాబివ్వకపోవటాన్ని అందరూ ఇప్పటికే గమనించి ఉంటారు. కొత్తగా ఒక ఉద్యోగమైనా ఇచ్చినట్లు రుజువు చేస్తే అసెంబ్లీ నుంచే గాక రాజకీయాల నుంచే తప్పుకుంటానని కేటీఆర్ పలుమార్లు సవాలు చేసినా జవాబుండదు. రుణమాఫీ అందరికీ జరిగిందని నిరూపిస్తే తాను కూడా అదే పని చేయగలనన్న హరీశ్‌రావు సవాలుకు స్పందన ఉండదు. ఇటువంటివి మరెన్నో. తాజాగా, కేంద్ర ప్రభుత్వ పథకమైన 'అమృత్' అమలులో అవినీతి లేదని జ్యుడీషియల్ విచారణలో తేలితే తాను రాజకీయ సన్యాసం తీసుకోగలనని కేటీఆర్ అన్నారు. ఈ వ్యాసం రాసే సమయానికైతే అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఎటువంటి ఉలుకూ పలుకూ లేదు.

హామీల అమలు, అవినీతి, పరిపాలన సక్రమంగా సాగకపోవటంపై ఇప్పటికే ప్రజలలో మాటలు మొదలయ్యాయి. దాని అర్థం, పైన వివరంగా చర్చించుకున్నట్లు కాంగ్రెస్ వారు గత 77 సంవత్సరాలుగా నేర్చుకోని పాఠాలను ఇప్పటికీ నేర్చుకోవటం లేదు. తమ జాతీయ నాయకత్వం అయినా వారికి నేర్పటం లేదు. నిజం చెప్పాలంటే వారు నేర్పరు, నేర్పలేరు కూడా. ఎందుకంటే వారు స్వయంగా నేర్చుకోలేదు, నేర్చుకోవటం లేదు గనుక.





మేం మళ్లీ రావడమా?

దేశంలో మా పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే గ్యారంటీ లేదు. కానీ, రామ్‌దాస్ అథవాలే కచ్చితంగా మళ్లీ కేంద్ర మంత్రి అవుతారని మాత్రం నేను గ్యారంటీ ఇవ్వగలను.

- నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి

> దేహాన్ని ఆయుధంగా చేసి..!
> ఆయువును ఇంధనంగా మలచి..!
> యంత్రాలను మిత్రులుగా మార్చి..!
> ప్రాణాలను పణంగా పెట్టి..
> చెమటోడ్చి, శ్రమించి..!
> నల్ల బంగారాన్ని వెలికితీసి..!
> సింగరేణిని సిరుల గనిగా తీర్చిదిద్దిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది.
> లోకానికి వెలుగును పంచే నల్ల సూరీళ్ల నాశనానికి పూనుకున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.

సింగరేణి నల్ల బంగారం.. తెలంగాణ కొంగు బంగారం సింగరేణిని బొంద పెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే కుట్రలు చేస్తున్నాయి. 130 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనే కుట్రతో పోయిన ఏడాది బెంగళూరులో ఇన్వెస్టర్ల భేటీలో 4 సింగరేణి బొగ్గు బ్లాకులను అధికారికంగా వేలం వేసిన నాటి నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాల్లో కార్మికుల వాటా తగ్గించి, తద్వారా ఆత్మ స్థయిర్యాన్ని దెబ్బకొట్టి, వారి భాగస్వామ్యం లేకుండా చేసి, సింగరేణిని ప్రైవేటీకరించే కుట్రలకు మద్దతుగా నిలుస్తున్నది.

సింగరేణిలో శ్రమ దోపిడి



బాల్క సుమన్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవనే విషయం సింగరేణి కార్మికుల విషయంలో మరోసారి రుజువైంది. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపి కబురు బదులు చేదు కబురు చెప్పారు. సంస్థ గడించిన లాభాల ఆధారంగా కార్మికులకు ఇచ్చే బోనస్‌ను కూడా బోగస్ చేశారు. ఈ ఏడాది అంటే 2023-24కు వచ్చిన లాభాలు రూ.4701 కోట్లు కాగా ప్రభుత్వం చెప్పిన విధంగా 33 శాతం లాభాలు పంచితే మొత్తంగా దాదాపు రూ.1550 కోట్లు కార్మికులకు రావాల్సి ఉన్నది. లాభాలేమో రూ.4,701 కోట్లు చూపించి, కేవలం రూ.2,412 కోట్లలో 33 శాతం బోనస్‌ను ప్రకటించడం కార్మికుల కష్టాన్ని దోచుకోవడమే! కార్మికులకు న్యాయంగా అందించాల్సిన మిగతా రూ.2,289 కోట్లకు బోనస్‌ను ఎగ్గొట్టడం కాంగ్రెస్ దగాకోరుతనానికి నిదర్శనం.

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి సింగరేణి కార్మిక వ్యతిరేక చర్యలకే పాల్పడ్డది. సమైక్య రాష్ట్రంలో 80, 90 దశకాల్లో యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరించి వేలాది మంది కార్మికులను అరిగోస పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ఉమ్మడి రాష్ట్రంలో కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ కార్మికులను బానిసలుగా మార్చిన యాజమాన్యానికి మద్దతుగా నిలిచింది ఆనాటి కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ. కార్మికుల రక్షణ గాలికి వదిలేసి గనులలో ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టని కారణంగా అనేక సందర్భాల్లో గనులలో కార్మికులు సజీవ సమాధి అయితే అమానవీయంగా వ్యవహరించి యాజమాన్యానికి మద్దతుగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ. ఏండ్ల తరబడి ఎటువంటి ప్రమోషన్లు ఇవ్వకుండా కార్మికుల శ్రమ దోపిడి చేసింది. ఏండ్లకేండ్లుగా వేజ్ బోర్డులను ఆలస్యం చేసి కార్మికులను ఆర్థిక దోపిడికి గురి చేసింది. వారసత్వ ఉద్యోగాలు రద్దు చేస్తూ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్న సందర్భంలో మద్దతుగా నిలిచాయి కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు ఒప్పుకొని లక్షకు పైగా ఉన్న కార్మికుల సంఖ్యను 40 వేలకు కుదించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. నేడు అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన బోనస్‌ను 50 శాతానికి తగ్గించి కార్మికులపై తనకున్న అక్కసును మరొక్కసారి వెళ్లగక్కింది రేవంత్‌రెడ్డి సర్కార్.

పదేండ్ల కేసీఆర్ పాలనలో సింగరేణికి స్వర్ణయుగం అనే చెప్పాలి. కార్మిక సంక్షేమంతో పాటు, సంస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం వల్ల సింగరేణి అద్భుత ప్రగతిని సాధించింది. దీనిద్వారా సింగరేణిలో లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకు అనుగుణంగా కార్మికుల వాటాను పెంచుతూ కార్మిక పక్షపాతిగా నిలిచారు కేసీఆర్. ఉమ్మడి రాష్ట్రంలో నష్టాలే తప్ప లాభాలు చవిచూడని సంస్థను లాభాల బాటలో పయనించేలా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే రూ.400 కోట్ల లాభాలు గడించేలా చేసింది. ఇప్పుడు అంచెలంచెలుగా రూ.4000 కోట్లకు పైగా చేరిందంటే అది కేసీఆర్ కృషినే. ఉమ్మడి రాష్ట్రంలో 1999-2014 వరకు 376 కోట్లు లాభాలు మాత్రమే కార్మికులకు పంచగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2,780 కోట్లు కార్మికులకు అందించారు.

> **ఇక కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల, సంస్థ పట్ల ఎలా వ్యవహరిస్తుందో కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. సింగరేణి సంస్థ మనుగడనే బొగ్గు తవ్వకంపై ఆధారపడి ఉంటుందన్నది అందరికీ విదితమే. అలాంటి సంస్థ అభివృద్ధి చెందాలంటే ఎప్పటికప్పుడు కొత్త బొగ్గు బ్లాక్‌లను కేంద్రం కేటాయించాల్సి ఉంటుంది. అలాంటి లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించకపోగా సంస్థకు చెందిన నాలుగు బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం ద్వారా సంస్థ ఉత్పత్తిపైన పెనుభారం పడనున్నది.**

బొగ్గు ఉత్పత్తి లేని సింగరేణి సంస్థ బతుకలేదు కనుక తెలంగాణకు ఆర్థిక, సామాజిక జీవనాడి లాంటి సింగరేణిని దెబ్బకొట్టి తెలంగాణను చీకటిమయం చేయాలని చూస్తుంది కేంద్ర బీజేపీ ప్రభుత్వం. అయినప్పటికీ సింగరేణి ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి ఒప్పందాలతో మిలాఖత్ అయ్యాయి. కేంద్ర బొగ్గు గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సాక్షాత్తు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడమే దీనికి నిదర్శనం.

2023 నవంబర్ 12న ప్రధాని మోదీ రామగుండం పర్యటన సందర్భంగా సింగరేణిని ప్రైవేటీకరించబోమని పట్టపగలు పచ్చి అబద్ధాలాడారు. నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంపైన, తెలంగాణ ప్రజల పైన మొదటి నుంచి విషం కక్కుతున్నారు. లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థను దెబ్బ కొట్టి తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టాలని చూసిన కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు నిర్ణయాన్ని ముందే పసిగట్టిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 2021, డిసెంబర్ 7న సుమారు 450 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలున్న కేకే6 అండర్ గ్రౌండ్ గని, శ్రావణపల్లి ఓసీ బ్లాక్, సత్తుపల్లి వద్ద గల జేవీఆర్ ఓసీ-3, కోయగూడెం ఓసీ 3 బ్లాకులను తమకే కేటాయించాలని ప్రధాని మోదీకి లేఖ రాసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా సింగరేణి కార్మికుల ఇన్కమ్ టాక్స్ మాఫీపై తెలంగాణ ఏర్పడిన మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే కేసీఆర్ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా అతీ గతీ లేదు. వాస్తవానికి సింగరేణి ప్రైవేటీకరణపై బీజేపీ చేస్తున్న కుట్రలు ఈరోజువి కావు. 1997లో కేంద్రంలో ఉన్న వాజపేయి సర్కార్ ఎల్‌పీజీ (లిబరలైజ్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) చర్యలను వేగవంతం చేస్తూ క్యాప్టివ్ మైన్స్ సిస్టం ద్వారా సింగరేణి ప్రైవేట్‌పరం చేయాలని పావులు కదిపారు. ఉద్యమ నాయకుడే రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండటంతో ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం సింగరేణి వైపు చూడటానికి కూడా సాహసించలేదన్నది ముమ్మాటికీ నిజం.

నేల తల్లి గర్భంలో ప్రకృతికి విరుద్ధంగా అండర్ గ్రౌండ్‌లో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ కార్మికుల అలవెన్స్ 12 శాతం మీద ఏటా రూ.లక్ష ఇస్తే అందులో రూ.10 వేలకు మాత్రమే ఇన్కమ్‌టాక్స్ మినహాయింపు ఇవ్వడం అత్యంత బాధాకరం. సింగరేణి క్వార్టర్ కలిగిన కార్మికుడి జీతంపైన పెర్క్‌టాక్స్‌ను కోల్ ఇండియాలో అమలుచేస్తున్న విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యమే చెల్లించాలని కార్మికులు ఏండ్లుగా కోరుతున్నా పెడచెవిన పెట్టారు.

సింగరేణి ప్రైవేటీకరిస్తే వచ్చే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి. సింగరేణికి-ప్రైవేట్‌వాళ్లకు బొగ్గు అమ్మకాల్లో పోటీ పెరుగుతుంది. ప్రైవేటు మాఫియా వారు కార్మికుల శ్రమను దోపిడి చేస్తారు. కార్మికుల రక్షణకు, పర్యావరణానికి ప్రైవేట్ మాఫియా ప్రాధాన్యం ఇవ్వవు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించరు. కొత్త గనులు రావు. వారసత్వపు ఉద్యోగాలు ఉండవు. గనులు మూతపడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. కార్మికులకు న్యాయంగా అందవలసిన హక్కులు, బోనస్‌లు, అలవెన్స్‌లకు గండి కొడతారు. దేశ సంపద ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే వారు మాత్రమే అభివృద్ధి చెందుతారు. దీని వల్ల సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. కొద్ది రోజుల్లోనే సింగరేణి సంస్థ కనుమరుగవుతుంది.

సింగరేణి అభిమాన సంస్థ. నాడు, నేడు, ఏనాడైనా సింగరేణి సంస్థను కాపాడాలన్న, కార్మికులను కడుపున పెట్టుకుని చూసుకోవాలన్నా ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం సింగరేణికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించింది. అందులో ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాలు, కార్మికుల తల్లిదండ్రులకు కూడా కార్పొరేట్ వైద్యం, 26 వారాల మెటర్నిటీ లీవ్, అన్ని మతాల పండుగలకు పెయిడ్ హాలిడే, ఐఐటీ, ఐఐఎంలలో సీటు సంపాదించిన కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇల్లు కట్టుకునే వారికీ రూ.10 లక్షలు వడ్డీ లేని రుణం, జీవో-76 ద్వారా సింగరేణి ఏరియాలో నివసించే వారికి పట్టాల పంపిణీ, ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచితంగా మంచి నీటి సరఫరా, ఉచితంగా ఎలక్ట్రిసిటీ.. సింగరేణి క్వార్టర్లు, డ్యూటీలో చనిపోయిన కార్మికుడికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ వయస్సు 61కి పెంపు సింగరేణి కార్మికుల పిల్లలకు మెడికల్ సీట్లలో 5 శాతం కోటా, రామగుండం మెడికల్ కాలేజీలో 7 సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే కేటాయించడం, సిమ్స్ అనుబంధంగా ఏర్పాటుచేస్తున్న దవాఖానలో 50 పడకలు సింగరేణి కార్మికులకు రిజర్వ్ చేయడం.. ఇలా అనేక కార్మిక సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది.

ఇప్పటికే 10 నెలల కాలంలో పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఇప్పుడు కార్మికులకు లాభాల వాటలో 50 శాతం కోత విధిస్తూ తీవ్ర అన్యాయం చేసింది కార్మిక ద్రోహి కాంగ్రెస్ సర్కార్. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలు రూ.2,222 కోట్లు అయితే దీనిలో 32 శాతం అనగా దాదాపు రూ.710 కోట్లు కార్మికులకు అందించారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా కార్మికులకు చెల్లించినట్టుగానే లాభాల్లో వాటా చెల్లించాలి. మొత్తం రూ.4,701 కోట్లలో 33 శాతం బోనస్‌గా ప్రకటించాలి. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ఎంతో కీలకంగా ఉన్న సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. కేసీఆర్ నాయకత్వంలో కార్మికుల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుంది.

> **పదేండ్ల కేసీఆర్ పాలనలో సింగరేణికి స్వర్ణయుగం అనే చెప్పాలి. కార్మిక సంక్షేమంతో పాటు, సంస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం వల్ల సింగరేణి అద్భుత ప్రగతిని సాధించింది. తత్ఫలితంగా సింగరేణిలో లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకనుగుణంగా కార్మికుల వాటాను పెంచుతూ కార్మిక పక్షపాతిగా నిలిచారు కేసీఆర్.**

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద, చిన్న చెరువులు.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నంపై హైడ్రా నజర్

- ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్ మాసబ్ చెరువుల పరిశీలన
- అక్రమ నిర్మాణాలు గుర్తింపు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23: హైదరాబాద్‌కే పరిమితమైన హైడ్రా.. శివారు ప్రాంతాలపైనా దృష్టి సారించింది. సోమవారం హైడ్రా అధికారులు ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ శాఖల ఆఫీసర్లతో కలిసి తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్‌చెరువు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద, చిన్న చెరువులు.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ సుమారు 500 ఎకరాలుండగా ప్రస్తుతం అది 300 ఎకరాలకు కుచించుకుపోయింది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిసినట్టు అధికారులు గుర్తించారు. వాటిపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారుల్లో భయం పట్టుకున్నది.

చెరువుల మాయంపైనా హైడ్రా కన్ను

నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులనూ చెరపట్టారు. వాటిని ప్లాట్లుగా చేసి విక్రయించారు. దీంతో పలు చెరువులు, కుంటలు మాయమయ్యాయి. కాగా హైడ్రా అధికారులు ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులు, కుంటలపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఆధీనంలో ఎన్ని చెరువులు, కుంటలున్నాయి? వాటిలో ఎన్ని కబ్జాకు గురయ్యాయి? అన్న కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల పరి ధిలో అక్రమ నిర్మాణాల గుర్తింపు పనులను ముమ్మరం చేశారు.

కేసీఆర్ సారూ మమ్మల్ని రక్షించండి!

- అధికారుల కూల్చివేతల్లో ఉపాధి కోల్పోయిన తల్లీకొడుకు వేడుకోలు
- మల్లాపూర్‌లో ఫుట్‌పాత్‌పై చెప్పల దుకాణాన్ని తొలగించిన మున్సిపల్ అధికారులు

మల్లాపూర్, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ సర్కార్‌లో పేదోళ్ల గూడుతో పాటు ఉపాధి కూడా కోల్పోతున్నారు. సోమవారం కాప్రా మున్సిపల్ పరిధిలో మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తా నుంచి శివ హోటల్ చౌరస్తా వరకు అక్రమ నిర్మాణాలను, షెడ్డులను మున్సిపల్ అధికారులు కూల్చేశారు. మల్లాపూర్ నోమా ఫంక్షన్ హాల్ ఎదుట ఓ తల్లీకొడుకు చెప్పుల దుకాణాన్ని కూల్చవద్దంటూ అధికారుల కాళ్లా వేళ్లాపడ్డారు. తనకు షుగర్, బీపీ ఉన్నదని ఇల్లు గడవడమే కష్టంగా ఉందని, దుకాణాన్ని కూల్చితే బతకలేనని ఆ తల్లి కన్నీరుమున్నీరైంది. కానీ అధికారులు చలించలేదు. 'రెండు చేతులతో దండం పెడుతూ కేసీఆర్ సారూ ఎక్కడున్నావు. ఈ అన్యాయాన్ని చూడు. మమ్మల్ని మీరే కాపాడాలి. రేవంత్ మా బతుకును నాశనం చేస్తున్నాడు' అంటూ తల్లీకొడుకులు విజ్ఞప్తి చేశారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశాలతో అక్రమణలను తొలగించినట్టు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

బ్రదర్ భద్రం.. బడుగులు ఛిద్రం

మొదటిపేజీ తరువాయి...



వ్యవహరించిన తీరు ఇప్పుడు సరికొత్త చర్చకు కారణమైంది. ఈ సొసైటీకి నెలన్నర క్రితమే నోటీసులిచ్చిన హైడ్రా ఇప్పటి వరకు అటువైపు పొరపాటున కూడా కన్నెత్తి చూడలేదు. ఆ సొసైటీలో నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఉండడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదేమో! ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలకు ఆగస్టు 8న అధికారులు హడావుడిగా నోటీసులు జారీచేసి చేతులు దులుపుకొన్నారు. ఈ నోటీసులపై సొసైటీ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్టీఎల్ విషయంలో తమకు అభ్యంతరాలు ఉన్నాయని, అది తేలేవరకు కూల్చివేతలు కూడదని న్యాయస్థానం తాజాగా తీర్పు ఇవ్వడంతో వారంతా హైడ్రా బుల్డోజర్ల నుంచి సేఫ్‌గా బయటపడ్డారు.

హైడ్రా దూకుడుకు కళ్లెం

అన్ని చెరువుల్లానే దుర్గం చెరువు కూడా అన్యాక్రాంతమైంది. ఈ చెరువు పరీవాహక ప్రాంతంలోనే అమర్ కోఆపరేటివ్ సొసైటీ ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి దశాబ్దం క్రితమే ఇక్కడ కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించారు. దీనికే గత నెలలో హైడ్రా అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ నోటీసులపై స్థానికులు అభ్యంతరాలను లేవనెత్తారు. చెరువు ఎఫ్టీఎల్ నిర్ధారణ అయ్యే వరకు కూల్చివేతలు చేపట్టవద్దని హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా విచారణ ప్రారంభించిన న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పునిస్తూ హైడ్రా దూకుడుకు కళ్లెం వేసింది. ఈ విషయంలో హెచ్ఎండీఏ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో ఉన్న పూర్తి విస్తీర్ణంలో అమర్ కోఆపటివ్ సోసైటీకి ఉన్న అభ్యంతరాలను చర్చించుకోవాలని తెలిపింది. ఆ తర్వాతే దుర్గం చెరువు పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఆరు వారాల్లోపు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని ఆదేశించింది. దీంతో అప్పటి వరకు అక్కడ ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని కోర్టుకు జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది.

మొదటి నుంచీ వివాదాస్పదమే

అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా తీరు మొదటి నుంచి వివాదస్పదంగానే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే కూల్చివేతలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారనే వాదన బలపడేలా వ్యవహరిస్తున్నది. అమర్ కోఆపరేటివ్ సొసైటీ విషయంలోనూ ఆయన ఆదేశాలనే హైడ్రా పాటిస్తున్నదని తేలింది. ఆ సొసైటీకి ఆగస్టులోనే నోటీసులు జారీచేసినా కూల్చివేతల విషయంలో సాధారణంగా చేసే హడావుడి చేయలేదు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించడం.. తాజాగా వారికి తీర్పు అనుకూలంగా రావడం జరిగిపోయింది. కోర్టు తీర్పుతో రేవంత్ సోదరుడు ప్రస్తుతానికి సేఫ్‌గానే బయపడినట్టు లెక్క.

హైడ్రా కొరడా సామాన్యుడిపైనే

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయడమే లక్ష్యంగా పని చేస్తున్న హైడ్రా సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్లపైనే కొరడా ఝుళిపిస్తున్నది. పేద, మధ్య తరగతి ప్రజలు నిర్మించుకునే ఇండ్లను కూల్చివేస్తున్నది. బిల్డర్లు, డెవలపర్లు చేసిన తప్పిదాలకు సామాన్యుల గూడు కూలిపోతున్నది. అదే సమయంలో రాజకీయ పలుకుబడితో చెరువులను అన్యాక్రాంతం చేసిన సంపన్నులను టచ్ చేసేందుకు కూడా సాహసించడం లేదు. ఎన్ కన్వెన్షన్ లాంటి నిర్మాణాలను కూల్చివేసినా, నల్లచెరువు పరివాహక ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు నోటీసులిచ్చిన ఏడు రోజుల్లోనే బుల్డోజర్లను ఎగదోసిన హైడ్రా కమిషనర్ అమర్ కో ఆపరేటివ్ సొసైటీ విషయంలో ఆచితూచి అడుగులు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ సొసైటీలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లు ఉండడమే అందుకు కారణమని చెప్తున్నారు. ఈ కారణంగానే ఆగస్టులో నోటీసులు ఇచ్చి, వారు హైకోర్టును ఆశ్రయించి, విచారణ జరిగి, స్టే వచ్చేంత సమయం వరకు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారని అంటున్నారు.

ఇప్పుడు ఎవరు వచ్చి ఏం చేస్తరు?

- ప్రభుత్వ ముఖ్యనేత బంధువు బేఖాతరు
- మంఖాల్ భూములపై విచారణ కమిటీ ఏటూ తేల్చదనే ధీమా

మహేశ్వరం, సెప్టెంబర్ 23 : మంఖాల్‌లోని ఇందిరమ్మ భూములు కార్పొరేట్ చెరలోకి వెళ్లిన వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం వచ్చిన తర్వాత స్థానికంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వ ముఖ్యనేత బంధువు వద్ద ఈ విషయం ప్రస్తావనకు రావటంతో 'అయ్యేదేముంది? పోయేదేముంది?'.. రికార్డులు మారినయ్.. భూమి స్వాధీనమైంది.. ఇప్పుడు ఎవరు వస్తరు.. ఏం చేస్తరు?' అన్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై కొన్ని నెలల కిందట వేసిన విచారణ కమిటీ కూడా ఎటూ తేల్చదనే దృఢ సంకల్పంతో వారున్నట్టు స్పష్టమవుతున్నది. విచారణ కమిటీ కాలయాపన కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నది.

'దుర్గంచెరువు' కూల్చివేతలు ఉండవు

- హైకోర్టుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం
- బాధితుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి
- ఎఫ్‌టీఎల్‌ను ఆరువారాల్లో నిర్ధారించాలి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల కూల్చివేతల విషయంలో కఠిన చర్యలు చేపట్టబోమని లేక్‌ప్రొటెక్షన్ కమిటీ హామీ ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తామని, అప్పటివరకు కూల్చివేతలు ఉండబోవని వెల్లడించింది. పిటిషనర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని, ఆరు వారాల్లో నిర్ణయం వెలువరించాలని హైకోర్టు లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేస్తామని అప్పటివరకు దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల కూల్చివేత ఉండబోదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దుర్గంచెరువు పరిధిలోని అమర్ సొసైటీలోనే నివాసముంటున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి కూడా హైడ్రా నోటీసులు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట గ్రామం సర్వే నంబర్ 47లో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేత నోటీసులు ఇచ్చారంటూ అమర్ సొసైటీ ప్లాట్ ఓనర్ల అసోసియేషన్ మరో ఇద్దరు వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాష్, న్యాయవాది పిరాయ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నీటిపారుదల శాఖలోని చెరువుల మ్యాప్ ప్రకారం దుర్గంచెరువు విస్తీర్ణం 65 ఎకరాలు మాత్రమేనని, అయితే 160ఎకరాలని అధికారులు చెప్పడం చట్ట వ్యతిరేకమని చెప్పారు. బిల్డింగ్ రూల్స్ 2012లో వచ్చాయని, అప్పటికే హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా అనుమతులతో నిర్మాణాలు జరిగాయని, ఇప్పుడు వాటిని అక్రమ నిర్మాణాలని చెప్పి కూల్చివేత చర్యలు తీసుకోవడం దారుణమని అన్నారు. హెచ్ఎండీఏ అనుమతులతో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామనడం సరికాదని అన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు లేక్ ప్రొటెక్షన్ కమిటీ 2014 జూన్ 7న ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేస్తే ..అదే నెల 14న అభ్యంతరాలు చెప్పామని తెలిపారు. తుది నోటిఫికేషన్ కూడా వెలువడలేదని అన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పీ శ్రీధర్‌రెడ్డి వాదిస్తూ.. ఒక ప్రజాహిత వ్యాజ్యంలో ఇదే హైకోర్టు చెరువుల ఎఫ్‌టీఎల్స్ నిర్ధారణ చేయాలని ఆదేశించిందని, హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కూల్చివేత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎఫ్‌టీఎల్స్‌ను మూడు నెలల్లో నిర్ధారించాలని ఇదే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు.. లేక్ ప్రొటెక్షన్ కమిటీకి సమర్పించిన అభ్యంతరాలను అక్టోబర్ 4లోగా అందజేయాలని పిటిషనర్లను ఆదేశించింది. అభ్యంతరాలు పరిశీలించి ఆరు వారాల్లోగా ఎఫ్‌టీఎల్‌పై నిర్ణయాన్ని వెలువరించాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించింది. ఈలోగా కూల్చివేత చర్యలు తీసుకోరాదని కమిటీని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది ఇచ్చిన హామీని కోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. కేసు పూర్వపరాల్లోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. పిటిషన్లపై విచారణను మూసేసింది.

చౌటుప్పల్‌లో 'నమస్తే' కథనం హల్‌చల్

- ప్రభుత్వ కుట్రలు బహిర్గతం చేశారని 'నమస్తే తెలంగాణ'కు ప్రశంసలు
- తమ గోడును కండ్లకు కట్టారన్న బాధితులు
- వాట్సాప్ గ్రూపుల్లో స్టేటస్‌లు, డీపీలుగా కథనం
- గతంలో కోమటిరెడ్డి వ్యాఖ్యలు మరోసారి తెరపైకి
- అలైన్‌మెంట్ మారుస్తానన్న వీడియోలు వైరల్



నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ)/చౌటుప్పల్: చౌటుప్పల్‌లో ట్రిపుల్‌ఆర్ భూ మాయం.. జంక్షన్.. టెన్షన్ పేరుతో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనం సంచలనం సృష్టించింది. దక్షిణభాగం అలైన్‌మెంట్‌లో భాగంగా చౌటుప్పల్‌లో జంక్షన్‌ను 181 ఎకరాలకు విస్తరించటంపై.. ప్రభుత్వ కోణాన్ని ఆవిష్కరిస్తూ, జిల్లా మంత్రి, ఎమ్మెల్యే తీరును ఎండగడుతూ, బాధితు ఆవేదన, ఆందోళనను కండ్లకు కడుతూ ప్రచురించిన కథనం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిర్వాసితుల వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా షేర్ అయ్యింది. ఎంతోమంది స్టేటస్‌గా, డీపీగా పెట్టుకొని.. ప్రభుత్వానికి తమ గోడు వినిపించేలా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ షేర్ చేశారు. తెలంగాణ బిడ్డల ఆస్తులను ఫణంగా పెడుతూ ఇతర ప్రాంత ప్రయాణికుల విందు, వినోదాల కోసం జంక్షన్ విస్తరణ చేయటాన్ని అడ్డుకుంటామని బాధితులు చెప్తున్నారు. అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధమని నిర్వాసితుల పక్షాన ట్రిపుల్ బాధిత సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ క్రమంలో బాధితులంతా కలిసి న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

తెరపైకి కోమటిరెడ్డి వీడియోలు

ట్రిపుల్ ఆర్ బాధితులతో గతంలో ఎంపీగా ఉన్నపుడు, ఇప్పుడు మంత్రి అయ్యాక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహార శైలిపై 'నమస్తే తెలంగాణ' కథనంలో పేర్కొన్న అంశాలపై కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో రాయగిరి రైతుల పక్షాన మాట్లాడిన మాటలను మరోసారి వైరల్ అయ్యాయి. అలైన్‌మెంట్ మార్చుతామని, బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పిన మాటలను బాధితులు సోషల్ మీడియా వేదికగా గుర్తుచేశారు. 'ఆ డిపార్ట్‌మెంట్ నాదే.. రోడ్ నాదే.. అలైన్మెంట్ మార్చేద్దాం' అని చెప్పిన వీడియోను వైరల్ చేశారు. ఇపుడేమో రైతులకు సమయం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మూడు సార్లు భూములు తీసుకున్నరు



ఇప్పటికే మూడు సార్లు భూములు తీసుకున్నరు. అయినా సప్పుడు చేయలేదు. మళ్లీ ఇప్పుడు భూమి ఇవ్వుమంటున్నరు. మేం ఎట్ల బతకాలి? కాయకష్టం చేసుకుని చిన్నతనం నుంచి భూమిని నమ్ముకొని బతికినం. ప్రాణం పోయినా భూమి ఇచ్చేది లేదు. ఉన్న భూమిపోతే రోడ్డు మీద పడాల్సిందే. చూసే దిక్కు కూడా ఉండడు.

-జాల యాదయ్యయాదవ్, రైతు, చౌటుప్పల్

పాలకులు పట్టించుకోవడం లేదు



బాధితులకు న్యాయం చేసే విషయం లో కాంగ్రెస్ పాలకులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఎన్నిసార్లు వెళ్లినా రైతులకు బహిరంగ ధర ఇప్పిస్తామని అన్నరు. ఇప్పుడు ఎవరూ సప్పుడు చేస్తలేరు. ఇక్కడ జంక్షన్ వస్తే చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా చీలి అభివృద్ధి కూడా కుంటుపడుతుంది.

-గుండెబోయిన వేణుయాదవ్, రైతు, తంగడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నప్పడు ఎందుకు మార్చరు



దక్షిణ భాగం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని అంటున్నరు. మాది దక్షిణభాగమే కదా. జంక్షన్ మార్చే అవకాశం ఉంటుంది కదా. ఎందుకు ఇక్కడి రైతులను పట్టించుకోరు? మా తరపున అడిగే పెద్దలు ఎవరూ లేరా?

-జాల జంగయ్య యాదవ్, రైతు, తంగడపల్లి

మా పిల్లల భవిష్యత్తు ఏంది?



కొన్నేండ్ల నుంచి పరిశ్రమల కాలుష్యం మూలంగా పంటలు పండటం లేదు. ఇప్పటికే ఎంతో ఆర్థికంగా నష్టపోయాం. అయినా భూమి ఉందన్న ధీమాతో కష్టం చేసుకుని బతుకు వెళ్లదీస్తున్నం. ఇప్పుడు రింగురోడ్డు అని భూమి గుంజుకుంటే ఎట్లా? ఉన్న భూమి పోతే మా పిల్లల భవిష్యత్తు ఏంది? **-జాల అంజయ్య యాదవ్, రైతు, చౌటుప్పల్**

మంఖాల్ భూముల దందాలో మరో ట్విస్ట్

- అదనపు భూములకు డబ్బు చెల్లించాలని రైతుల డిమాండ్
- సంబంధిత వ్యక్తులతో మాట్లాడాలంటూ మధ్యవర్తిపై ఒత్తిడి
- పనిలో పనిగా పీవోటీ రెండెకరాలపైనా అక్రమార్కుల కన్ను
- ప్రహరీ నిర్మిస్తుండటంతో అడ్డుకున్న అధికారులు

మహేశ్వరం, సెప్టెంబర్ 23: రంగారెడ్డి జిల్లా కందుకూరులోని మంఖాల్ లావణి పట్టా భూముల వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. రైతుల పేర్ల మీద కాకుండా అదనంగా ఉన్న భూములను తమ పేరు మీదికి మార్చుకున్నందున ఆ విస్తీర్ణానికి కూడా డబ్బులు చెల్లించాలని లావణి పట్టా ఉన్న రైతులు డిమాండ్ మొదలుపెట్టారు. మంఖాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 608, 609, 610ల్లోని 35.36 ఎకరాలను ఇందిరాగాంధీ కాలంలోనే దళిత రైతులకు ఉపాధి కోసం ఇవ్వగా, ఈ భూములను ఒక కార్పొరేట్ కంపెనీతో పాటు కొందరు వ్యక్తులు చెరపట్టారు. ఈ బండారంపై 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'ఇందిరమ్మ భూములకు కార్పొరేట్ చెర' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో రైతుల పేరిట రికార్డుల్లో లావణి పట్టాగా ఉన్న 35.36 ఎకరాలే కాకుండా అదనంగా 12 ఎకరాలు, మొత్తం 47.37 ఎకరాల భూమిని వీఆర్‌కే డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్‌తో పాటు పలువురి పేర్లపై బదలాయించుకున్నారు. ఓ వైపు దీనిపై విచారణ కొనసాగుతున్నదని కలెక్టర్ శశాంక చెప్తున్నా, క్షేత్రస్థాయిలో సదరు కంపెనీ వాళ్లు భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ రేకులతో ప్రహరీ కూడా నిర్మించారు. రికార్డుల మార్పిడి జరిగినందున రైతులందరికీ డబ్బులు చెల్లింపులయ్యాయని అనుకున్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' కథనం తర్వాత అసలు గుట్టు బయటపడింది. సదరు కంపెనీ, వ్యక్తులు.. రైతులకు కేవలం వారి పేరిట లావణి పట్టా ఉన్న 33.36 (రెండెకరాలు డంపింగ్ యార్డుకు కేటాయింపు) ఎకరాలకు మాత్రమే చెల్లింపులు చేసినట్టు వెల్లడైంది. దీంతో సదరు కంపెనీతో లావాదేవీ జరిపిన మధ్యవర్తి వద్దకు వెళ్లిన రైతులు తమకు రికార్డుల్లో ఉన్న మేర విస్తీర్ణానికే డబ్బులు వచ్చాయని, అదనంగా 12 ఎకరాలు కూడా వారి పేర్ల మీద ఎక్కినందున డబ్బులు ఇప్పించాలంటూ ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

ఆ.. రెండెకరాలూ కానిచ్చేస్తున్నారు?

మూడు సర్వే నంబర్లలో 608/5లో ఉన్న రెండెకరాల లావణి పట్టా భూమిని రైతు అమ్ముకునేందుకు యత్నించగా, రెవెన్యూ అధికారులు పీవోటీ కింద ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామ అవసరాల నిమిత్తం చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించారు. రికార్డులో సర్కారు భూమిగానే ఉన్నది. తాజాగా అంతా పోయాక.. ఈ రెండెకరాలు ఉండి ఏం లాభం అనుకున్నారో ఏమో! సోమవారం కొందరు వ్యక్తులు ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. విషయం బయటికి పొక్కి అధికారుల దాకా వెళ్లింది. గంటల తరబడి తర్జనభర్జనలు పడిన అధికారులు ఎట్టకేలకు పనులు నిలిపివేయించినట్టు తెలిసింది. దీనిపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనా సోమవారం వరకు మాత్రం ఫిర్యాదు ఇవ్వలేదు.

అసైన్డ్ భూమిలో కాంగ్రెస్ నేత పాగా

20 గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకున్న అధికార పార్టీ నేత

- రెగ్యులరైజ్‌కు దరఖాస్తు.. తిరస్కరించిన అధికారులు
- రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పట్టని యంత్రాంగం
- జయశంకర్ జిల్లా కేంద్రం నడిబొడ్డున భూ దందా

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): అసైన్డ్ భూమిలో అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఏకంగా పట్టా పాస్ పుస్తకాలు పొందారు. ఇలా రూ.20 కోట్ల విలువ చేసే రెండెకరాల అసైన్డ్ భూమిని కాజేసేందుకు పక్కాప్లాన్ వేసుకున్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పక్కనే ఓ అధికార పార్టీ నేత ఏకంగా 20 గుంటల అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని జీవో 59 కింద రెగ్యులరైజ్ చేయాలని దరఖాస్తు చేసుకోవడమే కాకుండా షెడ్లు కూడా నిర్మించాడు. వీటి జోలికి మాత్రం అధికారులు వెళ్లడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కనే 170 సర్వే నంబర్‌లో 14 మంది దళిత పేద రైతులకు ఆరెకరాల అసైన్డ్ భూమిని 1975లో ప్రభుత్వం కేటాయించింది. చాలా మంది విక్రయించడంతో ప్రభుత్వం వారి హక్కు పత్రాలు రద్దు చేసింది. దీనిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు ఇండ్లకు తాళాలు వేశారు. వారు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణాలను అధికారులు తొలిగించలేకపోయారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న ఈ భూమిలో ప్రస్తుతం మళ్లీ అక్రమ నిర్మాణాలు మొదలయ్యాయి. నలుగురు వ్యక్తులు తమకు 1975లో ప్రభుత్వం సాగు హక్కు పత్రాలు ఇచ్చిందని, తహసీల్దార్ పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని సోమవారం రూ.2 కోట్ల విలువైన రెండెకరాల భూమిని చదును చేసి గది నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి పనులు అడ్డుకున్నారు. 20 ఏండ్లకు పైగా సాగులో లేని అసైన్డ్ భూమికి పట్టా పాస్ పుస్తకాలు ఎలా జారీ అయ్యాయని, మున్సిపల్ స్థలంలో అనుమతులు లేకుండా ఎలా నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు.

ఆ రేకుల షెడ్ల జోలికి వెళ్లని అధికారులు

170 సర్వే నంబర్‌లోని 20 గుంటల అసైన్డ్ భూమిలో ఓ అధికార పార్టీ నేత పాగా వేశారు. క్రయ విక్రయాలకు వీలు లేని అసైన్డ్ భూమిని కొనుగోలు చేశానని సదరు నేత ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అంతటితో ఆగకుండా 59 జీవో కింద రెగ్యులరైజ్ చేయాలంటూ దరఖాస్తు చేసుకుని రూ.10 లక్షలు డీడీ తీశాడు. అధికారులు అతడి దరఖాస్తును తిరస్కరించినా ఆ స్థలంలో షెడ్లు నిర్మించాడు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికార పార్టీ నేత కావడంతోనే చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారనే ఆరోపణలున్నాయి.



జయశంకర్ భూపాలపల్లిలోని 170 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమిలో నిర్మిస్తున్న గది

మాకు పట్టా ఇచ్చారు

170/3/1 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమిలో 1975లో 14 మందికి 20 గుంటల చొప్పున హక్కు పత్రాలు ఇచ్చారు. పాస్ పుస్తకాలున్న నలుగురికి చెందిన 2 ఎకరాలను చదును చేస్తుండగా అధికారులు అడ్డుకుంటున్నారు. **- మోరె వెంకటయ్య**

విచారణ జరుపుతున్నాం

170 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమికి పట్టాలు ఎలా వచ్చాయనే విషయమై విచారణ జరుపుతున్నాం. ఇదే సర్వే నంబర్‌లో మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకొని 59 జీవో కింద రెగ్యులరైజ్‌కు దరఖాస్తు చేసుకోగా తిరస్కరించాం.

- శ్రీనివాసులు, తహసీల్దార్

సింగరేణి తుది 'కీ'లో తప్పులు

రెండింటి సమాధానాలు తప్పగా ఇచ్చారంటున్న అభ్యర్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్ష తుది 'కీ'లో తప్పులున్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. రెండు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నట్టుగా పేర్కొంటున్నారు. ఈ తప్పులను సింగరేణి సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్లినా సవరించలేదని, తమకు అన్యా యం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 139 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి మార్చి 1న నోటిఫికేషన్ జారీచేయగా, జూలై 21న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 7న ప్రాథమిక కీని విడుదల చేయగా, పలువురు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఫైనల్ కీని విడుదల చేశారు. ఈ ఫైనల్ కీపై అభ్యంతరాలు వ్యక్తంచే స్తూ ఈ నెల 10న అభ్యర్థులు సింగరేణి సీఎండీని కలిసి ఆధారాలు సైతం సమర్పించారు. తప్పులుంటే సవరిస్తామని సీఎండీ అభ్యర్థులకు చెప్పారు. కానీ సరిదిద్దకుండానే 17న ఫలితాలను ప్రకటించి, ప్రొవిజినల్ లిస్టును వెల్లడించారు. దీనిపై అభ్యర్థులు అధికారులను కలిసి గోడు వెల్లబోసుకోగా.. 'తామేం చేయలేం. ఏదైనా ఉం టే కోర్టుకెళ్లి తేల్చుకోవాలి' అని ఉచిత సలహానిచ్చినట్టు అభ్యర్థులు వాపోయారు.

అభ్యర్థుల అభ్యంతరాలివే..

- ప్రశ్న నెంబర్ 87 ఎంత సామర్థ్యం గల డంపర్లల్లో మైక్రో ప్రాసెసర్ బేస్డ్ కంట్రోల్ సిస్టంను తప్పనిసరిగా వాడతారు. అన్న ప్రశ్నకు తుదీ కీలో సరైన సమాధానంగా 25 టన్నులు అన్న ఆప్షన్‌ను ప్రకటించారు. కానీ ఇది తప్పు 85 టన్నులని అభ్యర్థులంటున్నారు. సమీర్‌కుమార్ దాస్ రచించిన సర్ఫేజ్ మైనింగ్ టెక్నాలజీ పుస్తకాల్లోనూ ఇదే ఉందంటున్నారు.
- ప్రశ్న నెంబర్ 103 సంతృప్తికరమైన ఆపరేషన్స్ కోసం పీక్ టూ పీక్ మెగావాట్ సైక్లిక్ స్వింగ్ డ్రాగ్ లైన్ ఎంత దాటరాదు. అన్న ప్రశ్నకు తుదీ కీలో 100శాతం అన్న ఆప్షన్ సరైన సమాధానంగా ప్రకటించారు. కానీ ఇది తప్పు అని 70శాతం సరైన సమాధానమని అభ్యర్థులంటున్నారు.

ఆర్టీసీ బస్సు చోరీ.. ఒకరిపై కేసు



నిర్మల్ ఆర్టీసీ డిపోలోని బస్సు చోరీకి గురికావడం కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన గణేశ్ వ్యంకటి యాలవాడ్ మద్యం మత్తులో ఆదివారం అర్ధరాత్రి ఆర్టీసీ డిపో గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. డిపోలో నిలిపి ఉన్న ఏపీ 01 జడ్ 0076 బస్సును తస్కరించాడు. దీనిని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంబడించి సోఫీనగర్ వద్ద బస్సును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ ప్రవీణ తెలిపారు. **-నిర్మల్ అర్బన్**

బ్రీత్ ఎనలైజర్‌లో లోపాలు

ఆర్టీసీ జేడీకి జేఏసీ ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ డిపోలలో వినియోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్స్‌లో లోపాలున్నాయని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. వీటి వల్ల డ్రైవర్లకు అన్యాయం జరుగుతున్నదని, వీటిపై విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. సోమవారం జేఏ సీ వైస్ చైర్మ న్ థామస్‌రెడ్డి, కో-కన్వీనర్ సుద్దాల సురేశ్‌తో కలిసి ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావుకు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్లు మద్యం తాగకున్నా తా గినట్టు బ్రీత్ ఎనలైజర్ టెస్టులో చూపెడుతున్నదని, దీంతో అధికారులు కేసు లు నమోదు చేస్తున్నారని తెలిపారు. స్పందించిన అపూర్వరావు బ్రీత్ ఎనలైజర్‌లను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. వీటి రద్దు కోసం జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం బస్‌భవన్ ఎదుట కార్మిక సంఘాలు నిరసన చేపట్టాయి. డిపోలలోనూ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి తెలిపారు.

ప్రమాదాల నివారణకు స్మార్ట్ రోడ్ టెక్నాలజీ

మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రపంచమంతటా అనుసరిస్తున్న అధునాతన రోడ్డు నిర్మాణ పద్ధతులను తెలంగాణలోనూ అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. స్మార్ట్ రోడ్ టెక్నాలజీ, ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఫ్యూచరిస్టిక్ ఆటోమేటెడ్ కన్‌స్ట్రక్షన్, ఐసీటీ వంటి అధునాతన పద్ధతులను రోడ్ల నిర్మాణంలో వినియోగించి రోడ్డు మరణాలను తగ్గిస్తామని అన్నారు. సచివాలయంలో సోమవారం ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి ప్రపంచబ్యాంకు సహకారంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక అత్యంత ప్రమాదకరంగా ఉన్న హైవేలపై ట్రామాకేర్ సెంటర్స్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని, ఇప్పటికే హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ట్రామాకేర్ సెంటర్ నిర్మాణంలో ఉన్నదని తెలిపారు. ప్రపంచ బ్యాంక్ రవాణారంగ ప్రధాన అధికారి రీనూ అనుజా తమ బ్యాంక్ సహకారంతో అమలవుతున్న రోడ్డు నిర్మాణాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఈఎన్సీ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు మంత్రులు

కార్యకర్తల సాధకబాధకాలు వినేందుకు..

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : కార్యకర్తల సాధకబాధకాలు వినేందుకు ప్రతి బుధ, శుక్రవారాల్లో వివిధ శాఖల మంత్రులు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఈ మేరకు సోమవారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ గాని మహేశ్‌కుమార్‌గౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, 27న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు.

పాల సేకరణ ధరలో కోత?

- లీటర్‌పై 5 తగ్గించే యోచనలో ప్రభుత్వం
- పాడి రైతులతో చైర్మన్ అమిత్ ప్రతిపాదన
- ప్రభుత్వ సమీక్షలోనూ ధర తగ్గింపుపై చర్చ
- ప్రైవేట్ డెయిరీల తరహాలో చెల్లించే ఆలోచన
- రైతులకు ఎక్కువ చెల్లించడం వల్లే నష్టాలట!
- భారం తగ్గాలంటే.. ధరలు దించాల్సిందేనట..
- రైతులను నిండా ముంచేందుకు ప్రభుత్వం కుట్రలు
- రైతుల మేలు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ధర పెంచితే.. నష్టాల పేరిట తగ్గిస్తున్న కాంగ్రెస్

పాడి రైతుల నోట్లో సర్కార్ మట్టి!

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : విజయ పాల రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు సర్కార్ సిద్ధమవుతున్నదా? రైతులకు చెల్లించే ధరలో కోత పెట్టబోతున్నదా? ఎక్కువ ధర ఇవ్వడం వల్లే డెయిరీకి నష్టాలొస్తున్నాయనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నదా? ఈ ప్రశ్నలకు పాడి రైతులతో పాటు విజయ డెయిరీ వర్గాల్లోనూ 'అవును' అనే సమాధానాలే వినిపిస్తున్నాయి. లీటరు పాల ధరపై రూ.5 వరకు తగ్గించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నదని, త్వరలోనే అమలు చేయనున్నదని డెయిరీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కొత్త చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, సీఎంవో అధికారుల మధ్య చర్చలు కూడా జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే సాధ్యమైనంత త్వరగా ధరలు తగ్గించి నష్టాలు పూడ్చుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

ధర తగ్గింపే పరిష్కారం.. మీరంతా సహకరించాలి

విజయ డెయిరీ కొత్త చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన పాడి రైతులకు ధర తగ్గింపుపై ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. కొత్త చైర్మన్‌గా నియమితులు కావడంతో ఆయా జిల్లాల పాడి రైతు సంఘాల నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు. ఈ సందర్భంగా తమకు మూడు నెలలుగా రూ.150 కోట్ల వరకు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 'సమస్య పరిష్కారానికి ఏం చేద్దామో మీరే చెప్పిండి' అంటూ రైతులను కోరినట్టు తెలిసింది. ప్రభుత్వంతో మాట్లాడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు చెప్పగా చైర్మన్ కల్పించుకొని 'ప్రైవేట్ డెయిరీలతో పోల్చితే విజయ డెయిరీలో రైతులకు చెల్లించే పాల ధర ఎక్కువగా ఉంది.. అందుకే నష్టాలు వస్తున్నాయి' అని వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయ సమాచారం. నష్టాల నుంచి బయటపడాలంటే పాల ధర తగ్గించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసినట్టు, ఇందుకు అన్ని జిల్లాల పాడి రైతు సంఘాలు సహకరించాలని కోరినట్టు తెలిసింది. కానీ, దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ధర తగ్గింపు ఆలోచన చేయవద్దని, కొత్త సమస్యలు సృష్టించొద్దని కోపానికి రాగా వారి ఆగ్రహాన్ని పసిగట్టిన చైర్మన్ ఆ విషయం పెద్దది కాకుండా జాగ్రత్త పడుతూ ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చి పంపినట్టు రైతు సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.

ఎక్కువ ధర చెల్లించడం వల్లే నష్టాలట?

పాల బిల్లులు చెల్లించాలని ఓవైపు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్డెక్కుతున్నారు. వారికి మద్దతుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురిస్తున్నది. ఈ నేపథ్యంలో సమస్యపై ప్రభుత్వం ఆరా తీసి డెయిరీ అధికారులు, చైర్మన్‌తో చర్చించినట్టు తెలిసింది. రైతులకు చెల్లించే పాల ధర ప్రైవేట్ డెయిరీలతో పోల్చితే విజయ డెయిరీలో ఎక్కువ ఉండడమే ఇందుకు కారణమని అధికారులు చెప్పగా అవసరమైతే ధర తగ్గించే ఆలోచన చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ప్రస్తుతం 5శాతం వెన్న ఉన్న లీటరు బర్రె పాలకు రూ.40.05 ధర చెల్లిస్తున్నారు. వెన్నశాతం ఎంత పెరిగితే అంత ధర పెంచి ఇస్తున్నారు. ఆవు పాలలో 3 శాతం వెన్న ఉంటే లీటరుకు రూ. 40.25 చొప్పున ఇస్తున్నారు. కరీంనగర్ డెయిరీలో ఆవుపాలకు 3శాతం వెన్న ఉంటే రూ. 33.65, నాగార్జున డెయిరీలో రూ. 33.25 చెల్లిస్తున్నారు. విజయ డెయిరీలో రైతులకు ఎక్కువ ధర చెల్లించడం వల్ల నష్టాలు వస్తున్నట్టు చెప్తుండడం గమనార్హం.

పెంచిన బీఆర్ఎస్.. తగ్గిస్తున్న కాంగ్రెస్

రైతులకు ఎంత వీలైతే అంత మేలు చేయాలని తపించిన మాజీ సీఎం కేసీఆర్ ఇందుకు అనుగుణంగానే చర్యలు తీసుకున్నారు. నాడు నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని ప్రక్షాళన చేసి లాభాల్లోకి తెచ్చారు. విజయ డెయిరీ బలోపేతం కావాలంటే రైతులు పాలు పోస్తేనే సాధ్యమవుతుందని, డెయిరీ బలోపేతమైతే రైతులను దోచుకునే ప్రైవేటు డెయిరీల ఆగడాలకు కళ్లెం పడుతుందని భావించి పాల ధరను పెంచారు. ప్రైవేట్ డెయిరీల కన్నా ఎక్కువ ధర కల్పించారు. దీంతో డెయిరీకి పాల సేకరణ పెరిగి అభివృద్ధి బాట పట్టింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో డెయిరీకి మళ్లీ కష్టాలు, నష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో అక్కడి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలున్నాయి. ముఖ్యంగా ఈ శాఖకు మంత్రి లేకపోవడం అతిపెద్ద సమస్యగా మారింది. మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ శాఖ వైపు కన్నెత్తి చూడడంలేదు. ఈ నేపథ్యంలో డెయిరీ మళ్లీ తిరోగమనంలోకి పయనించి రైతులకు బిల్లులు చెల్లించలేని దుస్థితికి దిగజారింది. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ పాల ధర ఎక్కువగా ఉండటం వల్లే నష్టాలు వస్తున్నాయని ప్రచారం చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరలు తగ్గించే ఆలోచన చేస్తుండడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

'నాన్ పిటిషనర్ల'కు అవకాశం ఇస్తరా?

- నీట్ కౌన్సెలింగ్‌పై తేల్చని వైద్యారోగ్య శాఖ
- జీవో-33 బాధితుల ఎదురుచూపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : నీట్ యూజీ కౌన్సెలింగ్‌లో 'స్థానికత' వివాదానికి సంబంధించి ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కోర్టును ఆశ్రయించినవారికి నీట్ యూజీ కౌన్సెలింగ్‌లో అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలిపిన సంగతి తెలిసిందే. జీవో-33ను వ్యతిరేకిస్తూ 135 మంది అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారికి అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు సైతం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నాన్ పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవో-33తో ప్రభావితమయ్యే అభ్యర్థులు దాదాపు వెయ్యి మంది వరకు ఉంటారని వైద్య, ఆరోగ్య శాఖ అంచనా వేస్తున్నది. ఇందులో కేవలం 135 మంది మాత్రమే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిగతా వారు వివిధ కారణాల వల్ల న్యాయస్థానాలను ఆశ్రయించలేకపోయారు. కొందరు పేదరికంతో, మరికొందరు సమాచారం లేక, ఇంకొందరు మార్గం తెలియక కోర్టును ఆశ్రయించలేదు. ఇప్పుడు వారంతా అయోమయంలో పడ్డారు. కేవలం పిటిషనర్లకే అవకాశం ఇస్తే దాదాపు 850 మంది అన్యాయానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బాధితులందరికీ అవకాశమివ్వాలని కోరుతున్నారు. మరికొందరు తమకు కూడా అవకాశం ఇవ్వాలంటూ కోర్టు మెట్లెక్కేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఈ అంశంలో సుప్రీంకోర్టు గత శుక్రవారం తీర్పునిచ్చింది. నాలుగు రోజులు గడుస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఈ నిర్ణయంపై సమీక్షించలేదు. పిటిషనర్లు, నాన్ పిటిషనర్ల అంశంపై చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కౌన్సెలింగ్ గడువు దగ్గరికి వస్తున్నా నిర్ణయం తీసుకోకపోవడంపై అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి అందరికీ అవకాశం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

అక్టోబర్‌లో 500 బోనస్

డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వం : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ మొదటివారం నుంచి ప్రారంభించనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో అడిషనల్ కలెక్టర్లు, సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలుకు 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పాలు పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

సర్కారుపై పాడి రైతుల ఆగ్రహం

- రోడ్డుపై పాలు పోసి నిరసన
- ప్రభుత్వం పాల పైసలు చెల్లించాలని డిమాండ్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : విజయ డెయిరీకి పాలను విక్రయిస్తున్న రైతులు తమకు రెండున్నర నెలలుగా బిల్లులు రావడం లేదంటూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పాలను పారపోసి నిరసన చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో మూడు వేల మంది రైతులు ఉండగా.. పాల కేంద్రాల ద్వారా రోజుకు ఆరు వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. ఒక్కో లీటరుకు రూ.40 నుంచి రూ.60 వరకు రైతులకు ధర వస్తుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి 15 రోజులకు రూ.70 లక్షల బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో పాల రైతులకు సంబంధించిన రెండున్నర నెలల బిల్లులు రూ.3.50 కోట్లు బకాయి ఉంది. రెండున్నర నెలలుగా డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ విజయ డెయిరీ నుంచి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతాయని, తాము ఏమీ చేయలేమని అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమంగా బిల్లులు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 8 నెలలుగా బిల్లులు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

150 కోట్లకు 50కోట్లే!

- పాడి రైతులకు పెండింగ్ బిల్లుల విడుదల
- నేడు ఖాతాలో వేస్తామని ప్రభుత్వం ప్రకటన
- ఆందోళన చేయొద్దు : విజయ డెయిరీ ఎండీ
- 26న ధర్నాకు పిలుపునిచ్చిన పాడి రైతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : తమను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదంటూ పాడిరైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్కారుపై పోరుకు దిగిన రైతులు ఈ నెల 26న ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ధర్నాకు పోలీసులు కూడా అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వం జంకినట్టు కనిపిస్తున్నది. ధర్నాను తాత్కాలికంగా ఆపే ప్రయత్నాల్లో భాగంగా బకాయిలు విడుదల చేసింది. రూ. 50 కోట్ల బకాయిలు విడుదలైనట్టు డెయిరీ ఎండీ లక్ష్మి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మొత్తం మంగళవారం రైతుల ఖాతాల్లో జమవుతుందని వెల్లడించారు. ఇక రైతులెవరూ ఆందోళన చేయొద్దని, సంయమనం పాటించాలని కోరారు. మార్కెట్ ధర కన్నా ఎక్కువ రేటు చెల్లిస్తున్నామని, మిగిలిన బకాయిలను త్వరగా చెల్లిస్తామని హామీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రకటనపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను ధర్నా చేయకుండా అడ్డుకునేందుకు ఈ కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. మొత్తం బకాయిలు రూ.150 కోట్లకు పైగా ఉంటే కేవలం రూ.50 కోట్లు విడుదల చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది ముమ్మాటికీ తమను తప్పుదోవ పట్టించేందుకేనని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 50 కోట్లు విడుదల చేసినట్టు వచ్చిన ప్రకటనపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకటనపై అధికారుల సంతకం లేదని చెప్తున్నారు. రూ.50 కోట్లను మంగళవారం చెల్లిస్తామన్న ప్రకారం చెల్లించాలని, లేకుంటే మోసపూరిత కుట్రగానే భావించాల్సిందేనని స్పష్టంచేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రూప్-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్. చిత్రంలో ఇతర అధికారులు

'టాస్'ను ఏర్పాటుచేయాలి

సర్కారుకు గ్రూప్-1 ఆఫీసర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : కేరళ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ తరహాలో రాష్ట్రంలోనూ తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను(టాస్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర గ్రూప్-1 అధికారుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో ఐఏఎస్‌ల కొరత నేపథ్యంలో ప్రతిభావంతులైన గ్రూప్-1 అధికారులను కార్పొరేషన్ ఎండీలు, అదనపు కలెక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేసింది. గ్రూప్-1 అధికారుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంతునాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటుపై అధ్యయనానికి 2015లోనే ఆరుగురు ఐఏఎస్‌లతో కమిటీ వేశారని, ఈ కమిటీ ఇప్పటివరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించలేదన్నారు. తమ సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు. సమావేశంలో అధికారులు వేణుమాధవ్‌రెడ్డి, సయ్యద్ యాసిస్ ఖురేషి, అలోక్‌కుమార్, అంజన్ రావు, అజయ్, భవాని, శశిశ్రీ, పద్మజా రాణి, వినయ్, సోమశేఖర్, నూతనకంటి వెంకట్, శరత్‌చంద్ర, శ్రీరామ్, వినోద్‌రెడ్డి, షబానా, మైత్రిప్రియ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు

- రేషన్ పంపిణీ, సంక్షేమ పథకాలన్నీ దీని ద్వారానే అమలు
- ప్రయోగాత్మకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రేషన్ పంపిణీతో పాటు ఆరోగ్య తదితర సంక్షేమ పథకాలన్నింటినీ ఒకే కార్డు ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకోసం అన్ని కుటుంబాలకు డిజిటల్ కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నది. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తన నివాసంలో వైద్యారోగ్య, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటి కార్డులు ఇచ్చినందున వాటివల్ల కలుగుతున్న లాభనష్టాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. ప్రయోగాత్మకంగా తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణాన్ని, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, వాటితో లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా వీలుకల్పించాలని సూచించారు. దీర్ఘ కాలంలో వైద్యసేవలకు ఉపయోగపడేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పుల కోసం ఈ కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పర్యవేక్షణకు జిల్లాలవారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' డబ్బు ఎప్పుడిస్తరు?

- ఆసరా పింఛన్ 4వేలకు ఎప్పుడు పెంచుతరు?
- ఆ హామీలను చూసే కాంగ్రెస్‌కు ఓట్లేసినం
- ఎమ్మెల్యే మందుల సామేల్‌ను నిలదీసిన మహిళలు

మోత్కూరు, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ పార్టీకి చెందిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఊహించని షాక్ తగిలింది. మోత్కూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీవో కార్యాయంలో సోమవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలన, నియోజకవర్గంలో తన పని తీరు ఎలా ఉన్నదని మహిళలను ప్రశ్నించారు. దీనికి మోత్కూరు పట్టణానికి చెందిన బీసు యాకమ్మతోపాటు పలువురు మహిళలు స్పందిస్తూ.. 'ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, ఆసరా పింఛన్ రూ.4వేలు ఇస్తామంటేనే ఓట్లేసినం. ఇంకెప్పుడిస్తరు?' అని సూటిగా ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న సామేల్ తమది కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమని, అన్నీ సమకూర్చుకొని హామీలన్నీ అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించామని, మోత్కూరుకు మంజూరైన ఆర్టీసీ బస్సు డిపో పనులను ఐదారు నెలల్లో ప్రారంభిస్తామని తెలిపారు. మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కళాశాలలు, తిరుమలగిరిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ వెంకటయ్య, ఎంపీడీఓ నిరంజన్ వలీ పాల్గొన్నారు.



మోత్కూరులో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

నోటరీ స్థలాల్లోని ఇండ్లకు విద్యుత్తు మీటర్లు

- నిబంధనలు సడలించిన విద్యుత్తుశాఖ
- గతంలో రిజిస్టర్డ్ స్థలాలు, నిర్మాణాలకే మీటర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): నోటరీ స్థలాల్లోని నిర్మాణాలకు సైతం కరెంటు మీటర్లు ఇవ్వాలని విద్యుత్తు శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు రిజిస్టర్డ్ స్థలాల్లోని నిర్మాణాలకు మాత్రమే విద్యుత్తుశాఖ అధికారులు కొత్త కనెక్షన్లు జారీ చేస్తున్నారు. నోటరీ స్థలాలు, నిర్మాణాలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేవారు కాదు. ఇది బ్రోకర్ల పాలిట వరంగా మారింది. విద్యుత్తుశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, బ్రోకర్లు కుమ్మక్కయ్యి వేలకు వేలు తీసుకుని అక్రమంగా కనెక్షన్లు జారీచేసేవారు. పట్టణాలు, ఇతర ప్రాంతాల్లోని వినియోగదారులు అనివార్య పరిస్థితుల్లో బ్రోకర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఒక్కో కనెక్షన్‌కు బ్రోకర్లు రూ.పదివేలకుపైగా వసూలు చేసేవారు. ఇది అవినీతికి దారితీస్తున్నదని గుర్తించిన అధికారులు నోటరీ స్థలాల్లోని ఇండ్లకు సైతం విద్యుత్తు కనెక్షన్లు జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో నోటరీ స్థలాల్లోని ఇండ్లకు కొత్త విద్యుత్తు కనెక్షన్లు జారీచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

హాస్టల్ మెస్‌చార్జీలను తక్షణమే పెంచాలి


- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు
- డీఎస్ఎస్ సంక్షేమ భవన్ ఎదుట మహాధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్23(నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన మెస్‌చార్జీలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని, తద్వారా విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కేవీపీఎస్(కులవివక్ష పోరాట సమితి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ సంక్షేమ భవన్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అనేక అరకొర వసతులతో, అదేవిధంగా పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సీఎం, మంత్రుల పిల్లలను ఇలా చదివిస్తారా? అంటూ నాడు ప్రతిపక్షనేతగా మాట్లాడిన నేటి సీఎం రేవంత్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని, వసతులను ఎందుకు మెరుగుపరచడం లేదని నిప్పులు చెరిగారు. విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ.2000 పెంచాలని, 173 హాస్టళ్లకు సంబంధించి అద్దెలు రూ.12కోట్లు బకాయి ఉందని, మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని అల్టిమేటం జారీ చేశారు. ధర్నాలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు హైకోర్టు నోటీసు

మొదటిపేజీ తరువాయి...

వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కాలరాస్తూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ (కిలారి ఆనంద్ పాల్) దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కేఏ పాల్ వ్యక్తిగతంగా హాజరై వాదనలు వినిపిస్తూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వాళ్లపై తక్షణమే అనర్హత వేటువేయాలని కోరారు. ఇదే అంశంపై గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని ధర్మాసనానికి అందజేశారు. ప్రజలు మ్యానిఫెస్టోను చూసి ఓట్లు వేశారని, ఒక పార్టీలో గెలిచి మరోపార్టీలోకి వెళ్లడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు.



వ్యాపారంగా మారిన ఫిరాయింపులు

తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం ఒక వ్యాపారంగా మారిపోయిందని కేఏ పాల్ ధర్మాసనం ముందు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకపోతే ప్రజాతీర్పుకు అర్థం లేకుండాపోతుందన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు జీతభత్యాలు చెల్లించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిగి తీర్పు వెలువడేవరకు ఫిరాయింపు ఎమ్మెల్యేలను శాసనసభలోకి ప్రవేశించకుండా స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చట్టసభలో ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేకుండా చేయాలని కూడా కోరారు. వాళ్ల వేతనాలను కూడా నిలుపుదల చేయాలన్నారు. ఇలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తేనే ఫిరాయింపుదారుల్లో భయం ఉంటుందని, మరొకరు పార్టీ ఫిరాయింపునకు ముందుకురారని సూచించారు. ఐదేండ్లు ముగిసే వరకు ఫిరాయింపునకు పాల్పడిన చట్టసభ సభ్యులపై చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిరాయింపుదారుల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని చెప్పారు. దానం నాగేందర్ ఇతరులపై పార్టీ చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 10 మంది ఎమ్మెల్యేలతోపాటు ఈసీ, ట్రిబ్యునల్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

గిరిజన వర్సిటీలో చేరింది ముగ్గురే

- రెండు కోర్సుల్లో 47 సీట్లు ఖాళీ
- 'సమక్క సారక్క' తొలిబ్యాచ్‌లో అడ్మిషన్లు అంతంతే
- అక్టోబర్ 3న స్పాట్ ద్వారా భర్తీకి షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సమక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీని ప్రారంభించిన తొలి ఏడాది కేవలం ముగ్గురంటే ముగ్గురు విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ వర్సిటీని ములుగు సమీపంలోని జకారంలో తాత్కాలిక క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. హైదరాబద్ సెంట్రల్ వర్సిటీ మెంటార్ యూనివర్సిటీగా సహకారాన్ని అందిస్తున్నది. నాలుగేండ్ల వ్యవధి గల రెండు ఆనర్స్ డిగ్రీకోర్సులను ప్రవేశపెట్టగా, ఆరుగురు కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని నియమించారు. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఇంటర్ పూర్తిచేసిన వారికి బీఏ(ఆనర్స్) ఇంగ్లిష్, బీఏ(ఆనర్స్) ఎకనామిక్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సును 25 సీట్లతో అందుబాటులోకి తీసుకురాగా, కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ యూజీ ద్వారా సీట్లను భర్తీచేశారు. అయితే ఇంగ్లిష్‌లో ఒక్కరు, ఎకనామిక్స్‌లో ఇద్దరు మాత్రమే అడ్మిషన్లు పొందారు. 50 సీట్లకు 47 ఖాళీగా ఉన్నాయి. మిగులు సీట్లను భర్తీచేసేందుకు అధికారులు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల చేశారు. ఆశావాహులు ములుగుకు సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అక్టోబర్ 3న నిర్వహించే స్పాట్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు.


తప్పుడు సమాచారమిచ్చే అధికారులపై క్రిమినల్ చర్యలు

ఘోష్ కమిషన్ కసరత్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టడంతోపాటు వారికి పదోన్నతులు కల్పించవద్దని ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ సిద్ధమవుతున్నది. ఈ కమిషన్ ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధమున్న పలువురు ఇంజినీర్లను ప్రశ్నించింది. తాజాగా మంగళవారం నుంచి శనివారం వరకు మరికొందరు ఇంజినీర్లు, అకౌంటెంట్లతోపాటు దాదాపు 40 మంది అధికారులను విచారించేందుకు నోటీసులను సిద్ధం చేస్తున్నది. తాము అడిగిన అన్ని డాక్యుమెంట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని.. ప్లేస్మెంట్ రిజిస్టర్, మెజర్మెంట్ బుక్ ఇవ్వాలని ఇంజినీర్లను ఇప్పటికే ఆదేశించినట్టు తెలుస్తున్నది. మంగళవారం ఆరుగురు ఇంజనీర్లు హాజరకానున్నారు.

చైనా చక్రబంధంలో భారత్!

శ్రీలంక, మాల్దీవులు, పాక్, బంగ్లా, ఆఫ్ఘనిస్థాన్ మారిషస్, భూటాన్‌లో చైనా అనుకూల సర్కార్లు || విదేశాంగ విధానంలో ప్రధాని మోదీ విఫలం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): డ్రాగన్ దేశం చైనా చక్రబంధంలో భారత్ చిక్కుకుపోయింది. ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో, దౌత్య సంబంధాలను నెరపడంలో విఫలమవ్వడమే దీనికి కారణంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్‌కు పొరుగున ఉన్న దాదాపు అన్ని దేశాలూ చైనాకు అనుకూలంగా మారడం గమనార్హం. శ్రీలంకలో తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనుర కుమార దిసనాయకే మార్క్సిస్ట్ నేత. ఇక, మాల్దీవుల్లో గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత్‌కు వ్యతిరేకిగా పేరుపొందిన మహమ్మద్ ముయిజ్జు గెలిచి అధ్యక్షుడయ్యారు. చైనా నుంచి పెద్దయెత్తున రుణాలు వస్తుండటంతో వీలుచిక్కినప్పుడల్లా భారత్‌పై ఆయన విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సరిహద్దు కయ్యాలతో భారత్‌లో ఉద్రిక్తతలకు కారణమవుతున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో చైనా లోగుట్టు మైత్రి బంధం బహిరంగ రహస్యమే. ఇక, బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఇటీవల ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం, గతంలో చైనాతో సరిహద్దు వివాదాలను ఎదుర్కొన్న భూటాన్‌తో పాటు మారిషస్ కూడా చైనాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వంతో ఇప్పుడు సత్సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతున్నాయి. వెరసి భారత్ చుట్టూరా ఉన్న పొరుగు దేశాలన్నీ ఇండియాను కాదని చైనా స్నేహ హస్తాన్ని కోరుకోవడం 'భారత్‌ను ఒక విధంగా చక్ర బంధంలో బంధించడమే'నని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డ్రాగన్ కుయుక్తులను తిప్పికొట్టడంలో మోదీ ఫెయిలయ్యారని చెప్తున్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 274 మంది మృతి

- 300 లక్ష్యాలపై దాడులు
- 1,000 మందికి గాయాలు

జెరూసలెం: హెజ్బొల్లా ఉగ్రవాదులకు ఇజ్రాయెల్ సైన్యం చుక్కలు చూపిస్తున్నది. 2006 తర్వాత అత్యంత భీకరంగా సోమవారం దాదాపు 300 లక్ష్యాలపై దాడులు జరిపింది. ఇందులో 274 మంది మరణించగా, సుమారు 1,000 మంది గాయపడ్డారు. హెజ్బొల్లాపై గగనతలం నుంచి విరుచుకుపడతామని, ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని దక్షిణ, తూర్పు లెబనాన్ ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. హెజ్బొల్లా ఆయుధాగారాలపై దాడులు చేస్తామని చెప్పింది. దీంతో ప్రజలు లెబనాన్ రాజధాని నగరం బీరుట్ వైపు హుటాహుటిన కార్లు, తదితర వాహనాల్లో పరుగులు తీశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి గత మంగళవారం పేజర్ల పేలుళ్లు జరిగే వరకు ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 600 మంది లెబనాన్ ప్రజలు మరణించారు. వీరిలో 100 మందికిపైగా సాధారణ ప్రజలు. మరిన్ని దాడులు చేయడానికి సైనిక ప్రధాన కార్యాలయం నుంచి ఆమోదం లభించిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. గలీలీలోని ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించామని హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ చర్యలు సమూల నాశనం కోసం యుద్ధంతో సమానమని లెబనాన్ ప్రధాన మంత్రి ఆరోపించారు.

హమాస్ చీఫ్ మృతి?

అక్టోబర్ 7 నాటి దాడుల రూపకర్త, హమాస్ అధినేత యాహ్యా సిన్వార్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ దళాలు అనుమానిస్తున్నాయి. సుదీర్ఘ కాలంగా అతడి కదలికలు లేకపోవటంతో అతడు సజీవంగా ఉండకపోవచ్చునని భావిస్తున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి.



లెబనాన్‌లోని ఓ గ్రామంపై ఇజ్రాయెల్ గగనతల దాడులతో వస్తున్న పొగ

పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ నేరమే!

- వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే
- దేశ అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు
- పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత
- హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): పిల్లల అశ్లీలత, వారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను చూడటం ముమ్మాటికీ నేరమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటంతో పాటు ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, స్టోర్ చేసుకోవడం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరం కిందకే వస్తుందని పేర్కొంది. ఇలాంటి పనులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టేసిన న్యాయస్థానం.. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని వ్యాఖ్యానించింది.

ధర్మాసనం ఏమన్నదంటే?

- పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మార్చాలి. ఈ మేరకు పోక్సో చట్టానికి సవరణలు చేయాలి.
- పై సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దు.
- చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు స్టోర్ చేసిన వారికి తొలిసారిగా రూ. 5వేల వరకు జరిమానా విధించాలి.
- ఇలాంటి చర్యలకు మళ్లీ పాల్పడితే రూ.10 వేల వరకు జరిమానా వేయాలి. పిల్లల అశ్లీల వీడియోలను దురుద్దేశంతో ప్రసారం చేస్తే జరిమానాతో పాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించాలి.
- డబ్బుల కోసం చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహించడం, ఆ వీడియోలను ప్రసారం చేస్తే మూడు నుంచి ఐదేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి. గరిష్ఠంగా ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి.



ఏమిటీ కేసు?

చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏండ్ల ఓ యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. సదరు యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది. పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకొన్నాడంటే, ఆ దురుద్దేశం యువకుడికి ఉందన్నది స్పష్టమవుతున్నదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

లైంగిక విద్యపై అపార్థాలు ఉన్నాయి: సుప్రీంకోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా లైంగిక విద్యపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'తల్లిదండ్రులు, అధ్యాపకులు సహా చాలా మంది శృంగారం గురించి చర్చించడం సరికాదని, అనైతికమని, ఇబ్బందికరమనే సంప్రదాయవాద భావాలు కలిగి ఉన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాశ్చాత్య అంశమని, సంప్రదాయ భారతీయ విలువలకు తగనిదనే భావన ఉంది. ఈ భావనతోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెక్స్ ఎడ్యుకేషన్‌ను నిషేధించాయి. ఈ రకమైన వ్యతిరేకతతో సమగ్ర, సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్ అందకపోవడం వల్ల కౌమార దశలో ఉన్న వారికి తప్పుడు సమాచారం వెళ్తున్నది. వారు ఇంటర్నెట్ వైపు వెళ్లి నియంత్రణ లేని సమాచారం పొందుతున్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే కేవలం జీవపరమైన పునరుత్పత్తి మాత్రమే అనే అపార్థం ఉంది. సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్‌లో అంగీకారం, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం వంటి అంశాలు ఉండాలి. శారీరక హింసను తగ్గించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇవి కీలకం' అని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు.

భారత్‌లో మంకీపాక్స్ తొలి కేసు

కేరళ వ్యక్తికి క్లేడ్-1 రకం వైరస్

న్యూఢిల్లీ: ప్రాణాంతక వైరస్‌గా డబ్ల్యూహెచ్‌వో ఇటీవల ప్రకటించిన మంకీపాక్స్ క్లేడ్-1బీ రకం వైరస్ భారత్‌లో ప్రవేశించింది. కేరళలో మలప్పురం జిల్లాకు చెందిన 38 ఏండ్ల వ్యక్తికి గతవారం ఈ వ్యాధి నిర్ధారణ అయినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ అధికార ప్రతినిధి మనీశ్ వర్మ సోమవారం మీడియాకు తెలిపారు. దుబాయ్ నుంచి వచ్చిన అతడిని గతవారం కేరళ ప్రభుత్వం మంకీపాక్స్ అనుమానిత కేసుగా గుర్తించి, ఐసోలేషన్‌లో ఉంచింది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు వెలుగులోకి రాగా, అవన్నీ క్లేడ్-2 రకానికి చెందినవిగా వైద్య పరీక్షల్లో తేలింది.

ఉల్లి ధరల కట్టడికి నిల్వల విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. ప్రభుత్వం వద్ద ఉన్న 4.7 లక్షల టన్నుల ఉల్లిగడ్డల నిల్వలను ప్రధాన నగరాల్లోని హోల్‌సేల్ మార్కెట్లలో విక్రయిస్తున్నది. దీంతో పాటు దేశవ్యాప్తంగా సబ్సిడీ ద్వారా రూ.35కు కిలో చొప్పున రిటైల్‌లో విక్రయించాలని భావిస్తున్నట్టు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ సహా రాష్ట్ర రాజధానుల్లో సబ్సిడీ ధరకు ఉల్లి విక్రయాలు జరుపుతున్నట్టు చెప్పారు. కాగా, ఉల్లి ఎగుమతులపై సుంకాన్ని ఎత్తేయడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో కిలో ఉల్లిగడ్డల ధర దాదాపు రూ.60కు చేరుకుంది.

రైలు పట్టాలపై ఇనుప రాడ్లు

చండీగఢ్, సెప్టెంబర్ 23: పంజాబ్‌లో లోకో పైలట్ అప్రమత్తతతో తృటిలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. ఆదివారం ఢిల్లీ-భటిండా మార్గంలో భంగి నగర్ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప కడ్డీలను పెట్టారు. అయితే, ఓ గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. పట్టాలపై ఇనుప రాడ్లు ఉన్నట్టు గుర్తించిన అతను సకాలంలో బ్రేకులు వేయటంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల దేశవ్యాప్తంగా రైలు పట్టాలపై వివిధ రకాల వస్తువులు కనిపిస్తుండటం అటు రైల్వే శాఖ, ఇటు ప్రయాణికుల్లో కాస్త ఆందోళన కలిగిస్తున్నది.

మళ్లీ అధికారంలోకి వస్తామన్నది చెప్పలేం!

అథవాలే మాత్రం మంత్రి అవుతారు: గడ్కరీ

నాగ్‌పూర్: తరచూ చమత్కారంగా మాట్లాడే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాగ్‌పూర్‌లో ఆదివారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ''మా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వస్తుందో, రాదో చెప్పలేం కానీ, రామ్‌దాస్ అథవాలే మాత్రం మరోసారి మంత్రి పదవి చేపడతారనే గ్యారంటీ కచ్చితంగా ఉంది'' అన్నారు. కేంద్ర మంత్రి అథవాలే తోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా ఇందుకు చిరునవ్వులు చిందించారు. అనంతరం గడ్కరీ మాట్లాడుతూ, ''జస్ట్ జోక్ చేస్తున్నా'' అన్నారు. అథవాలే నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) కూడా ఎన్డీయేలో భాగస్వామి. ఆయన వరుసగా మూడుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరోసారి గెలిస్తే, మంత్రి పదవిని చేపట్టే పరంపరను కొనసాగిస్తానని చెప్పారు. మహారాష్ట్రలోని అధికార కూటమిలో కూడా ఆర్‌పీఐ (ఏ) భాగస్వామి. 288 స్థానాలున్న మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. రాష్ట్రంలో మహాయుతిలో భాగమైన తమ పార్టీకి 10-12 స్థానాలను ఇవ్వాలని అథవాలే అన్నారు.

దేవుడిని నమ్మితేనే ఒత్తిడిని జయించొచ్చు

- యువ సీఏ మృతిపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు
- ఆమె వ్యాఖ్యలను తప్పుపట్టిన నేతలు, నెటిజన్లు



నిర్మలా సీతారామన్, సెబాస్టియన్

చెన్నై: పని ఒత్తిడిని తాళలేక మరణించిన చార్టెడ్ అకౌంటెంట్(26) అన్నా సెబాస్టియన్ పెరయిల్ మృతిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. పని ఒత్తిడి గురించి మాట్లాడకుండా, దేవుడి కృపతోనే ఒత్తిడిని జయించవచ్చు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై విపక్ష నేతలు, నెటిజన్లు మండిపడుతున్నారు. చెన్నై మెడికల్ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... 'మన పిల్లలు విద్య కోసం కళాశాలలు, యూనివర్సిటీలకు వెళ్లి అద్భుతంగా బయటకు వస్తారు. సీఏ చదివి ఓ సంస్థలో పని చేస్తున్న మహిళ పని ఒత్తిడిని తట్టుకోలేక మరణించినట్టు రెండుమూడు రోజుల క్రితం మాకు వార్త వచ్చింది. మీరు ఏం చదివినా, ఏ ఉద్యోగం చేసినా ఒత్తిడిని తట్టుకునే మనోబలం ఉండాలి. దైవత్వంతోనే దీనిని సాధించవచ్చు. దేవుడిపై విశ్వాసాన్ని ఉంచండి. దీని ద్వారా మీ ఆత్మశక్తి పెరుగుతుంది. ఆత్మశక్తి పెరిగేతే మనోబలం సాధించవచ్చు' అని వ్యాఖ్యానించారు. 'విద్యాసంస్థలు దైవత్వాన్ని, ఆధ్యాత్మికతను తీసుకురావాలి. అప్పుడే మన పిల్లలకు మనోబలం వస్తుంది. ఇదే వారి పురోగతికి, దేశ పురోగతికి ఉపయోగపడుతుంది' అని ఆమె పేర్కొన్నారు.

నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. 'కఠినమైన సీఏ డిగ్రీని చదవడం ద్వారా ఒత్తిడిని ఎదుర్కొనే మనోబలం అన్నాకు ఉంది. ఆమె ప్రాణాలు తీసిన విషపూరితమైన పని సంస్కృతి, అధిక పని గంటల గురించి మాట్లాడాలి. బాధితురాలిని నిందించడం ఆపండి' అంటూ నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల రోజువారీ కష్టాలను నిర్మల అవమానిస్తున్నారని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ విమర్శించారు. అన్నా మరణానికి కారణమైన సమస్యలపై మాట్లాడకుండా దేవుడిని నమ్ముకోండని సలహా ఇవ్వడం వింతగా ఉందని, ఇది కఠినమైనదని పేర్కొన్నారు. నెటిజన్లు సైతం నిర్మల వ్యాఖ్యలను తీవ్రంగా తప్పు పట్టారు.

బాధితురాలిని నిందించలేదు: నిర్మల

తన వ్యాఖ్యలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. బాధితురాలిని నిందించడం తన ఉద్దేశం కాదని ఆమె పేర్కొన్నారు. 'నేను ఎవరి పేర్లూ తీసుకోలేదు. నేను మాట్లాడిన యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల మనోబలం పెంచుకోవడానికి ఇది ఎంత అవసరమనే దాని గురించే నేను మాట్లాడాను' అంటూ ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

హిమాచల్ సర్కార్ అప్పు తీసుకొని సోనియాకు ఇస్తుంది

బీజేపీ ఎంపీ కంగన రనౌత్



సిమ్లా: మండీ బీజేపీ ఎంపీ కంగన రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కులు జిల్లాలోని షాలిన్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ''హిమాచల్‌లో అవినీతి తాండవిస్తున్నదని అందరికీ తెలుసు. కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు తమ రాష్ట్రాలను ఖాళీ చేస్తున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంత సొమ్ము ఎలా ఖర్చు పెడుతుందోనని ఆశ్చర్యం కలుగుతుంది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రభుత్వం రుణాలు తీసుకుని, సోనియా గాంధీకి ఇస్తుంది, అందుకే రాష్ట్రం ఖాళీ అయింది'' అని ఆరోపించారు. ప్రకృతి విపత్తులతోపాటు కాంగ్రెస్ పాలన వల్ల రాష్ట్రం దశాబ్దాల వెనుకకు వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. తాము విపత్తు సహాయక నిధులను ఇస్తే, ఆ నిధులు సీఎం సహాయ నిధికి వెళ్తాయని, అక్కడి నుంచి సోనియా రిలీఫ్ ఫండ్‌కు చేరుతాయని.. ఇది అందరికీ తెలుసునన్నారు.

కెంపన్న నివేదిక ఇవ్వండి!

- సిద్ధరామయ్య సర్కారును కోరిన గవర్నర్ గెహ్లాట్
- మళ్లీ తెర మీదకు అర్కావతి భూముల కుంభకోణం
- రూ.8 వేల కోట్ల స్కామ్: మాజీ సీఎం బొమ్మై

స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): ముడా, వాల్మీకి స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుతాన్ని ఇబ్బందులు వీడట్లేదు. పదేండ్ల కిందటి అర్కావతి లేఅవుట్ భూ కుంభకోణానికి సంబంధించి జస్టిస్ హెచ్‌ఎస్ కెంపన్న కమిషన్ ఇచ్చిన నివేదిక కాపీని ఇవ్వాలంటూ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్‌కు గవర్నర్ కార్యాలయం ఓ లేఖ రాసింది.

ఏమిటీ స్కామ్?

2014లో బెంగళూరు నగరాభివృద్ధిలో భాగంగా అప్పటి సిద్ధరామయ్య సర్కారు భూసేకరణ చేపట్టింది. అయితే, అర్కావతి లేఅవుట్‌లోని దాదాపు 540 ఎకరాలను సేకరించకూడదంటూ సర్కారు డీనోటిఫై చేసింది. అయితే, భూ యజమానులకు లబ్ధి చేకూర్చడానికే ప్రభుత్వం ఇలా చేసిందంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. దీంతో అప్పటి సిద్ధరామయ్య సర్కారు జస్టిస్ కెంపన్న నేతృత్వంలో ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిపై విచారించిన కమిషన్ 2017లో సిద్ధరామయ్య ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే, ఆ నివేదికలోని అంశాలు ఇప్పటివరకూ బయటపెట్టలేదు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి గత నెల గవర్నర్‌కు లేఖ రాశారు. నివేదికలోని అంశాలను బయటపెట్టాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ ప్రభుత్వానికి లేఖ రాశారు.

8 వేల కోట్ల స్కామ్?

అర్కావతి లే అవుట్ భూ కుంభకోణం విలువ రూ. 8 వేల కోట్లని, కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా అప్పటి సిద్ధరామయ్య సర్కారు 868 ఎకరాల భూమిని సేకరించకుండా విడిచిపెట్టిందంటూ 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై శాసనసభలో ఆరోపించారు. ఈ మేరకు కెంపన్న కమిషన్ రిపోర్ట్‌ను ఉదహరించారు.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోల మృతి

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్, అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం సాయంత్రం భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, మావోయిస్టులు సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు భద్రతా దళాలు నారాయణ్‌పూర్ జిల్లాలోని అడవుల్లో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. అప్పటికే మాటువేసిన మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగడంతో, మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అడవిలోకి పారిపోయారు.

వక్ఫ్ బిల్లుపై 1.2 కోట్ల స్పందనలు

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానెల్‌కు కుప్పలు తెప్పలుగా ప్రతిస్పందనలు వచ్చిపడ్డాయి. బీజేపీ నేత జగదాంబికాపాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ ప్యానెల్ ఏకంగా 1.2 కోట్ల ఈ-మెయిల్స్ అందుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుపై సలహాలు తెలియజేయాలంటూ కమిటీ గత నెలలో కోరింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ తమ ప్రతిస్పందనలు పంపాలంటూ ప్రముఖ ఇస్లామిక్ బోధకుడు జకీర్‌నాయక్ తన మద్దతుదారులను కోరారు. బిల్లుకు అనుకూలంగా తమ స్పందనలు పంపాలని పలు హిందూ సంఘాలు కోరడంతో ఇబ్బడిముబ్బడిగా ఈ-మెయిల్స్ వచ్చిపడ్డాయి.

హంతకుడిని పట్టించిన ఉమ్మి

36 ఏండ్ల తర్వాత నిందితుడి అరెస్టు

బోస్టన్: అమెరికాలో 36 ఏండ్ల క్రితం జరిగిన కారెన్ టేలర్ అనే మహిళ హత్య కేసును దర్యాప్తు అధికారులు ఎట్టకేలకు ఇప్పుడు ఛేదించారు. 1988 మే 27న బోస్టన్‌లోని రాక్స్‌బరీ నైబర్‌హుడ్ అపార్ట్‌మెంట్‌లో జేమ్స్ హోలోమన్ అనే వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్టు డీఎన్‌ఏ సాక్ష్యాధారాల ఆధారంగా తేల్చారు. వాస్తవానికి అప్పట్లో టేలర్ మృతదేహం వద్ద హోలోమన్‌కు సంబంధించిన ఓ చెక్కును దర్యాప్తు అధికారులు గుర్తించినప్పటికీ కచ్చితమైన నిర్ధారణకు రాలేకపోయారు. కానీ, నిరుడు ఓ కాలిబాటపై హోలోమన్ వేసిన ఉమ్మి నుంచి అతని డీఎన్‌ఏను సేకరించి పరీక్షించగా హత్యకు ఆతడే పాల్పడ్డాడని తేలింది.

కేజ్రీ కోసం కుర్చీ ఖాళీగా!



సోమవారం ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ, కేజ్రీవాల్ వాడిన కుర్చీని కాకుండా మరో కుర్చీ వేసుకొని విధులు నిర్వర్తించారు. రామాయణంలో భరతుడిలా నాలుగు నెలలపాటు ఢిల్లీకి సీఎంగా ఉంటానని ఆమె అన్నారు. అయితే ఆతిశీ వేరే కుర్చీలో కూర్చొని రాజ్యాంగాన్ని, సీఎం స్థాయిని అవమానపర్చారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

లౌకికవాదం మన దేశానికి అక్కర్లేదు

తమిళ నాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి



చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి అతి పెద్ద వివాదానికి తెర తీశారు. కన్యాకుమారిలో ఈ నెల 22న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ''ఈ దేశ ప్రజలకు వ్యతిరేకంగా అనేక మోసాలు జరిగాయి. వాటిలో ఒకటి లౌకికవాదం గురించి తప్పుడు వివరణ ఇవ్వడం. లౌకికవాదం అంటే ఏమిటి? లౌకికవాదం అనేది యూరోపియన్ భావన. అది భారతీయ భావన కాదు'' అని చెప్పారు. యూరోప్‌లో చర్చ్, రాజు మధ్య సంఘర్షణ కారణంగా లౌకికవాదం అనే భావన ఉత్పన్నమైందన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని రాసేటపుడు లౌకికవాదంపై చర్చను ఒకరు ప్రతిపాదించారని తెలిపారు. అప్పుడు, యావత్తు రాజ్యాంగ సభ స్పందిస్తూ, ''మన దేశంలో లౌకికవాదమా? ఏదైనా సంఘర్షణ ఉందా? ధర్మం నుంచి భారత్ ఆవిర్భవించింది. ధర్మంలో సంఘర్షణ ఎలా ఉంటుంది?'' అని ప్రశ్నించిందని గుర్తు చేశారు. లౌకికవాదం అనేది యూరోపియన్ కాన్సెప్ట్ అని, అది అక్కడే ఉండాలని అన్నారు. మన దేశంలో లౌకికవాదం అవసరం లేదని స్పష్టం చేశారు. 1976లో మన రాజ్యాంగ ప్రవేశికలో 'లౌకికవాదం'ను ప్రవేశపెట్టిన అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని రవి తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం 25 ఏండ్ల తర్వాత, దేశంలో అత్యవసర పరిస్థితి సమయంలో, అభద్రతాభావం నిండిన ప్రధాన మంత్రి కొన్ని వర్గాల వారిని మచ్చిక చేసుకోవడం కోసం రాజ్యాంగంలో లౌకికవాదాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు.

యాంటీ బయోటిక్స్ పనిచేయని పరిస్థితి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: మనం ఏదైనా వ్యాధి బారినపడ్డా, శరీరం లోపలి అవయవాలకు ఇన్‌ఫెక్షన్లు సోకినా.. వాటి నుంచి మనల్ని కాపేడేవి 'యాంటీ బయోటిక్స్'. అయితే, వీటి అతి వాడకంతో.. సమయానికి ఔషధాలు పనిచేయని పరిస్థితి నెలకొన్నదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజా నివేదిక వెల్లడించింది. యాంటీ బయోటిక్స్ దుర్వినియోగం వ్యాధి కారక క్రిముల సామర్థ్యాన్ని పెంచిందని, ఈ నేపథ్యంలో మూత్రనాళాలు, రక్తనాళాల ఇన్‌ఫెక్షన్స్, టైఫాయిడ్, న్యుమోనియా వ్యాధులు సాధారణ యాంటీ బయోటిక్స్‌కు లొంగటం లేదని తెలిపింది. ఔషధాల్ని తట్టుకునే శక్తి వ్యాధి కారక క్రిముల్లో ఏర్పడిందన్న సంగతి నివేదిక పేర్కొన్నది. ఈ వ్యాధులను నయం చేయటం ముందు ముందు సవాల్‌గా మారుతుందని నివేదిక అభిప్రాయపడింది. దేశంలో యాంటీ బయోటిక్స్ నిరోధకతకు సంబంధించి ఐసీఎంఆర్ నుండి వెలువడిన 7వ నివేదిక.



నీలగిరి పర్వతశ్రేణుల్లో ప్రయాణిస్తున్న రైలు

అందమైన ఆరు రైలు ప్రయాణాలివే!

'ఎక్స్'లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశంలో అత్యంత అందమైన రైలు ప్రయాణాల్లో కొన్నింటి జాబితాను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్'లో పంచుకున్నారు. ఆరు ప్రయాణాలను ఈ జాబితాలో పేర్కొన్న ఆయన.. మొదటి స్థానంలో గుజరాత్‌లోని కచ్‌లో తెల్లటి ఇసుక ఎడారి మీదుగా సాగే రైలు ప్రయాణానికి చోటు కల్పించారు. తర్వాత యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన నీలగిరి మౌంటైన్ రైల్వే, జమ్ము కశ్మీర్‌లో బనిహాల్ నుంచి బద్గాం వరకు జరిగే ప్రయాణం, గోవా దూద్‌సాగర్ జలపాతం మీదుగా వెళ్లే రైలు, కేరళలోని కప్పిల్‌లో కొబ్బరి తోటల నుంచి సాగే రైలు ప్రయాణం, హిమాచల్‌ప్రదేశ్‌లో కల్కా నుంచి సిమ్లా వరకు ఉన్న టాయ్ ట్రెయిన్ గురించి ఆయన పోస్ట్ చేశారు.





హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షల విరాళం చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి. దీంతోపాటు 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్లాంటేషన్ డ్రైవ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఈ ఏడాది 18 లక్షల మొక్కలను నాటనున్నారు.

బీడీఎల్ టెక్నికల్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) డైరెక్టర్ (టెక్నికల్)గా డీవీ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రక్షణ రంగంలో 3 దశాబ్దాలకుపైగా అనుభవం ఉంది. అంతకుముందు ఆయన బీడీఎల్‌లో అర్‌అండ్‌డీ జీఎంగా పనిచేశారు. బీడీఎల్‌లో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని స్థాపించడంలో శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారు. కాకతీయ వర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్, జేఎన్‌టీయూ నుంచి డిజిటల్ సిస్టమ్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశారు. తదనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చేశారు.

ఆభరణాల ఎగుమతులు డౌన్

ముంబై, సెప్టెంబర్ 23: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోవడంతో గత నెలకుగాను 2.01 బిలియన్ డాలర్ల విలువైన జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతి అయ్యాయని రత్నాల అభరణాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఎగుమతైన 2.47 బిలియన్ డాలర్లతో పోలిస్తే 18.79 శాతం తగ్గినట్లు పేర్కొంది.

బాబ్బాబు కొనండయ్యా..

హిందుస్థాన్ జింక్ వాటా విక్రయానికి దేశ, విదేశాల్లో రోడ్‌షోలు చేస్తున్న మోదీ సర్కారు



- 1966లో ఏర్పాటైన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్.. జింక్, లెడ్, వెండి, కాడ్మియంలను ఉత్పత్తి చేస్తున్నది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ దీని ప్రధాన కేంద్రం.
- హిందుస్థాన్ జింక్.. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ జింక్ ఉత్పత్తిదారు. వెండి ఉత్పత్తిలోనూ మూడో స్థానంలో ఉన్నది.
- ప్రధానంగా దేశీయ జింక్ మార్కెట్‌లో 75 శాతానికిపైగా వాటా ఈ సంస్థదే. 40కిపైగా దేశాలకూ ఈ కంపెనీ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఒక్కో షేర్‌కు రూ.19 చొప్పున మొత్తం రూ.8,028.11 కోట్ల మధ్యంతర డివిడెండ్‌కు వేదాంత గ్రూప్ అనుమతిచ్చింది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'భలే మంచి చౌక బేరము.. ఇది సమయము మించినన్ దొరకదు త్వరంగొనుడు సుజనులారా' అన్నట్టు ప్రభుత్వ రంగ సంస్థల విక్రయానికి, ప్రైవేట్ రంగ కంపెనీల్లో మిగులు వాటాల అమ్మకానికి దేశ, విదేశాల్లో మోదీ సర్కారు చక్కర్లు కొడుతున్నది. ఒకప్పుడు సర్కారీ సంస్థగా, ఇప్పుడు వేదాంత గ్రూప్ కంపెనీగా ఉన్న హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌లో కేంద్ర ప్రభుత్వానికి 29.5 శాతం వాటా ఉన్నది. దీన్ని అమ్ముకొనేందుకు గత 15 రోజుల్లో ముంబై, లండన్, బోస్టన్, న్యూయార్క్ వంటి ప్రముఖ నగరాల్లో కేంద్రం రోడ్‌షోలు నిర్వహించింది.

మదుపరుల కోసమే..

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగానే ఈ రోడ్‌షోలు చేపడుతున్నామని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అన్నారు. ఇన్వెస్టర్లను ఆకట్టుకొనేందుకు, మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకూ ఇవి ఉపయోగపడుతాయని చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఫైనాన్షియల్ హబ్స్‌గా ఉన్న ముంబై, సింగపూర్, హాంకాంగ్, లండన్, బోస్టన్, న్యూయార్క్‌ల్లో ఇప్పటిదాకా రోడ్‌షోలు నిర్వహించామని యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్ అండ్ జియోపార్క్స్ ఇన్ ఇండియాపై జరిగిన శిక్షణ-వర్క్‌షాప్ కార్యక్రమానికి హాజరైన ఆయన తెలిపారు. అయితే ఎప్పట్లోగా, ఎంత? వాటాను అమ్ముతారన్న ప్రశ్నకు బదులిస్తూ.. 'ముందు ఈ రోడ్‌షోలు పూర్తవనివ్వండి.. ఆ తర్వాత ఓ నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. ఇందుకోసం ఓ కమిటీ ఉందని కూడా చెప్పారు.

లాభాల్లో ఉన్నా..

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణే లక్ష్యంగా ముందుకెళ్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు.. లాభనష్టాలతో సంబంధం లేకుండా అన్నింటినీ అమ్మేయాలనే చూస్తున్నది. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హిందుస్థాన్ జింక్ నికర లాభం గతంతో పోల్చితే 19.4 శాతం పెరిగింది. రూ.2,345 కోట్లుగా ఉన్నది. ఆదాయం కూడా రూ.7,564 కోట్ల నుంచి రూ.8,398 కోట్లకు పెరిగింది. అయినప్పటికీ మిగులు వాటాలను వదిలించుకోవడానికే పెద్దపీట వేస్తుండటం గమనార్హం. ఇక గతంలో ప్రతిపాదించిన మూడు వర్టికల్స్‌కు బదులుగా రెండు వర్టికల్స్‌లోకే కంపెనీని విభజించాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వంతో తాజాగా చర్చలు జరిపినట్టు సంస్థ సీఈవో అరుణ్ మిశ్రా తెలిపారు. హిందుస్థాన్ జింక్‌ను వేర్వేరు సంస్థలుగా విభజించాలన్న పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆపేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా సంప్రదింపులు సానుకూలంగా జరిగినట్టు మిశ్రా చెప్తున్నారు. సంస్థలో మెజారిటీ వాటా వేదాంతదే అయినప్పటికీ వ్యాపార కార్యకలాపాల పునర్నిర్మాణానికి తమ ఆమోదం ఉండాలంటూ గనుల మంత్రిత్వ శాఖ హుకుం జారీ చేసింది. అందుకే కేంద్రంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. కాగా, హిందుస్థాన్ జింక్‌లో మిగులు వాటాను ఓపెన్ మార్కెట్‌లో ఉపసంహరించుకోవచ్చని 2021లో సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. దీంతో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా వాటాల అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు కేంద్రం గతంలోనే ప్రకటించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు అడుగులు వేస్తున్నది.

జియో సరికొత్త ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 98 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ 5జీ డాటా, కాలింగ్‌తో కూడిన రూ.999 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. దీర్ఘకాలికంగా డాటా, కాలింగ్‌ను కోరుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని ఈ నయా ప్లాన్‌ను తీసుకొచ్చింది సంస్థ. ఈ ప్లాన్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లు వర్తించనున్నది. దీంతోపాటు రోజుకు 100 ఎస్ఎంఎస్, దేశవ్యాప్తంగా రోమింగ్ ఫ్రీ, జియో క్లౌడ్, జియో సినిమా, జియో టీవీలను ఉచితంగా అందిస్తున్నది.

హైదరాబాద్‌లో ఆస్టర్ నూతన దవాఖాన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్..హైదరాబాద్‌లో మరో దవాఖానని నెలకొల్పడానికి సిద్ధమైంది. ఇప్పటికే అమీర్‌పేట్‌లో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్న సంస్థ తాజాగా ఇక్కడే రూ.220 కోట్లతో నూతన ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. 300 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆసుపత్రిలో అన్ని వయసుల పిల్లలు, మహిళలకు హెల్త్‌కేర్ సేవలు అందించనున్నట్లు తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఈ ఆసుపత్రి అందుబాటులోకి రానున్నట్లు ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఫౌండర్, చైర్మన్ ఆజాద్ మూపెన్ తెలిపారు.

85 వేల దిశగా సెన్సెక్స్

మరో 384 పాయింట్లు పెరిగిన సూచీ



ముంబై, సెప్టెంబర్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను భవిష్యత్తులోనూ తగ్గించే అవకాశాలుండటం, ఆసియా మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సెన్సెక్స్ మరో మైలురాయి 85 వేల స్థాయికి చేరువైంది. ఎనర్జీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు గ్లోబల్ మార్కెట్లు లాభాల్లో ముగియడం కలిసొచ్చింది. ఇంట్రాడేలో 85 వేల చేరవకు 84,980 వద్దకు చేరుకున్న 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 384.30 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 84,928.61 స్థాయి వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. మరో సూచీ నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26 వేలకు చేరువైంది. చివరకు 148.10 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 25,939.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఫెడ్ వడ్డీరేట్లను మరోసారి తగ్గించే అవకాశాలుండటం సూచీలకు దన్నుగా నిలిచాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ గెయినర్‌గా మహీంద్రా

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా షేరు టాప్ గెయినర్‌గా నిలిచింది. కంపెనీ షేరు ధర 3.29 శాతం ఎగబాకింది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ కూడా 2.55 శాతం ఎగబాకగా, భారతీ ఎయిర్‌టెల్ 2.25 శాతం, కొటక్ బ్యాంక్ 1.71 శాతం లాభపడ్డాయి. వీటితోపాటు బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్ లాభపడంతో సూచీలు రికార్డు స్థాయికి చేరువవడానికి దోహదపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ అత్యధికంగా 2.23 శాతం లాభపడగా, రియల్టీ 2.07 శాతం, టెలికం, ఎనర్జీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్, యుటిలిటీ రంగ షేర్లు లాభాల్లో ముగియగా..కేవలం ఐటీ రంగ షేర్లు నష్టపోయాయి.

మూడు రోజుల్లో 8.30 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పుంజుకుంటుండటంతో గత 3 రోజుల్లో మదుపరుల సంపద రూ.8 లక్షల కోట్లకు పైగా పెరిగింది. దీంతో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,76,03,923.17 కోట్లకు చేరింది.

రూ.1.8 లక్షల కోట్ల నష్టం

గత 3 ఏండ్లలో ఎఫ్‌అండ్‌వోల్లో కోటికిపైగా ట్రేడర్లకు దెబ్బ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'హై-రిస్క్ హై-రివార్డ్' గేమ్‌గా పేరున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో నష్టపుటేరులు పారుతున్నాయి. 2021-22 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో ఎఫ్‌అండ్‌వో సెగ్మెంట్‌లో 1.13 కోట్ల రిటైల్ ట్రేడర్లు రూ.1.81 లక్షల కోట్లు కోల్పోయారు మరి. ఈ మూడేండ్లలో ఒక్కో ఇండివీడ్యువల్ ట్రేడర్‌కు సగటున దాదాపు రూ.2 లక్షల (లావాదేవీ ఖర్చులతోసహా) నష్టం వాటిల్లింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) విషయానికే వస్తే.. 73 లక్షల మందికి సగటున రూ.1.2 లక్షల లాస్ వచ్చింది. ఇదంతా కలిపితే రూ.75,000 కోట్లుగా ఉన్నది. ఈ మేరకు సోమవారం మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ విడుదల చేసిన ఓ అధ్యయనం తెలిపింది. కాగా, ఈ సెగ్మెంట్‌లో కేవలం 7.2 శాతం మందే లాభపడ్డారు. ఒక్కో మదుపరి సగటు లాభం రూ.3 లక్షలుగా ఉన్నది. ఎఫ్‌అండ్‌వో కాంట్రాక్టుల్లో రిటైల్ ఇన్వెస్టర్లు చురుగ్గా పాల్గొంటుండటంపట్ల సెబీ తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

అన్మోల్ అంబానీపై కోటి జరిమానా

అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీపై సెబీ కోటి రూపాయల జరిమానా వేసింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ కేసులో కార్పొరేట్ రుణాలను ఆమోదించేటప్పుడు అశ్రద్ధ వహించారని, నిబంధనల్ని పాటించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఫైన్ విధించింది. అలాగే రిలయన్స్ హౌజింగ్ ఫైనాన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ కృష్ణన్ గోపాలకృష్ణన్‌పైనా రూ.15 లక్షల జరిమానా వేస్తూ సెబీ నిర్ణయం తీసుకున్నది. ఈ ఇరువురు 45 రోజుల్లోగా ఈ జరిమానాలను చెల్లించాలని కూడా ఆదేశించింది. గత నెల అనిల్‌పైనా రూ.25 కోట్ల జరిమానా పడ్డది తెలిసిందే. కాగా, బ్రైట్‌కామ్ గ్రూప్‌పై సెబీ రూ. 8 లక్షల జరిమానా విధించింది.

మాజీ ఐజీ శంకర్‌రావు మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): విశ్రాంత ఐపీఎస్ అధికారి బొమ్మకంటి శంకర్‌రావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐజీ స్థాయిలో పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. 80 ఏండ్లపాటు తన జీవితాన్ని ఉత్సాహంగా గడిపిన ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడువడంతో పలువురు ప్రముఖులు, సీనియర్ ఐపీఎస్ అధికారులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

నెయ్యి సరఫరాదారుకు షాక్

నోటీసులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

- 4 కంపెనీల నమూనాల సేకరణ
- ఒక కంపెనీ నెయ్యిలో కల్తీ గుర్తింపు
- కల్తీకి చంద్రబాబుదే బాధ్యత: మాజీ మంత్రి శ్రీకాంత్‌రెడ్డి
- తప్పు జరిగితే సర్వనాశనమవుతాం: భూమన ప్రమాణం
- సుప్రీంలో వైవీ సుబ్బారెడ్డి పిటిషన్
- లడ్డూపై అనుమానాలొద్దు : టీటీడీ



హైదరాబాద్/ఖైరతాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ కంపెనీకి కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. టీటీడీకి నెయ్యిని సరఫరా చేసిన నాలుగు కంపెనీల నమూనాలు వచ్చాయని, వీటిలో ఓ కంపెనీ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీని గుర్తించినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే చెప్పారు. తిరుపతి లడ్డు ప్రసాదం అంశాన్ని రాజకీయంగా వాడుకునే అధ్వానస్థితిలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఉన్నారని వైఎస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూలైలో వచ్చిన నివేదికను చంద్రబాబు సెప్టెంబర్‌లో తన పార్టీ కార్యాలయంలో పెట్టి వివాదాన్ని రాజేశారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాకే నెయ్యి పంపిణీ జరిగిందని, దానికి బాధ్యత చంద్రబాబే వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు తిరుమల లడ్డూ విషయంలో తప్పు జరిగి ఉంటే సర్వనాశనం అయిపోతామని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సోమవారం తిరుమలలో ప్రమాణం చేశారు. తిరుమల లడ్డు వివాదంపై సుప్రీంకోర్టులో టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. మరోవైపు తిరుపతి లడ్డూ విషయంలో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశించాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

లడ్డూపై అనుమానాలొద్దు: టీటీడీ

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రాయశ్చిత్త కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సంప్రోక్షణ చర్యల్లో భాగంగా దోష నివారణ ఆలయ యాగశాలలో శాంతి హోమం, లడ్డూపోటు, విక్రయశాలలో పూర్ణాహుతి నిర్వహించినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం వెల్లడించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయని, భక్తులెవరూ ఆందోళన చెందవద్దని ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. పవిత్రోత్సవాలకు ముందే నెయ్యి మార్చేశామని, లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలొద్దని చెప్పారు.

పౌర సేవకులు సమాజ గేమ్ చేంజర్స్

- రక్షణ శాఖ ఏడీ వివేకానంద
- రాష్ట్ర, కేంద్ర పబ్లిక్ సర్వీస్ పరీక్ష సాధనపై అవగాహన సదస్సు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఏడీ వివేకానంద

మేడ్చల్, సెప్టెంబరు 23: పౌర సేవకులు సమాజ గేమ్ చేంజర్స్ అని రక్షణ మంత్రిత్వ శాఖ ఏడీ వివేకానంద పేర్కొన్నారు. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర, కేంద్ర పబ్లిక్ సర్వీస్ పరీక్ష సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సర్వీసెస్‌లోకి రావడం అంటే ఒక్క ఉద్యోగ భద్రతనే కాదు సమాజ హితం కోసం మార్పు కూడా తీసుకురావచ్చని తెలిపారు. రెఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ రమణ ముప్పాల మాట్లాడుతూ.. యూపీఎస్సీ ప్రకటన ప్రతి ఏడాది వస్తుందని, ఒక్క అభ్యర్థి ఆరుసార్లు పరీక్షకు హాజరు కావచ్చని వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులతో విద్యార్థులు వ్యక్తిగతంగా, వృత్తి పరంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ మేనేజర్ గణేశ్, అసిస్టెంట్ మేనేజర్ కేఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

హీరో మహేశ్‌బాబు రూ. 50 లక్షల విరాళం



హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): వరద బాధితుల సహాయార్థం హీరో మహేశ్ బాబు- నమ్రత శిరోద్కర్ దంపతులు రూ. 50 లక్షల విరాళమిచ్చారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి చెక్కు అందించారు. ఈ సందర్భంగా సీఎం మహేశ్‌బాబును అభినందించారు.

పాలనలో సివిల్ సర్వెంట్లు కీలకం

- హెచ్‌ఆర్‌డీ డీజీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్
- హెచ్‌ఆర్‌డీ ఫౌండేషన్ కోర్సు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ పాలనలో సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకమని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయల్ పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సివిల్ సర్వెంట్ల కోసం రూపొందించిన ఫౌండేషన్ కోర్సును ప్రారంభించి మాట్లాడారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చెయిన్, బిగ్‌డేటా లాంటి ఆధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకొని మెరుగైన సేవలందించాలని సూచించారు. హెచ్‌ఆర్డీ రూపొందించిన ఫౌండేషన్ కోర్సు పాలనా తీరు మెరుగు పరుచుకోవడం, టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. డాక్టర్ మాధవి రావుల పాటి కోర్సులోని అంశాలను వివరించారు. ఐఆర్ఎస్ అధికారి, ఎల్‌బీఎస్ఎన్ఏఏ అసిస్టెంట్ డైరెక్టర్ ఆకాంక్ష కులశ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు ఇంటర్‌పోల్ చర్యలు

- ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెల్లడి
- ఫోన్ల ట్యాపింగ్ కేసులో మెమో దాఖలు



నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతోపాటు మరో నిందితుడు, ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసేందుకు ఇంటర్‌పోల్ చర్యలు చేపట్టినట్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి వెల్లడించారు. నిందితుల అరెస్టు కోసం జారీ అయిన వారెంట్ పత్రాలను సీబీఐ ద్వారా ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు పంపామని, వారిని త్వరలో అరెస్టు చేసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. అరెస్టు వారెంట్ల అమలులో జరుగుతున్న జాప్యంపై సోమవారం నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన మెమో లో ఆయన ఈ విషయాలను స్పష్టం చేశా రు. కాగా, ఈ కేసులో రిమాండ్ ఖైదీలుగా కొనసాగుతున్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్ రావును సోమవారం జైలు అధికారులు 12వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడైన అదనపు ఎస్పీ భుజంగరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీంతో భుజంగరావు గైర్హాజరు పిటిషన్, హెల్త్ రిపోర్టులను ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. భుజంగరావు బెయిల్ గడువు ఈ నెల 30తో ముగియనుండటంతో అక్టోబర్ 1న ఆయన కోర్టులో హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు.

• సూర్యాపేట జిల్లా కేంద్రంలో..



డబుల్ బెడ్‌రూం ప్లాట్లు అలాట్‌మెంట్ చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యమని డబుల్ బెడ్రూం లబ్ధిదారులు సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారుల కమిటీ అధ్యక్షుడు షేక్ నయీమ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులైన 804మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తూ పట్టాలిచ్చి పది నెలలు గడుస్తున్నదని, అధికారులు నేటికీ తమకు అలాట్‌మెంట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ధర్నా చేస్తున్నవారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో కూడా డబుల్ బెడ్రూం లబ్ధిదారులు నిరసన చేపట్టారు.

• సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో..



రుణమాఫీ కోసం రైతుల ధర్నా

పంట రుణమాఫీ చేయాలని సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ రైతులు కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రూ.2 లక్షలపైన ఉన్న రైతుకు రుణమాఫీ కాలేదని, రైతుభరోసా రాలేదని ఆవేదన వ్యక్తంచేస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో రైతులు పంట పొలాల్లో పట్టా పాస్ పుస్తాకాలు పట్టుకుని సెల్ఫీ తీస్తూ ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు.

బోనస్‌లో కోతపై భగ్గుమన్న సింగరేణి

గనులపై కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో టీబీజీకేఎస్ నిరసన

న్యాయం చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిక.. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాల, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సింగరేణి లాభాల వాటాలో కోత విధించిన కాంగ్రెస్ సర్కారుపై టీబీజీకేఎస్, కార్మిక లోకం కన్నెర్ర చేసింది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం నల్లనేలపై నిరసనలతో హోరెత్తించింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లపై టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి,



కరీంనగర్‌లోని ఆర్జీ-1లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తాండూర్‌లోని ఏరియా స్టోర్స్ వద్ద టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్ నేతృత్వంలో నిరసన తెలిపారు. మందమర్రి, కాసిపేట 1వ గని, కాసిపేట-2 ఇంక్లైన్‌పై, బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గని, ఖైర్‌గూడ ఓసీపీలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, ఏరియా ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా సింగరేణి ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించారు. ఆర్జీ-1లోని జీడీకే 1, 2, 2ఏ, 1 సీఎస్పీ, 11గని, ఓసీపీ 5, సివిల్ డిపార్టుమెంట్, వర్క్ షాప్, రీజినల్ అనలైటికల్ ల్యాబ్, జీఎం కార్యాలయం, ఆర్జీ-2 పరిధిలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై, ఆర్జీ-3 పరిధిలోని



కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఓసీపీ-1, సైటాఫీసు, ఓసీపీ-1 బేస్ వర్క్ షాపు, ప్రాజెక్టు కార్యాలయాల్లో టీబీజీకేఎస్ ఆర్జీ-1, 2, 3 ఏరియాల ఉపాధ్యక్షులు వడ్డెపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే-1, కేటీకే-5, కేటీకే-6 ఇంక్లైన్లు, ఓసీ గనులపై నల్ల బ్యాడ్జీలతో కార్మికులు నిరసన చేపట్టారు. ఫిట్ సెక్రటరీలు సురేశ్, నరేశ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రవితేజ, కార్మికులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే కవ్వంపల్లిని నిలదీసిన రైతులు



తమకు రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రైతులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీశారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశానికి హాజరై, బయటకు వస్తుండగా కన్నాపూర్, తదితర గ్రామాల రైతులు ఆయనను చుట్టుముట్టారు.

• న్యాయం చేస్తారా.. చావమంటారా..?



'నా భూమిని వేరే వాళ్లకు పట్టా చేసిన్రు. తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇకనైనా న్యాయం చేయండి. లేదంటే ఇక్కడే పురుగుల మందు తాగి చస్తాం' అంటూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన మండవ్‌గడే పత్రు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగాడు. ఈ సందర్భంగా పత్రు మాట్లాడుతూ గుండాయిపేట శివారులో సర్వే నంబర్ 167/28లో 5 ఎకరాల భూమి ఉందని, గతేడాది దానిని ఎల్ములే బావువ్‌రావు పేరిట పట్టా చేశారని ఆరోపించాడు. తహసీల్దార్ పుష్పలత వచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

• లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి



కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, కార్మిక సంఘాల జేఏసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న అధ్యక్షతన కొత్తగూడెం సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు.

• 306 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లా?



306 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులే ఉంటే బోధన ఎలా సాగుతుందంటూ జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద ప్రాథమిక పాఠశాలకు సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గతంలో ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేసేవారన్నారు. బదిలీల్లో నలుగురు వెళ్లిపోగా.. ఇద్దరు మాత్రమే మిగిలారన్నారు. ఎంఈవో నరసింహులు దసరా తర్వాత విద్యావలంటీర్లను నియమించి బోధన కొనసాగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాషా సంఘీభావం తెలిపారు.

• నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సోమవారం దాదాపూర్ యువకులు నిరసన వ్యక్తం చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని తెలిసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు ఎందుకు ఉత్సాహాన్ని చూపతున్నారని మండిపడ్డారు. మాజీ సర్పంచ్ కృష్ణ, గురుచరణ్ దాస్, ఈశ్వర్, ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీనివాస్, చెన్నయ్య, వెంగల్‌రావు, శివ, ఎండీ అబ్బు, నరేశ్, యశ్వంత్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

• సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకోం



రామగుండం థర్మల్ ప్లాంటులో సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ) ప్రధాన గేటు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

• అర్హులైన వారికే రేషన్‌షాపులు కేటాయించాలి



అర్హు లైన వారికే రేషన్ షాపులు కేటాయించాలని సోమవారం జిల్లాలోని రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మెరిట్ లిస్ట్ జాబితా విడుదల చేయకుండానే కొందరిని ఇంటర్వ్యూలకు పిలుస్తోందన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

• వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల ధర్నా



పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా బిచ్కుందలో జీపీ కార్మికులు సోమవారం బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. సీఐటీయూ నేత సురేశ్ గొండ మాట్లాడుతూ పది నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కార్మికులు కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు.

• సీఎం నియోజకవర్గంలో విద్యార్థులకు పురుగుల అన్నమా?



సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గిలో విద్యార్థులకు వండుతున్న పురుగుల బియ్యాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

• పింఛన్ల కోసం రోడెక్కిన వృద్ధులు



రెండు నెలలుగా పింఛన్లు రావడం లేదంటూ వనపర్తి జిల్లా ఆత్మకూరులో సోమవారం వృద్ధులు, ఒంటరి మహిళలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా పింఛన్ రాకపోతే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



సచివాలయం, అమరజ్యోతి వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌ల సంఘం నాయకులు

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- నెలాఖరులోగా స్పష్టం చేయాలి
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తాం
- సర్పంచ్‌ల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్యగౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సర్పంచులకు అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టి పది నెలలైనా ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరజ్యోతి వద్ద తెలంగాణ సర్పంచ్‌ల సంఘం నాయకులు నివాళులర్పించారు. అనంతరం అక్కడే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా వారు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక మంది సర్పంచులు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నా సర్కారు కరుణించకపోవడం బాధాకరమని వాపోయారు. ఇప్పటికైనా బిల్లుల చెల్లింపుపై ఈ నెల 30లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. తాము సొంత నిధులతో పనులు చేపట్టామని, ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని ఆశిస్తే ఇప్పటి వరకు రాలేదని, గ్రామాల అభివృద్ధి కోసం తాము ప్రయత్నిస్తే ప్రభుత్వం ఇలా చేయడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగయ్య, రాష్ట్ర నాయకులు కేసబోయిన మల్లయ్య, మేడబోయిన గణేశ్, నవీన్‌గౌడ్, సుముద్రాల రమేశ్, ఎర్రగోగుల యశ్వంత్, బీరప్ప, పచ్చబోయిన రామకృష్ణ, మహిళా నేతలు చిన్నం లావణ్య, రెక్కల ఇంద్రాసత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఫార్మాసిటీ మేడిపల్లిలోనే

మొదటిపేజీ తరువాయి...

పథకాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వాటిపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, పిటిషనర్లు కూడా అదనపు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తమ భూమిపై నిషేధిత ఉత్తర్వులు తొలగించాలని, ధరణి పోర్టల్లో లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ పలువురు రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫార్మాసిటీ ఏర్పాటు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. మార్కెట్ ధరకు అనుగుణంగా భూములకు పరిహారం చెల్లింపుపై రైతులతో చర్చలు జరుగుతున్నట్టు చెప్పారు. రైతుబంధు కోసం రైతులు దరఖాస్తు చేస్తే పరిశీలించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రతివాదన చేస్తూ.. సింగిల్ జడ్జి తీర్పుతో భూసేకరణ రద్దయ్యిందని, కాబట్టి ధరణి పోర్టల్‌లో రైతులు లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తద్వారా సింగిల్ జడ్జి తీర్పును ఆమోదించినట్టు అవుతుందని అన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, పిటిషనర్లు అదనపు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కోర్టు.. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

మొదటిపేజీ తరువాయి...

ఫార్మాసిటీపై ప్రభుత్వం దిగిరాగా.. ఫ్యూచర్ సిటీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వాస్తవానికి భూసేకరణ చట్టం-2013 ప్రకారం.. ప్రభుత్వం సేకరించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు. ఒకవేళ అలా చేస్తే రైతులు తమ భూములను వెనక్కి తీసుకునే హక్కు ఉంటుంది. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు తెలియంది కాదు. అయినా ఇన్నాళ్లూ ఫ్యూచర్ సిటీ పేరుతో ఎందుకు డ్రామా ఆడినట్టు? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీకి అంకురార్పణ జరిగిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ తదితర మండలాల పరిధిలో 19,333 ఎకరాల్లో దీన్ని ప్రతిపాదించగా 2018 సెప్టెంబర్‌లోనే దీనికి పర్యావరణ అనుమతులు లభించాయి. 13,000 ఎకరాల భూములు ఇదివరకే సేకరించగా, మొదటి దశలో దాదాపు 8,500 ఎకరాల్లో ఫార్మాసిటీని ప్రారంభించాలని గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భూసేకరణ చట్టం- 2013తోపాటు తెలంగాణ ప్రభుత్వం చట్ట సవరణ-2017 ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించి, పునరావాసానికి చర్యలు తీసుకోవాలి. ఏ ప్రాజెక్టు కోసం భూములు సేకరించారో, దానికే వినియోగించాలి. ఒకవేళ ప్రాజెక్టు అమలు కాకపోతే రైతులు తమ భూములను వాపస్ తీసుకునే అధికారం ఉంటుంది. అలాగే, పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం.. అనుమతులు తీసుకున్న ప్రాజెక్టును మాత్రమే అమలు చేయాల్సి ఉంటుంది. ఒకదాని కోసం పర్యావరణ అనుమతులు పొంది, మరో ప్రాజక్టు చేపట్టే అవకాశం లేదు.

ఫ్యూచర్ సిటీ పేరిట డ్రామా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఫార్మాసిటీని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పలుమార్లు ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములు, చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో కలిపి 'ఫ్యూచర్ సిటీ' పేరుతో నాలుగో నగరాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలలుగా ఊదరగొడుతున్నారు. రాష్ట్రంతోపాటు దేశ, విదేశాల్లో ఎక్కడ తిరిగినా ఇదే మాట చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఇతర పనులకు వినియోగించరాదు. కానీ ప్రభుత్వం ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది. గతంలో ఫార్మాసిటీ అవసరాలకు తగినట్టుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని యూనివర్సిటీగా మార్చింది. నిబంధనల ప్రకారం ఫార్మా కోర్సులు మాత్రమే ఉండాలి. కానీ గుండుసూది నుంచి విమానం వరకు అన్నీ తయారు చేసేలా శిక్షణ ఇస్తామని ప్రభుత్వం ఊదరగొడుతున్నది. ఇదే ప్రాంతంలో 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి 60 ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఇటీవల రాష్ట్రానికి ఏ వ్యాపారవేత్త వచ్చినా ఫోర్త్ సిటీలో స్థలం కేటాయిస్తామని, పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు. మెట్రో రైలును సైతం ఫోర్త్‌సిటీ నుంచి వెళ్లేలా అలైన్‌మెంట్‌ను మార్చారు.

ఫార్మా క్లస్టర్ల పేరుతో మరో డ్రామా..

ఫార్మాసిటీని రద్దు చేసిన ప్రభుత్వం 'సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల' పేరుతో కొత్త డ్రామాకు తెరలేపింది. ఓఆర్‌ఆర్ చుట్టూ ఆర్‌ఆర్‌ఆర్ మధ్య క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఒక్కో క్లస్టర్‌లో మూడు నుంచి నాలుగు ఫార్మా విలేజ్‌లు ఉండేలా ప్లాన్ చేసింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం నుంచే దీనికి అంకురార్పణ చేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లిలో 1373 ఎకరాల్లో క్లస్టర్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించింది. ఈ మేరకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత రంగారెడ్డి, సంగారెడ్డి.. ఇలా వరుసగా ఒక్కో జిల్లాలో భూసేకరణ చేపట్టింది. మొత్తం 20 వేల ఎకరాలు సేకరించే ప్రయత్నం చేసింది



మంకుపట్టు పడితే పడావే..

గతంలో రాజశేఖర్‌రెడ్డి హయాంలో 'ఫ్యాబ్ సిటీ' పేరుతో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో భూములు సేకరించింది. ఆశించిన పెట్టుబడులు రాకపోవడం, ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేకపోవడంతో దశాబ్దాలపాటు భూములు పడావుగా ఉండిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అనేక విజ్ఞప్తుల తర్వాత కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా ఆ భూమిని డీనోటిఫై చేస్తున్నది. ఫార్మాసిటీ భూముల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం మొండిపట్టుదలకు పోతే ఇదే జరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రైతుల పోరాటంతో బెడిసికొట్టిన ప్లాన్

ఫ్యూచర్ సిటీ పేరుతో 25 వేల ఎకరాలు, ఫార్మా క్లస్టర్ల పేరుతో 20వేల ఎకరాల్లో 'ఫార్మా'య చేయాలనుకున్న ప్రభుత్వం ప్లాన్ రైతుల పోరాటంతో బెడిసికొట్టింది. ఫార్మాసిటీ కింద భూములు కోల్పోయిన రైతులు కోర్టును ఆశ్రయించారు. ఫార్మాసిటీని ఇతర అవసరాలకు వినియోగించే వెసులుబాటు భూసేకరణ చట్టంలో లేదని, కాబట్టి ఫార్మాసిటీనే ఏర్పాటు చేయాలని లేదా తమ భూములు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఫార్మా క్లస్టర్ల బాధితులు సైతం ప్రభుత్వంపై తిరగబడ్డారు. తమ భూములను ఫార్మా కంపెనీలకు అప్పగించి గ్రామాల్లో విషం నింపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డిని సొంత నియోజకవర్గ ప్రజలే ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయపోరాటం మొదలుపెట్టారు. ఇలా అటు ఫార్మాసిటీ, ఇటు ఫార్మా క్లస్టర్ల రైతుల పోరాటంతో ప్రభుత్వం వేసిన ప్లాన్ మొత్తం విఫలమై కథ అడ్డం తిరిగింది. ఫార్మాసిటీని కొనసాగించక తప్పని పరిస్థితి తలెత్తింది. ఫలితంగా.. ఫార్మాసిటీని కొనసాగిస్తామని ప్రభుత్వం హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేసింది. కేవలం తమ 'ఫ్యూచర్' కోసం చేపట్టిన నాలుగో సిటీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

● ఫార్మాకు సాగు భూములను ఇవ్వం



దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా హకీంపేట చౌరస్తాలో రైతులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండాల పరిధిలో 1300 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఫార్మా కంపెనీ కోసం భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. -బొంరాస్‌పేట



శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో జస్టిస్ ఈశ్వరయ్య నివాసంలో సమావేశమైన బీసీ ప్రతినిధుల బృందం

బీసీలకు వాటా దక్కేదాకా ఉద్యమించాలి

జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బీసీలకు న్యాయమైన వాటా దక్కేదాకా పోరాడాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఉద్బోధించారు. శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలోని బీసీ నాయకులు జస్టిస్ ఈశ్వరయ్య నివాసంలో సోమవారం సమావేశం అయ్యారు. బీసీలకు దక్కాల్సిన వాటా కోసం.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్, బీసీ కులగణన వంటి అంశాల అమలుకు బీఆర్‌ఎస్ చేస్తున్న ఒత్తిడిలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలో బీసీ ప్రతినిధుల బృందం జస్టిస్ ఈశ్వరయ్యతో సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, సమగ్ర కులగణన సాధ్యమేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధన కోసం బీసీలు అగ్రభాగాన నిలిచారని, అదే స్ఫూర్తితో బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. 'మేమెంతో మాకంతా, మా వాటా మాకే' అనే నినాదాలతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మన హక్కుల కోసం పోరుబాటకు ఇదే సరైన సమయం అని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నామని, ఇందులో భాగంగానే బీసీ మేధావి వర్గాన్ని కలుస్తున్నామని ప్రతినిధుల బృందం జస్టిస్ ఈశ్వరయ్యకు వివరించింది. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్సీలు రమణ, శంభీపూర్ రాజు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఉద్యమనాయకులు గంగాధర్‌గౌడ్, కర్నె ప్రభాకర్, భిక్షమయ్యగౌడ్, భగత్, రాకేశ్, ఆంజనేయులు, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్‌గౌడ్, సుధీర్‌కుమార్, ఉపేంద్రాచారి, కిశోర్‌గౌడ్, శుభప్రద పటేల్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, ఆలకుంట హరి, గడీల కుమార్‌గౌడ్, మన్నె రాజు పాల్గొన్నారు.

● భార్యపై ప్రేమతో విగ్రహం ఏర్పాటు

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఎడ్లబంజర గ్రామానికి చెందిన అశోక్ కన్న, పద్మశ్రీ 2006లో ప్రేమ పెండ్లి చేసుకున్నారు. వీరికి ఓ కూతురు ఉంది. అనారోగ్యంతో పద్మశ్రీ గత నెల 28న మృతిచెందింది. నెల మాసికం సందర్భంగా గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో భార్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడు. సోమవారం బంధువుల సమక్షంలో పూలమాలలు వేసి నివాళులర్పించిన అశోక్.. పద్మశ్రీపై ప్రేమను చాటుకున్నాడు. -పెనుబల్లి



విచారణ కమిటీపై 'స్త్రీనిధి' సమాఖ్య హర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : స్త్రీనిధి సంస్థ, సంస్థ ఎండీ పై నలుగురు ఉన్నతాధికారులతో ప్రభుత్వం వేసిన విచారణ కమిటీని స్వాగతిస్తున్నట్టు స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇందిర, రాఘవదేవి, కోశాధికారి సరస్వతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థపై అనవసరమైన అపోహలు కలిగించి సంస్థ పనితీరు, అభివృద్ధిపై ప్రభావం చూపేలా, సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కొందరు వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కమిటీ ద్వారా వాస్తవాలు తెలుస్తాయని, అపోహలు తొలిగిపోతాయని తెలిపారు. విచారణ కమిటీ ఏర్పాటుపై హర్షంవ్యక్తం చేశారు.



ఇండీ రేసింగ్ అదుర్స్

అరంగేట్రం సీజన్‌లోనే మూడో స్థానం

ఎఫ్ఐఎం-ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్

క్రాన్స్ మెంటానా(స్విట్జర్లాండ్): భారత తొలి ఎలక్ట్రిక్ బైక్ రేసింగ్ జట్టు 'ఇండీ రేసింగ్' కొత్త చరిత్ర లిఖించింది. ఎఫ్ఐఎం-ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగిన తొలిసారే మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది. స్విట్జర్లాండ్ లోని క్రాన్స్ మెంటానా వేదికగా జరిగిన మోగాటోర్నీ చివరి రౌండ్‌లో ఇండీ రేసింగ్ మహిళా రైడర్ శాండ్రా గోమెజ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మహిళల విభాగంలో గోమెజ్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలువగా, ఓవరాల్‌గా ఇండీ రేసింగ్ మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన నాలుగు రేసుల్లో ఇండీ రేసింగ్ 479 పాయింట్లు సాధించగా, బోనెల్ రేసింగ్ (498), హోండా రేసింగ్ టీమ్ (490) తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. మహిళల కేటగిరీలో గోమెజ్ 271 పాయింట్లతో సీజన్ విజేతగా నిలిచింది. ప్రపంచ ఈ-రేసింగ్ టోర్నీలో భారత్‌కు పతకం దక్కడం సంతోషంగా ఉందని ఇండీ రేసింగ్ యజమాని అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. పోటీకి దిగిన తొలి సీజన్‌లోనే రాణించడం గర్వంగా ఉందన్నారు.

భారత దేశవాళీ క్రికెట్ భేష్

- **లంకాషైర్ సీఈవో డేనియల్ గిడ్నీ**

లండన్: క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన యూకేలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'కౌంటీ చాంపియన్‌షిప్' ప్రతిష్ట నానాటికీ మసకబారుతుందని, కానీ భారత్‌లో దేశవాళీ క్రికెట్ మాత్రం అద్భుతంగా పురోగమిస్తుందని లంకాషైర్ సీఈవో డేనియల్ గిడ్నీ అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లతో దేశవాళీలు ఆడించడం మంచి విషయమని ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లండ్ క్రికెటర్లు కౌంటీ చాంపియన్‌షిప్‌ను పెద్దగా పట్టించుకోరని.. అయితే ఇందులో ఆటగాళ్ల, అడ్మినిస్ట్రేటర్లు, కోచ్‌ల కంటే ఏజెంట్ల పాత్ర కీలకమని చెప్పాడు. వారి వల్లే కౌంటీ క్రికెట్ భవిష్యత్ ప్రమాదంలో పడిందని ఆయన అన్నాడు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిడ్నీ మాట్లాడుతూ.. 'ఒక గవర్నింగ్ బాడీ ఇలా (జాతీయ జట్టు క్రికెటర్లు దేశవాళీలో ఆడేలా ఆదేశించడం) చెప్పడం గొప్ప విషయం. కానీ మాకు (ఇంగ్లండ్‌లో) అలా జరగడం లేదు. ఇక్కడ ఉండే ఏజెంట్లు కౌంటీ చాంపియన్‌షిప్‌ను అసలు కేర్ చేయరు. ఇంగ్లండ్ ఆటగాళ్లు కౌంటీలు ఆడేందుకు ఇష్టపడరు' అని అన్నాడు.

టీమ్ యూరప్‌దే లేవర్ కప్



బెర్లిన్ (జర్మనీ): టెన్నిస్‌లో ప్రతిష్టాత్మక లేవర్ కప్ ట్రోఫీని టీమ్ యూరప్ సొంతం చేసుకుంది. స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ సింగిల్స్‌తో పాటు డబుల్స్ విభాగంలోనూ సత్తాచాటి టీమ్ యూరప్‌నకు ఐదో లేవర్ కప్ ట్రోఫీని అందించాడు. తొలి సింగిల్స్‌లో అల్కారజ్.. 6-2, 7-5తో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. కానీ రెండో సింగిల్స్‌లో మెద్వెదెవ్ 7-6 (8/6), 5-7, 7-10తో ఓటమి పాలయ్యాడు. మూడో సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-7 (5/7), 7-5, 10-5తో ఫ్రాన్సిస్ టియాఫోను ఓడించాడు. డబుల్స్ విభాగంలో అల్కారజ్-రూడ్ ద్వయం 6-2, 7-6 (8/6)తో టియాఫో-షెల్టన్‌ను ఓడించడంతో టీమ్ యూరప్ 13-11తో టీమ్ వరల్డ్‌ను ఓడించి టైటిల్ గెలిచింది.

చెస్ ఒలింపియాడ్‌లో మెరిసిన ఓరుగల్లు బిడ్డ

కింగ్ అర్జున్

అద్భుత ప్రదర్శనతో రెండు స్వర్ణాలు కైవసం

భారత్ చారిత్రక విజయంలో కీలక భూమిక

నమస్తే ప్రత్యేకం





ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయ పతాక ఎగురవేసింది. హంగరీ దేశాన మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వచ్చిన ఒలింపియాడ్‌లో పసిడి పతక ధమాకాతో కొత్త చరిత్ర లిఖించింది. ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు కైవసం చేసుకుని భారత్ సత్తాచాటింది. ఈ చారిత్రక విజయంలో మన తెలంగాణకు చెందిన ఇరిగేసి అర్జున్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. దేశానికి పసిడి పతకం అందించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఓరుగల్లు ముద్దుబిడ్డ అనుకున్నది సాధించాడు. వరుస విజయాలతో ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తూ చిరకాల కలను సాకారం చేయడంలో కీలకమయ్యాడు. రౌండ్ రౌండ్‌కు గెలుపు వాడిని పెంచుకుంటూ పోయిన అర్జున్ వ్యక్తిగత స్వర్ణం సహా టీమ్ ఈవెంట్‌లో పసిడి కొల్లగొట్టి ఔరా అనిపించాడు. ప్రత్యర్థి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ భారత్‌ను గెలుపు సంబురాల్లో ముంచెత్తిన అర్జున్ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు పంచుకున్నాడు.

చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయంపై?

❖ సుదీర్ఘ చరిత్ర కల్గిన చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చిరస్మరణీయ విజయం చిరకాలం గుర్తుండిపోతుంది. మేము ప్రాతినిధ్యం వహించిన ఓపెన్ విభాగంతో పాటు మహిళల కేటగిరీలోనూ భారత్ పసిడి పతకాలతో మెరువడం మరిచిపోలేనిది. ఇప్పటి వరకు సాధ్యపడని డబుల్ ధమాకా(రెండు స్వర్ణాలు) ప్రదర్శన ఇన్నేండ్లకు సాధ్యపడింది. టోర్నీ ఆసాంతం ప్లేయర్లందరూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో ముందుకుసాగుతూ ట్రోఫీ కైవసం చేసుకున్నాం.

మెగాటోర్నీలో మీపై అంచనాలు?

❖ ఒలింపిక్స్‌కు సమానంగా భావించే చెస్ ఒలింపియాడ్‌లో టోర్నీకి ముందు నాపై పెద్దగా అంచనాలేమి లేవు. అదీ నా విజయానికి కారణమైందని చెప్పొచ్చు. చెస్ ఒలింపియాడ్ కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టలేదు. సాధారణ టోర్నీల్లాగే బరిలోకి దిగాను. కానీ ఈసారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న లక్ష్యాన్ని మనసులో అనుకున్నాను. ఇలా చేయడం వలన ఒత్తిడి దరిచేరకుండా చేయవచ్చన్న ఆత్మవిశ్వాసంతో సాగడం కలిసివచ్చింది.

ఈ విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?

❖ ఇన్నేండ్ల నా కెరీర్‌లో దక్కిన అపూర్వ విజయాన్ని బాగా ఆస్వాదిస్తున్నాను. నాపై పెట్టుకున్న అంచనాలను వమ్ముచేయకుండా జట్టు విజయంలో కీలకమైనందుకు సంతోషంగా ఉంది. జట్టు వ్యూహాల్లో భాగంగా నేను, గుకేశ్ ప్రత్యర్థుల ఎత్తులకు చిక్కకుండా ముందుకు సాగాం. ముందే నిర్దేశించుకున్న వ్యూహం ప్రకారం గుకేశ్ తొలి బోర్డులో ఆడితే నేను మూడో బోర్డులో పోటీకి దిగడం కలిసివచ్చింది. టోర్నీ తొలి రౌండ్లలో ఒకింత తడబడినా..ప్రత్యర్థులకు తలొగ్గలేదు. ఆడిన 11 రౌండ్లలో 10 పాయింట్లతో టాప్‌లో నిలిచినందుకు గర్వంగా ఉంది. మొత్తం 11 రౌండ్లలో తొమ్మిది విజయాలు రెండు డ్రాలు ఎదుర్కొన్నాను. డ్రా అయిన రెండింటిలో గెలిచే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాను.

టోర్నీలో మరిచిపోలేని సందర్భం?

❖ టోర్నీ మొత్తమ్మీద అమెరికాతో జరిగిన 10వ రౌండ్ పోరు హోరాహోరీగా సాగింది. స్వర్ణం సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో మన ప్లేయర్లు సత్తాచాటారు. తొలుత ఫాబియానో కరువానపై గుకేశ్ గెలువడం కలిసొచ్చింది. అయితే వెస్లీ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోవడం, లెవాన్ ఆరోనియాన్‌తో విదిత్ గుజరాతి గేమ్ డ్రా చేసుకోవడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కీలకమైన ఆఖరి పోరులో నేను డోమింగెజ్ పెరెజ్‌పై గెలువడంతో భారత్ 2.5-1.5తో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో మరో రౌండ్ మిగిలుండగానే 19 పాయింట్లతో టాప్‌లోకి దూసుకొచ్చాం. చివరిదైన 11 రౌండ్‌లో స్లోవేనియాపై 3.5-0.5తో విజయంతో స్వర్ణం మన ఖాతాలో చేరింది.

మహిళల విజయంపై మీ స్పందన?

❖ టోర్నీలో మాతో పాటు మహిళల విభాగంలోనూ స్వర్ణం దక్కడం చారిత్రక సందర్భం. ద్రోణవల్లి హారిక లాంటి సీనియర్లకు తోడు వంతిక అగర్వాల్, దివ్యా దేశ్‌ముఖ్, తానియా సచ్‌దేవ్, వైశాలి అద్భుత ప్రదర్శన కనబరిచారు.

భవిష్యత్ లక్ష్యాలేంటి?

❖ నాకంటూ సుదీర్ఘమైన లక్ష్యాలేమి లేవు. టోర్నీకి టోర్నీకి ప్రాధాన్యం మారుతూ ఉంటుంది. అక్టోబర్‌లో లండన్ వేదికగా గ్లోబల్ చెస్ లీగ్ జరుగబోతున్నది. ఐపీఎల్ తరహాలో ఫ్రాంచైజీలు ప్రాతినిధ్యం వహించే లీగ్‌లో ఆడబోతున్నాను. ఇదో వైవిధ్యమైన టోర్నీ. వివిధ దేశాల ప్లేయర్లతో కలిసి ఆడటం కొత్త అనుభూతిని ఇస్తుంది.

ఫైనల్స్‌కు బాంబ్రీ జోడీ

ఢిల్లీ: చైనా వేదికగా జరుగుతున్న రెండు ఏటీపీ 250 టోర్నీలలో భారత టెన్నిస్ ఆటగాళ్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఏటీపీ 250 చెంగ్డూ ఓపెన్ డబుల్స్ సెమీస్‌లో భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ, తన ఫ్రెంచ్ సహచరుడు అల్బానో ఒలివెట్టి జోడీ ఫైనల్స్‌కు చేరింది. సెమీస్‌లో ఈ ఇండో-ఫ్రెంచ్ ద్వయం.. 6-3, 7-6తో ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా), రఫెల్ మా టోస్ (బ్రెజిల్)ను ఓడించింది. ఇక హాంగ్జో ఓపెన్‌లో మరో భారత జోడీ జీవన్- విజయ్ 0-6, 6-2, 10-4తో మూడో సీడ్ బెహర్(ఉరుగ్వే), రాబర్ట్ (యూఎస్ఏ)ను చిత్తు చేసింది.

దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం



షార్జా: అఫ్గానిస్థాన్ చేతిలో వరుసగా రెండు వన్డేలు ఓడి సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం దక్కింది. ఆదివారం రాత్రి ముగిసిన మూడో వన్డేలో 7వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత అఫ్గన్‌ను 34 ఓవర్లలో 169 పరుగులకే ఆలౌట్ చేసిన సఫారీలు.. ఛేదనను 33 ఓవర్లలోనే పూర్తిచేశారు. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా అఫ్గన్లు సిరీస్‌ను 2-1తో గెలిచి చరిత్ర సృష్టించారు.


లంకదే తొలి టెస్టు



గాలె: సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 63 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. 275 పరుగుల ఛేదనలో భాగంగా కివీస్ 211 పరుగులకే ఆలౌట్ అయింది. ఆఖరి రోజు ఆ జట్టు విజయానికి 68 పరుగులు కావాల్సి ఉండగా ఆ జట్టు మరో 5 పరుగులే జతచేయగలిగింది. న్యూజిలాండ్ భారీ ఆశలు పెట్టుకున్న రచిన్ రవీంద్ర (92) ఒక్క పరుగు మాత్రమే జోడించి ఔటయ్యాడు. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ఐదు (5/68) వికెట్లతో విజృంభించాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 24 సెప్టెంబర్ 2024
www.ntnews.com
II






నాడులు చెదరకుండా..

మెదడుకు అండాదండా!

మెదడులో గడ్డ అనగానే ఉలికిపడతాం. ప్రాణభయంతో వణికిపోతాం. కానీ గడ్డ ఎలాంటిదైనా, ఎంత పరిమాణంలో ఉన్నా, ఏ రకమైనా... దాన్నుంచి విముక్తి కలిగించి ప్రాణాలను తిరిగి నిలబెట్టే సురక్షితమైన, అంతిమ చికిత్స 'ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్' ఆపరేషన్. మెదడుకు సంబంధించిన గడ్డల విషయంలో ఈ సర్జరీ విధానాన్ని మించిన సమర్థమైన, ఫలవంతమైన, సురక్షితమైన చికిత్స ఇప్పటివరకు ఇంకొకటి లేదు.

కిరణ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. 32 ఏండ్లు. ఆఫీసులో సహోద్యోగులతో మాట్లాడేటప్పుడు అతనికి ఉన్నట్టుండి నాలుక సహకరించడం మానేసింది. ఎందుకిలా జరుగుతుందని వైద్యులను కలిసి పరీక్షలు చేయిస్తే, మెదడులో క్యాన్సర్ గడ్డ మాటలకు సంబంధించిన నాడిని నొక్కేస్తున్నట్టు తేలింది. మెదడులో క్యాన్సర్ గడ్డ అనగానే కిరణ్ సర్జరీ గురించి ఎంతో భయపడిపోయాడు. మెదడుకు సర్జరీ అంటే ఏమైనా జరగవచ్చు. ఏమాత్రం పొరపాటు జరిగినా నాడులు దెబ్బతిని మాట పూర్తిగా పోవచ్చు. అంతకుమించిన నష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. అయితే తన భయాలన్నీ అర్థం లేనివని సర్జరీ తర్వాత కిరణ్‌కు అర్థమైంది. సర్జరీతో క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందడమే కాకుండా, మునుపటిలా ధారాళంగా మాట్లాడగలుగుతున్నాడు. మెదడులో గడ్డల చికిత్సలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ, న్యూరో నేవిగేషన్, న్యూరో మానిటరింగ్ పరికరాలు, సౌకర్యాలు, అనుభవజ్ఞులైన న్యూరో సర్జన్ డాక్టర్ల వల్లే ఇది సాధ్యపడింది. క్లిష్టమైన నాడీ విభాగానికి సంబంధించిన మెదడు సర్జరీలలో ఉపయోగించే ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ టెక్నిక్‌ల గురించి, ఈ చికిత్స ఉపయోగాల గురించి తెలుసుకోవాలి.



మెదడులో గడ్డలు

మెదడులో క్యాన్సర్ (మాలిగ్నెంట్) లేదా క్యాన్సర్ కాని (బినైన్) రెండు రకాల గడ్డలు తలెత్తుతూ ఉంటాయి. ఇవి ఏర్పడ్డ ప్రదేశాన్ని బట్టి అక్కడి నాడులతో సంబంధం ఉన్న అవయవాలు ప్రభావితమవుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు సర్జరీతో ఆ ప్రదేశంలో గడ్డను తొలగించాలి. ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ విధానం అందుబాటులోకి రాకముందు మెదడులోని గడ్డలను తొలగించే సర్జరీ సమయంలో కేవలం కంటికి కనిపించినంత మేరకే గడ్డను తొలగించేవారు. ఆ సమయంలో అక్కడి నాడులు ఎంతమేరకు పనిచేస్తున్నాయి? వాటికి స్పందనలు ఉన్నాయా? అనే విషయాలను వైద్యులు తెలుసుకునే వీలు ఉండేది కాదు. దాంతో నాడికి నష్టం జరగకుండా గడ్డను తొలగించడం మీదే వైద్యులు దృష్టి పెట్టేవారు. ఆ జాగ్రత్తలో భాగంగా నాడికి నష్టం జరగకుండా ఉండటం కోసం తొలగించే వీలున్నా కొంత క్యాన్సర్ గడ్డను అలాగే వదిలేసి, కుట్లు వేసేవారు. అలా సర్జరీ ముగిసిన తర్వాత రేడియేషన్, కీమోథెరపీలతో క్యాన్సర్ నయం చేసేవారు. కానీ, పూర్తిగా తొలగించకుండా వదిలేసిన ఆ కొద్ది క్యాన్సర్ గడ్డ తర్వాతి కాలంలో పెరిగి సమస్యలు తెచ్చి పెడుతుంది. దీంతో రెండోసారి సర్జరీ అవసరం పడేది. అయినా కూడా పూర్తి ప్రయోజనం దక్కడం అనుమానమే.



నాడులు పదిలంగా...

కాబట్టి, బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సమయంలో నాడులు దెబ్బతినకుండా ఉండాలంటే క్యాన్సర్ గడ్డ చుట్టూ ఉన్న నాడులకు ఏయే అవయవాలతో సంబంధం ఉందో, ఆ అవయవాలు స్పందిస్తున్నాయా లేదా అనేది గమనిస్తూ ఉండాలి. ఉదాహరణకు, కాలుకు సంబంధించిన నాడులకు స్పందనలు ప్రసారం చేసే మెదడులోని ఓ భాగంలో గడ్డ ఏర్పడింది అనుకుందాం. ఆ ప్రదేశంలో నాడి చుట్టూ పరుచుకుని ఉన్న ఆ గడ్డను తొలగిస్తున్నప్పుడు మెదడు నుంచి ఆ నాడికి సంకేతాలు అందుతున్నాయో, లేదో గమనిస్తూ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఇలాంటి వీలు ఉంటేనే వైద్యులు గడ్డను నూటికి నూరు శాతం తొలగించగలుగుతారు. ఇందుకు ఇంట్రా ఆపరేటివ్ సర్జరీలోని 'న్యూరో మానిటరింగ్' అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుంది. అయితే, ఈ చికిత్సలో నాడులకు మెదడు నుంచి అందే స్పందనలను తెలుసుకోవాలంటే రోగిని మెలకువతో ఉంచి సర్జరీ చేయాలి. అందువల్ల మిగతా సర్జరీల్లో లాగ రోగికి జనరల్ అనస్తీషియా ఇవ్వడం సాధ్యపడదు. కాబట్టి నొప్పి తెలియకుండా, రోగిని మెలకువగా ఉంచే ప్రత్యేకమైన మత్తు ఇంజెక్షన్లు ఇస్తారు. ఇలాచేసే సర్జరీని అవేక్ సర్జరీ అంటారు.

వైద్యులు అప్రమత్తంగా...

న్యూరో మానిటరింగ్ సాయంతో ఆపరేషన్ థియేటర్‌లో ఉండే టెక్నీషియన్లు... సర్జరీ చేస్తున్నప్పుడు నాడుల స్పందనను గమనిస్తూ, ఏ చిన్న తేడా వచ్చినా వైద్యులను అప్రమత్తం చేస్తారు. దాంతో వైద్యులు నాడి దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా గడ్డను తొలగిస్తారు. నాడి దెబ్బతింటున్నది అని హెచ్చరికలు వస్తే, మరింత లోతుకు వెళ్లకుండా ఆగిపోతారు. మరీ ముఖ్యంగా ఇలాంటి గడ్డల కారణంగా నాడులు దెబ్బతిని ముఖాన్ని అందవిహీనంగా మార్చేసే పాక్షిక పక్షవాతానికి గురికాకుండా ఉండాలంటే ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ చికిత్సనే ఆశ్రయించాలి. మిగిలిపోయిన గడ్డను కీమోథెరపీ, రేడియేషన్లతో కరిగించవచ్చు. ఇలా జాగ్రత్త పడటం వల్ల నాడి సురక్షితంగా ఉండి, ముఖం యథాతథంగా ఉంటుంది. దాంతో జీవన నాణ్యత పెరుగుతుంది. అదే సమయంలో క్యాన్సర్ నుంచి పూర్తి విముక్తి దక్కుతుంది.

గడ్డకు త్రీడి రూపం..

న్యూరో నేవిగేషన్

నేవిగేషన్ అంటే 'దారి చూపించడం'. మెదడు, దానిలో గడ్డ, అది పెరిగిన తీరు, మెదడులో అది చొచ్చుకువెళ్లిన దూరం, గడ్డవల్ల నాడుల మీద పడే ఒత్తిడి.. ఇవన్నీ కంటితో చూసి కనిపెట్టలేం! కానీ ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ చికిత్సా విధానంలోని న్యూరో నేవిగేషన్ మెదడు, గడ్డ, నాడులు... ఈ మూడిటిని మూడు కోణాల్లో స్పష్టంగా చూపిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రాని రోజుల్లో వైద్యులు కేవలం తమ అనుభవాన్ని బట్టి గడ్డ పరిమాణాన్ని, ప్రదేశాన్ని అంచనా వేసి సర్జరీతో తొలగించేవారు. ఇలా చేయడం వల్ల నాడులు దెబ్బతినవచ్చు. గడ్డ ఎంతోకొంత మెదడులోనే మిగిలిపోవచ్చు. లేదంటే గడ్డను తొలగించే క్రమంలో నాడులకు నష్టం జరిగి పక్షవాతం కూడా రావచ్చు. కానీ, న్యూరో నేవిగేషన్‌తో నాడులకు ఏమాత్రం నష్టం జరగకుండా నేర్పుగా, సమూలంగా గడ్డను తొలగిస్తున్నారు.

సత్వర స్కానింగ్..

ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ

మెదడులో అవసరమైనంత మేరకు గడ్డ తొలగించి కుట్లు వేసిన తర్వాత, ఎంఆర్ఐ పరీక్షలో మరికొంత క్యాన్సర్ గడ్డ మిగిలిపోయిందని తేలితే? ఆ గడ్డను తొలగించడం కోసం మరొక సర్జరీ చేయడం శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అలాగని ఆ గడ్డను వదిలేస్తే అది తిరిగి పెరిగిపోయి ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి ఇలాంటి పొరపాట్లకు వీలు లేకుండా సర్జరీ చేస్తున్నప్పుడే, గడ్డను తొలగించి, తెరిచిన పుర్రెను మూయక ముందే ఎంఆర్ఐ స్కానింగ్ చేసే వెసులుబాటు ఈ ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ సర్జరీలో ఉంది. దీంతో అక్కడికక్కడే, అప్పటికప్పుడే గడ్డను పూర్తిగా తొలగించిందీ లేనిదీ తెలుసుకోవచ్చు. ఎంఆర్ఐ ఫలితాన్నిబట్టి గడ్డ ఇంకా మిగిలి ఉంటే వైద్యులు దాన్నికూడా సమూలంగా తొలగించి సర్జరీ ముగిస్తారు. దీనివల్ల క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి కలుగుతుంది.

> ### యశోదా ఆస్పత్రిలోనే..
> ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ సదుపాయం దక్షిణ భారతదేశం మొత్తంలో ఒక్క సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలోనే అందుబాటులో ఉంది. ఈ పరికరాలను ఉపయోగించాలంటే శిక్షణ పొందిన మెరుగైన సాంకేతిక నిపుణులు అవసరం. ఇలాంటి ట్రెయిన్డ్ అనస్థీషియన్లు యశోదా ఆస్పత్రిలో పనిచేస్తున్నారు.

ముదరక ముందే చికిత్స

క్యాన్సర్ అయినా, కాకపోయినా మెదడులో తలెత్తిన గడ్డలను తొలగించక తప్పదు. అయితే గడ్డ పరిమాణం పెరిగేకొద్దీ సమస్యలూ, నష్టం ఎక్కువవుతూ ఉంటాయి. కాబట్టి గడ్డ చిన్నదిగా ఉన్నప్పుడే త్వరపడాలి. చిన్నగడ్డ అయితే నరాలు దెబ్బతినకుండా ఉంటాయి. సర్జరీ తర్వాత క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకునే అవకాశాలూ పెరుగుతాయి. క్యాన్సర్ తిరగబెట్టే పరిస్థితులూ తగ్గిపోతాయి. అలా కాకుండా గడ్డ పెద్దగా మారిన తర్వాత సర్జరీకి వెళ్తే ఎక్కువ నాడులకు నష్టం జరుగుతుంది. పైగా సర్జరీ తర్వాత కిమోథెరపీ, రేడియేషన్ అవసరం పెరుగుతుంది కూడా! ఇంకా క్యాన్సర్ తిరగబెట్టే ప్రమాదమూ ఎక్కువే.

సర్జరీతో ఉపయోగాలు

మెదడులో గడ్డలను సమూలంగా తొలగించడంతోపాటు, ఎలాంటి దుష్ప్రభావాలకూ తావులేకుండా రోగికి నాణ్యమైన, మెరుగైన జీవితాన్ని అందించే ఉన్నతమైన చికిత్స ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్. ఈ సర్జరీతో మెదడులో గడ్డలను నూటికి నూరు శాతం తొలగించవచ్చు. అదే సమయంలో నాడులతోపాటు వాటినుంచి అవయవాలకు అందే స్పందనలను గమనిస్తూ, వాటిని కాపాడుకోవచ్చు. క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చు. సర్జరీ నుంచి కోలుకునే సమయాన్నీ తగ్గించుకోవచ్చు. ఇన్ని ఉపయోగాలు మెదడులో గడ్డలను తొలగించే మరే ఇతర చికిత్సలోనూ ఉండవు.



డాక్టర్. ఆర్. అయ్యదురై
సీనియర్ న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

> ### వెన్ను సమస్యలకు కూడా
> **పుట్టుకతో** కొంత మంది పిల్లలకు వెన్ను తెరుచుకొని ఉంటుంది. మరికొందరికి వెన్నుపాము వంకరగా ఉంటుంది. తెరుచుకుని ఉన్న వెన్నును సర్జరీతో మూయడానికి కూడా ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ ఉత్తమ చికిత్సగా నిలుస్తుంది. ఇక వెన్నుపాము మధ్యలో ఉండే నాడుల సముదాయం దెబ్బతింటే అవయవాలు శాశ్వత పక్షవాతానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, ఈ నాడులకు మెదడు నుంచి స్పందనల ప్రసారాన్ని గమనిస్తూ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఈ వెసులుబాటు ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ విధానంలోనే ఉంది. అలాగే వంకరగా ఉన్న వెన్నుపూసలను సరిచేసే (స్కోలియాసిస్), వెన్ను నిటారుగా మార్చడానికి కూడా ఈ విధానాన్ని ఆశ్రయించవచ్చు. వెన్నులోని నాడులు దెబ్బ తినకుండా సురక్షితంగా ఉండేలా జాగ్రత్తపడుతూ, వెన్నును సరిచేయడం ఈ విధానంతోనే సాధ్యం. అంతేకాకుండా, వెన్నుపాములో గడ్డలను తొలగించడానికి కూడా ఈ విధానమే శ్రేయస్కరం.

యూరిన్ రంగులో ఆరోగ్య మర్మాలు

మూత్రం రంగు మన ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలను సూచిస్తుంది. డీహైడ్రేషన్ మొదలుకుని తీవ్రమైన అనారోగ్యాల వరకు ఎన్నో ఆరోగ్యపరమైన అంశాల హెచ్చరికలు ఇందులో దాగి ఉంటాయి. మూత్రం రంగులో దాగిన ఆరోగ్య రహస్యాలను తెలుసుకుందాం.



స్వచ్ఛంగా ఉంటే
మన శరీరం తగినంత హైడ్రేషన్‌తో, ఆరోగ్యకరమైన ఫ్లూయిడ్ బ్యాలెన్స్‌తో ఉందనడానికి క్లియర్ యూరిన్ సంకేతం. అంటే మనం సరైన పరిమాణంలో నీళ్లు తాగుతున్నామని అర్థం. దీంతో కిడ్నీల పనితీరు సాఫీగా జరిగి టాక్సిన్లు బయటికి వెళ్లిపోతున్నాయని తెలుస్తుంది. అయితే ఒక్కోసారి ఓవర్ హైడ్రేషన్ వల్ల కూడా ఇలా జరిగే అవకాశం ఉంటుంది.

లేత పసుపు
మన శరీరం తగినంత హైడ్రేటెడ్‌గా ఉందని లేత పసుపు రంగు తెలియజేస్తుంది. కిడ్నీలు బాగా పనిచేస్తున్నాయని, వ్యర్థాలను సమర్థంగా తొలగిస్తున్నాయని సూచిస్తుంది.

ముదురు పసుపు
ఇది ఓ మోస్తరు డీహైడ్రేషన్‌కు సిగ్నల్. అంటే మన శరీరానికి మరిన్ని ఫ్లూయిడ్స్ అవసరమన్న మాట. మూత్రంలో వ్యర్థ పదార్థాల గాఢత పెరగడం వల్ల ఇలా జరుగుతుంది. నీళ్లు తీసుకునే మోతాదు పెంచితే గాఢత తగ్గి రంగు మామూలు స్థితికి వస్తుంది. శరీరంలో హైడ్రేషన్ స్థాయులు కూడా మెరుగుపడతాయి.

ఎర్రటి మూత్రం
మూత్రంలో రక్తం ఉంటే ఇలాంటి పరిస్థితి వస్తుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కిడ్నీల్లో రాళ్లు, ఇతర ఆరోగ్య సమస్యల వల్ల మూత్రం ఎర్రగా ఉండొచ్చు.

నారింజ రంగులో
డీహైడ్రేషన్ వల్లగానీ, లేదంటే కొన్ని రకాలైన ఆహార పదార్థాలు, మందుల వల్ల మూత్రం నారింజ రంగులో వస్తుంది. కాలేయం లేదా బైల్ జ్యూస్ సమస్యలకు హెచ్చరిక కూడా కావొచ్చు.

ఆకుపచ్చ, నీలం
ఇది చాలా అరుదుగా తలెత్తుతుంది. ఆహార పదార్థాల రంగులు, కొన్ని ప్రత్యేకమైన మందులు, లేదంటే వైద్య చికిత్సలో ఉపయోగించే కొన్ని రంగులు మొదలైన వాటివల్ల వస్తుంది. అయితే, బయటి కారకాల వల్ల కాకపోతే మాత్రం ఏదైనా ఆరోగ్య సమస్యల మూలంగా వచ్చి ఉండొచ్చని అనుమానించాలి.

గోధుమ లేదా ముదురు రంగు
తీవ్రమైన డీహైడ్రేషన్‌కు.. లేదంటే కాలేయం, కిడ్నీల సమస్యలకు సంకేతం. కొన్ని రకాలైన ఆహారం, ఔషధాల వల్ల కూడా ఇలా జరిగే అవకాశం ఉంది.


మేఘాల రంగులో
మూత్రంలో బ్యాక్టీరియా, తెల్ల రక్తకణాలు, స్ఫటికాల వంటివి ఉంటే ఇలా జరుగుతుంది. ఇది మూత్రనాళ ఇన్ఫెక్షన్, కిడ్నీల్లో రాళ్లకు సంకేతం.

నురగలా వస్తే..
డీహైడ్రేషన్ వల్ల గానీ, లేదంటే వెంటవెంటనే మూత్రానికి వెళ్లే పరిస్థితి వల్ల ఇలా జరుగుతుంది. దీర్ఘకాలం పాటు ఇలా జరుగుతుంటే అది ప్రొటీనూరియాకు సంకేతం. అంటే మూత్రంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండే సమస్య అన్నమాట. కిడ్నీల వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలకు దీన్ని సంకేతంగా భావించాలి.

తెల్లగా వస్తుంటే..
కొవ్వుతో కూడిన లింఫటిక్ ఫ్లూయిడ్స్ మూత్రంలోకి విడుదలయ్యే సమస్య.. కైలూరియా కారణంగా మూత్రం తెల్లగా వెలువడుతుంది. దీన్ని లింఫటిక్ లేదంటే కిడ్నీ సమస్యలకు సంకేతంగా భావించాలి.

ఒక పేగు మరో పేగులోకి చొరబడితే..

పిల్లల పెంపకం



మా అబ్బాయి వయసు తొమ్మిది నెలలు. అప్పుడప్పుడు.. ఒక్కసారిగా ఏడ్వడం మొదలుపెడతాడు. అప్పుడు బాగా ఇబ్బందిపడతాడు. ఓసారి హాస్పిటల్‌కి తీసుకుపోయాం. గ్యాస్ట్రిక్ సమస్య ఉందేమోనని మందులు ఇచ్చారు. కొంత ఉపశమనం ఉంది. కానీ, మళ్లీ మళ్లీ అలానే అవుతున్నది. కొన్నాళ్ల తర్వాత మలంలో రక్తం పడటం గమనించాం. కంగారుపడి హాస్పిటల్‌కి వెళ్లాం. స్కాన్ చేసి పేగులు మడతపడ్డాయని చెప్పారు. మా అబ్బాయికి ఇన్‌టు ససెప్షన్ సమస్య ఉందని చెప్పారు. వెంటనే ఆపరేషన్ థియేటర్‌కి తీసుకుపోయారు. కొంత ప్రొసీజర్ చేసి తగ్గించారు. ఇలా ఎందుకు జరిగింది. మళ్లీ ఈ సమస్య రావచ్చా?

ఆరు నెలల నుంచి ఏడాదిలోపు పిల్లల్లో పేగు ఒక భాగం ఇంకొక భాగంలోకి వెళ్తుంది. దానిని ఇన్‌టు ససెప్షన్ అంటారు. ఒక పేగు మరో పేగులోకి పోతే ఆ చొచ్చుకుపోయిన భాగంలో రక్త సరఫరా నిలిచిపోతుంది. అందుకే రక్తం కలిసిన మలం పడుతున్నది. ఇలా పడటాన్ని వైద్య పరిభాషలో రెడ్ కరెంట్ జెల్లీ స్టూల్ అంటారు. కొన్నిసార్లు ఈ సమస్య దానంతట అదే తగ్గిపోవచ్చు. అలా తగ్గకపోతే ఆపరేషన్ థియేటర్‌లో హైడ్రోస్టాటిక్ ప్రెజర్ చేస్తారు. ఈ పద్ధతిలో పేగుల్లోకి ద్రవాలను పంపి, పీడనం పెంచడం ద్వారా చొచ్చుకుపోయిన పేగులను సరిచేస్తారు. ఇలాచేసిన తర్వాత ఆ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం తక్కువ. కానీ, అసలే రాదని చెప్పలేం.

చిన్న పేగులు అన్నీ కూడా ట్యూబుల్లా ఉంటాయి. ఒక భాగం ఇంకో భాగంలోకి పోయినప్పుడు పేగులు టెలిస్కోప్‌లోని పైపుల్లా ఉంటాయి. ఇలా అయినప్పుడు పేగుల్లో పైనుంచి కిందికి పోవాల్సిన ఆహార పదార్థాలు చలనం లేకుండా నిలిచిపోతాయి. ఆ సందర్భంలో వాంతి అవుతుంది. టెలిస్కోపింగ్ వల్ల రక్త సరఫరా తగ్గిపోతుంది. దీనివల్ల ఇన్‌టు ససెప్షన్ జరుగుతుంది. ఇలా ఎందుకు జరుగుతుందో కొన్నిసార్లు కారణం తెలియదు. కానీ కొన్నిసార్లు లక్షణాల ఆధారంగా సమస్యను ముందే తెలుసుకోవచ్చు. కడుపు ఉబ్బరం, మళ్లీ మళ్లీ ఏడ్వడం, వాంతులు, మలంలో రక్తం, నీరసం... ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. కొందరు వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల ఈ సమస్య బారినపడతారు. ఇలాంటప్పుడు పేగుల్లో ఉండే గ్రంథుల్లో వాపు సంభవిస్తుంది. దీనివల్ల ఒక పేగులోకి మరో పేగు చొచ్చుకుపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

చియా.. లిమిట్‌లోనే



- చియా గింజలను ఎక్కువగా తీసుకుంటే.. జీర్ణ వ్యవస్థకు ఇబ్బంది. అందులోనూ తక్కువ నీటిలో ఎక్కువ గింజలను కలిపి తీసుకుంటే.. మరిన్ని తిప్పలు తప్పవు మరి.
- చియా గింజలు పడనివారికి చర్మ సమస్యలు ఎదురుకావొచ్చు. పూర్తిగా నానబెట్టకుండా తీసుకుంటే.. గొంతునొప్పి పలకరించవచ్చు.
- ఫైబర్ గనులు.. చియా గింజలు! ఈ ఫైబర్ పెరిగితే.. ఇతర పోషకాలపై ప్రభావం పడుతుంది. ఇతర ఆహార పదార్థాలలోని పోషకాలను శరీరం గ్రహించకుండా చేస్తుంది. దీంతో పోషకాహార లోపం ఏర్పడుతుంది.
- రక్తపోటు తగ్గడానికి చియా గింజల్ని ఆశ్రయిస్తారు. కానీ, ఎక్కువ మోతాదులో తీసుకుంటే.. లో బీపీ మిమ్మల్ని ఆశ్రయిస్తుంది.
- చియా గింజలు రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి. అయితే.. పరిమితికి మించి తీసుకుంటే ఆ నియంత్రణ అదుపు తప్పుతుంది. కొత్త ఇబ్బందులను తెచ్చిపెడుతుంది.
- ఈ గింజల్ని అదే పనిగా తీసుకుంటే.. శరీరంలో క్యాలరీలతోపాటు శరీర బరువూ పెరుగుతుంది.

అందుకే, అతి ఎప్పటికీ మంచిది కాదు... కాబట్టి, చియా గింజలను అవసరమైనంత వరకే తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు.